# ప్రశ్న

- వ్యాసాలు

## నిమిత



శ్రీ

కౌముది

మీ ముంగిట్లో సాహితీ వెన్నెల

www.koumudi.net





ప్రచురణ సంఖ్య: 15

# ఎందుకు అన్న ప్రశ్న ఎందుకంత ముఖ్యం?



"పదార్థానికి మూడు స్థితులుంటాయి. అవి ఘన, ద్రవ మరియు వాయువు". సుధా మేడం గొంతు ఇప్పటికీ స్పష్టంగా వినిపిస్తుంది నేనెప్పుడైనా ఈ సంఘటన్ని గుర్తు చేసుకున్నానంటే. జరిగి ఇన్నేళ్ళయినా మొట్టమొదటి సైన్స్ ప్రయోగం ఇప్పటికీ ప్రతి చిన్న అంశంతో సహా గుర్తుంది. పాఠం అయిపోయాక మనం ప్రతిరోజూ చూసే పదార్థాల్ని ఉపయోగించి కొన్ని నిదర్శనాలు చూపించారు. చిన్న సుద్ద ముక్క ఒక గ్లాసు నీళ్ళలో వేసి , బుడగల్ని చూపిస్తూ నీరు ఎలా ఆ సుద్ద ముక్కలో ఉన్న గాలిని స్థానభ్రంశం చేస్తుందో వివరించారు. పాఠం అయిన తర్వాత అందరూ టేబుల్ చుట్టూ చేరి సుధామేడంని రకరకాల ప్రశ్నలడుగుతున్నారు. అన్నింటికి ఓపిగ్గా సమాధానాలు చెపుతూ, ఇంకా తదేకంగా బుడగల వంకే చూస్తున్న నన్ను చూసి,

"ఏమిటీ, అర్థమైందా ఇవ్వాళ చెప్పిన పాఠం?" అనడిగారు.

"ఎందుకు నీరు గాలిని బయటకు నెట్టేస్తుంది?"

"నీటి సాంద్రత గాలి ప్రశ్న కన్నా ఎక్కువ, అందువల్ల"

"నీటి సాంద్రత ఎందుకని ఎక్కువ?"

"నీటి అణువు ధర్మాలు, గాలి అణువు ధర్మాల తేడాల వల్ల", మేడం గొంతులో కొంచం ఆత్రుత.

"ఎందుకలాగ? నీటి బరువు ఎందుకని ఎక్కువ?", పట్టువదలని విక్రమార్కుడి చెల్లెల్లా నేను ప్రశ్నా పరంపర కొనసాగించాను. "నీ ప్రశ్నలు కొన్నాళ్ళుగా గమనిస్తున్నాను. 'ఎందుకు' అనే మాట నీ ప్రతి ప్రశ్నలోనూ వినిపిస్తుంది. నీకు ఇప్పుడు చెపితే అర్థం కాదు కానీ, ఈ ప్రశ్నకి జవాబు చెప్పటం చాలా కష్టం", సుధా మేడం చెప్పిన జవాబు నాకు సమంజసంగా అనిపించలేదు. పైగా టీచర్ సమాధానం చెప్పలేని ప్రశ్న వేశాననుకొని చాలా గర్వపడ్డమూ గుర్తుంది. సంతోషమూ, సంతృప్తి ఎంత సులభంగా లభిస్తాయో కదా, బాల్యంలో?

ఆ మాటల వెనుక దాగి ఉన్న నిజం చాలా సంవత్సరాల తరువాత 'ఎందుకు ఇలాంటి నిర్ణయం తీసుకున్నావు?', అన్న ప్రశ్న విన్నప్పుడు కానీ అర్థం కాలేదు, ఆ పదం కొన్ని ప్రశ్నల్ని ఎంత క్లిష్టం చేస్తుందో! ఈ ప్రశ్న కొన్ని సార్లు హృదయాంతరాన్ని తరచి చూడమని అదేశిస్తే, మరి కొన్ని సార్లు మన ఊహల్ని, అభిప్రాయాల్ని ధిక్కరించి, ఆలోచనల్ని కొత్త దార్లు పట్టిస్తుంది. ఇంక అపాయకరమైన విషయమేంటంటే, మనకు తెలియకుండా మనకి చాలా అవసరమైన నమ్మకాల్ని వమ్ము చేస్తుంది. అంతకు మించి అసలైన ముఖ్య లక్షణమేమిటంటే, ఈ ప్రశ్న ఒక్కటే సైన్స్‌నీ, వేదాంతాన్ని వేరు చేస్తుంది.

నాకప్పటికి ఏడెనిమిదేళ్ళకి మించి ఉండవు.

మా కుటుంబం అంతా కలిసి మొదటిసారి శ్రీశైలం వెళ్ళినప్పుడు జరిగిన విషయం. శివరాత్రి కావడంతో ఆలయ ప్రాంగణం జనంతో క్రిక్కిరిసి ఉంది. ఆలయ ప్రాకారంలో ఉన్న అన్ని గుళ్ళూ దర్శించుకొని మల్లిఖార్జున స్వామి లింగం దర్శనం కోసం క్యూలో నుంచొని ఉన్నాం. దాదాపు రెండు గంటల తర్వాతనుకుంటా, క్యూ కొంచం కదిలి ఒక మలుపు తిరిగింది. ఎక్కడనుండి వచ్చిందో, వెనుక రెండు కాళ్ళ మీద నిలబడి, ముందు రెండు కాళ్ళు నా గుండెల మీద ఆనించి నా మొహంలో భయంకరంగా గర్జించింది. మన మెదడుకి అర్థంకాని భయమేదో సుడిగాలిలా చుట్టి, ఎక్కడో విశ్వానికవతలి కాంతివిహీన లోయల్లోకి విసిరేస్తే, అంత తీక్షణమైన భావాన్నర్థం చేసుకోలేక మెదడు దాన్ని తనకి తెలిసిన మరో భయానికి అనువదించుకొంటుంది. అలా, ఆరోజున నాకు మొట్టమొదటి సారిగా పరిచయమైన అనుభవం, "చావు". ఆ భిక్షగాడు చనిపోయి షుమారు కొన్ని గంటలో లేక ఒక రోజో అయ్యుండొచ్చు. అతని వొంటి మీద బట్టలు పెద్దగా లేవు, అతని చుట్టూ ఈగలు ముసురుతున్నాయి. నేను అటువైపే చూడడం గమనించేదేమో , అమ్మ నన్ను లాక్కుని తన చీర కుచ్చిళ్ళలో దాచింది. ఆ చర్యకు నేనెంత ఋణపడి ఉన్నానో, ఇంతవరకూ అమ్మకు చెప్పలేదనుకొంటా!

"ఒక మనిషి ప్రాణం పోయిందే, ఎవరికీ ఎందుకంత పట్టలేదు?"

"మరణానికి ఎందుకంత భయంకరమైన శక్తి?"

"మనిషి ఎందుకు మరణించాలి?"

"ఈ నల్లరాయికి నేనెందుకు నమస్కరించాలి? దీనికి బయట చూసిన చావుకున్నంత చలనం కూడా లేదే?"

ఇరవై సంవత్సరాల తర్వాత.. మరో దేశంలో.. మరో సమయంలో...

పేద ప్రజలకి సహాయం చేయడానికి ఒక మహిళ స్థాపించిన సంఘంలో సహాయం చేయడానికి వెళుతుండేదాన్ని. చాలామంది మహిళలు, తమ పిల్లల్ని తీసుకొని వచ్చి, సంఘానికి(అనగా వారిలో వారికే) ఉపయోగపడే ప్రాజెక్టులకి ఒక పూటంతా కలిసి పని చేసేవారు. ఒక్కొక్కళ్ళు(పిల్లలు కూడా) ఎంత కష్టపడ్డారో చూసి, వాళ్ళకి తగినట్టుగా పాయింట్లు వచ్చేవి. ఆ పాయింట్లతో వాళ్ళకి కావలసిన వస్తువులు సంఘం ఏర్పాటు చేసిన షాపులో కొనుక్కోవచ్చు. ఆసారి ఆదివారం నేను షాపులో కార్యదర్శిగా పనిచేస్తున్నాను.

క్యూలో నుంచున్న తర్వాత కుటుంబాన్ని రమ్మని సైగ చేశాను, ఇద్దరు అమ్మాయిలు, వాళ్ళమ్మ వచ్చారు. ఇద్దరు అమ్మాయిల్లో, చిన్నది (ఆరేళ్ళకి మించి ఉండవనుకొంటా!) తన పాయింట్లన్నీ వాళ్ళమ్మ చేతికిచ్చేసి, ఇంట్లోకి కావలసిన సామానులు కొనమని చెప్పింది. ఈ పేరా చదవగానే మీ మనసు చివుక్కుమందా? నాకైతే బాధతో మనసు పాడవడమే కాక, పరిస్థితులు అర్థం చేసుకోగల ఆ అమ్మాయి పైన వయసులో చాలా చిన్నదైనా గౌరవం కలిగింది. ఆ వయసులో నా ప్రపంచం ఎంత చిన్నది ఈ అమ్మాయితో పోల్చుకుంటే?

"పేదరికం కొంతమందికి ఎందుకలా శాపంలా పరిణమిస్తుంది?"

"అవకాశాలు కూడా లేని వాతావరణంలో చిన్న పిల్లలెందుకు బాధపడాలి?"

"అంతకుమించి కొందరి పిల్లలికి ఆ పేదరికం గురించి అవగాహన ఎందుకు కలగాలి?"

మరెక్కడో దేశంలో... మరో అపరిచిత సమాజంలో...
రువాండా, 1994 (మూలం: 60 మినిట్స్ కార్యక్రమం)

ఒక తెగ మరో తెగను పట్టుపట్టి నాశనం చేస్తున్న రోజులు. మానవత్వం ఆనవాలు లేకుండా పోయిన ఆ పదిరోజులు. ప్రాణభయంతో పరిగెట్టుకు వచ్చిన ఆరుగురు మహిళలను, తన ఇంటిలో వాళ్ళకు కూడా తెలీకుండా ఒక మూలన ఉన్న చిన్న బాత్రూంలో దాచిపెట్టాడు ఒక పాస్టరు. ఆ చిన్న బాత్రూంలో గడిపిన దాదాపు మూడునెలల సమయంలో వాళ్ళను చంపడానికి వచ్చినవాళ్ళలో తమకు బాగా కావలసిన వ్యక్తులను గుర్తు పట్టారు వాళ్ళు. శతాబ్దాల తరబడి కలిసి పెరిగి, నివశించిన వాళ్ళు హఠాత్తుగా ఎందుకలా మారిపోయారన్నది వాళ్ళకి అర్థం కాని విషయం.

"మనిషిలో అంత క్రూరత్వం ఎందుకు ఉంటుంది?"

"మరో మనిషిలో అంత కారుణ్యం ఎలా సాధ్యం? తన ప్రాణాల్ని లెక్కచేయక మరో ప్రాణం ఎందుకు కాపాడడం?"

"అమాయకమైన ప్రాణాల్ని బలి తీసుకోవడం దేవుడి లీలే అయితే, ఈ దేవుడి మీద మనకు ఎందుకంత నమ్మకం?"

రక్షించబడ్డ వాళ్ళలో ఒకమ్మాయి మాట్లాడుతూ కొన్నిసార్లు ఈప్రశ్నలు అడగడం చాలా కష్టం అంది. నిజమే కదా! పైన అడిగిన ప్రశ్నల్లో ఒక్కదానికి సరైన జవాబు లేదు. కానీ వివేకానందుడు అన్నట్లుగా సమాధానం ఆశించడం కన్నా ప్రశ్నలడగడం చాలా ముఖ్యం. నేనడగదల్చుకున్న ప్రశ్నల్లో మీరూ పాలుపంచుకుంటారని ఆశిస్తాను.

# నిర్ణయం మీదైతే

**నాకు 'షేన్' అనబడే** ఒక కెనేడియన్ స్నేహితుడు ఉన్నాడు, కొన్ని అనివార్య కారణాల వల్ల ఇతనికి బాలీవుడ్ అన్నా, వాటి విషయాలన్నా విపరీతమైన ఆసక్తి. ఒక్కోసారి, నాకన్నా ముందే, సంజయ్ దత్‌కి పది సంవత్సరాలు శిక్ష పడింది, పూజా భట్ గోవా వెళ్ళి వస్తూ కారు ప్రమాదానికి గురైంది లాంటి న్యూస్ చదివేసి నాకు అనధికారంగా సమాచారం చేరవేస్తుంటాడు. ఈ మధ్య ఇలాగే దేని గురించో చర్చిస్తున్న మా సంభాషణ, 'ధూం 2' చిత్రంలో ముద్దు సీను ఎంతో అసభ్యకరంగాఉందని, భారత దేశపు కుటుంబ విలువల్ని అవమాన పరుస్తుందని ఒక లాయరు కోర్ట్‌లో కేసు వేసిన విషయం వైపు మళ్ళింది.

'అవునూ ఈ విషయం ఎప్పటినుంచో నిన్నడగాలనుకుంటున్నా, ఇండియన్ కల్చర్‌లో ఒక అమ్మాయి, అబ్బాయి దగ్గరగా మెలగటం తప్పా?'

నాకీ ప్రశ్న వినగానే విపరీతమైన నవ్వు వచ్చింది. తింటున్న శాండ్‌విచ్ వదిలేసి, పగలబడి నవ్వి, ఇంకా ఐదు నిముషాల తర్వాత కూడా పొట్ట పట్టుకొని ఆయాస పడుతున్న నన్ను ఉడుక్కుంటూ ఉక్రోషంగా చూస్తున్న అతన్ని చూస్తే నాకు మరింకా నవ్వు వచ్చింది. చివరికి ఎలాగో సర్దుకొని

'ఇండియా వంద కోట్ల జనాభా సంగతి తెలిసీ ఇలాంటి ప్రశ్న వేస్తున్నావంటే నీ తెలివి గురించి కొంచం సందేహంగా ఉంది' అన్నా.

'సరేలే ఒప్పుకొంటున్నా, ఈసారి వంతు నీది, నేను తప్పు ప్రశ్న అడిగాను, ఒక అమ్మాయి, అబ్బాయి "బాహాటంగా" దగ్గరగా
మెలగటం తప్పా?'

'ఈ విషయమై విడిగా నేనెక్కువ ఆలోచించలేదు , కానీ సహజంగా మా సమాజంలో ప్రవర్తన గురించి చాలా అంక్షలు ఉన్నాయి. దీనికి మూల కారణం నా దృష్టిలో చాలా దగ్గరగా, చిన్నవిగా నిర్మించబడ్డ కుటుంబాలు'. విశదీకరించి చెప్పటానికి, మా అమ్మమ్మ ఎలా తన జీవితంలో వంద మైళ్ళకి మించి ప్రయాణం చేసి ఉండదో, ఈ వంద మైళ్ళ వ్యాసార్థంలో ఒకరి విషయాలు మరొక చోటికి ఎలా కాంతి వేగంతో ప్రయాణించ గలవో (సహజంగానే మనం ఆసక్తి గల వాళ్ళం కనుక), అదీ కాక ఉమ్మడి కుటుంబంలో జీవితాంతం నివసించ వలసి రావడంతో, ఒకరితో ఒకరు పొత్తుగా, ఎవరనీ నొప్పించక , అందరినీ మెప్పించగలిగేట్లుగా మెలగవలసిన అవసరం, ఈ నియమాల్ని, విలువల్ని సృష్టించి ఉంటుంది అని వివరించాను.

'ఎప్పటి లాగే ఇది నా విశ్లేషణ, నా మాటకు ఎంత విలువ ఇస్తావు అన్నది నీ ఇష్టం'

'చాలా కుతూహలమైన జవాబు చెప్పావు, మరి ఈ నియమాలు మతానికి సంబందించినవి కాదంటావా ?' (ఇక్కడ ఒక ముఖ్యమైన విషయం గమనించ వలిసింది. ప్రాక్ పశ్చిమ దేశాల మధ్య ఉన్న ఈ తేడా చాలా ముఖ్యం. నీతి, నియమాల దగ్గరకి వచ్చే సరికి, మన తూర్పు దేశాల్లో అవి ప్రవర్తనకి, సమాజానికి సంబంధించిన విషయాలు కానీ అవే ఇక్కడ మతంతో చాలా దగ్గరగా ముడి వేసుకొని ఉంటాయి. ఒక సమాజంలో మన ప్రవర్తన వల్ల మిగిలిన వాళ్ళకంతా సమాధానం చెప్పుకోవలసి వస్తే, మరో సమాజంలో మరణం తర్వాత దేవుడికి సమాధానం చెప్పుకోవాలి. రెండిటిలో ఒకటి మంచిది, రెండోది చెడ్డది అని కాదు, పరిస్తితుల వల్ల ఒక్కో సమాజపు ఆలోచనలు ఎలా మారతాయన్నది ముఖ్యం).

'ఇక్కడ మతం అంటే, భారత దేశంలో ఉన్న రకరకాల మతాల గురించి మాట్లాడాలి కానీ నాకుఅన్నింటికన్నా బాగా తెలిసిన హిందూ మతం గురించి చెపుతాను, విను' , నిజానికి నేనిక్కడ తనని, భేతాళుని శవంలాగా భుజాన వేసుకొని నడక సాగించాలి, కానీ అంత పెద్ద పర్సనాలిటీని లేపడానికి ప్రయత్నిస్తే, నా నడుం ఎక్కడ విరుగుతుందో అన్న భయంతో, ఆ ఆలోచనకి స్వస్తి చెప్పి, నా లెక్చరు కొనసాగించా.

'నేను చదివిన పుస్తకాలన్నింటిలో ఉన్న సందేశం ఏంటంటే, మనిషి జీవితంలో ఎదురయ్యే ప్రశ్నలు కొన్ని ఎప్పటికీ ఒకలాగే ఉంటాయి. ఈ పుస్తకాలు ఇలాంటి సమస్యలు మనకు నిజ జీవితంలో ఎదురైతే ఎలా పరిష్కరింకోవాలి అన్న విషయంపై కొన్ని మార్గదర్శక సూత్రాలు ఇస్తాయి . మరికొన్ని పుస్తకాలు, తన కథలో కొన్ని ముఖ్యమైన పాత్రలకు ఎదురైన సంఘటనల్లో వారెలాంటి నిర్ణయాలు తీసుకొన్నారు, ఎందువల్ల అలాంటి నిర్ణయాలు సరైనవి అని వివరిస్తాయి. కానీ ఒక్క పుస్తకమూ, మనిషి ప్రవర్తనని పూర్తిగా నియంత్రించ ప్రయత్నించదు. వేదాలు, ఉపనిషత్తులు, పురాణాలు, సనాతన ధర్మం, దగ్గరగా పరిశీలించినట్లయితే, ఒక్క విషయం విశదీకరమౌతుంది. మనం కొన్ని సూత్రాలు అమలపరచడం వల్ల, అందరమూ ఒక సమాజంలాగా పురోగమిస్తాము. నాకు తెలిసి వీటిలో ఎక్కడా, మన దైనందిక వ్యక్తిగత ప్రవర్తన గురించి నియమాలు లేవు, అవి సహజంగా మారుతున్న సమాజపు పరిస్తితులు, సౌకర్యాలని బట్టి మారుతూ ఉంటాయి. కానీ ఈ పద్దతులు కాల క్రమేణా పెద్దగా ప్రశ్నించక విన్నవన్నీ వినమ్రంగా పాటించే మనుషుల వల్ల భవిష్యత్ తరాలకు వ్యక్తిగత ప్రామాణికాలౌతాయి. సరే మరి, పశ్చిమ దేశాల ప్రతినిధిగా నీ అభిప్రాయం చెప్పు, ఈ

విషయం

గురించి నువ్వేం అనుకుంటున్నావు?'

'అమెరికా గురించి మాట్లాడాలంటే ఈ విషయంలో 1960 హిప్పీ ఉద్యమం వచ్చేంత వరకూ ఇక్కడా అలాంటి పద్దతులే ఉండేవి. 1950 లో ప్రసారమైన టీవీ కార్యక్రమాలలో ఒకే మంచంపైన ఒక కాలు కిందలేకుండా ఓ అమ్మాయి, అబ్బాయి ఉండకూడదన్న నియమం ఉండేది. ఇలా ఆలోచిస్తే రెండు సమాజాల మనుషుల మనస్తత్వాలకి పెద్ద తేడా లేదనిపిస్తుంది. కూలంకుషంగా పరిశీలిస్తే ఒక విషయం ప్రధానంగా ముందుకొస్తుంది, ఆ తరం వాళ్ళు మొదటిసారిగా వ్యక్తిగత స్వాతంత్రానికి ప్రాధాన్యం ఇచ్చారు. దాని వెనుక వున్న కారణం, యుద్దం మూలకంగా ఆర్దిక పరిస్తితులు చాలా మెరుగు పడడం, దాని మూలకంగా చాలా మంది యువతీ, యువకులు యూనివర్సిటీలకి వెళ్ళగలిగారు, తనకన్నా భిన్నంగా ఆలోచించే మనుషుల్ని కలిసారు, పాత పద్దతుల్ని ప్రశ్నించడం మొదలుపెట్టారు. వాళ్ళ మూలంగా నాలాంటి ఆబ్‌జెక్టివిక్టినిస్టులకి ఇంత స్వాతంత్రం వచ్చింది. నా గర్ల్ ఫ్రెండుని ఎప్పుడు ముద్దుపెట్టుకోవాలనిపిస్తే, అప్పుడు పెట్టుకుంటా, దానికోసం మరెవరో 'ఏదో అనుకుంటారని ఆగడం అసాధ్యం'

కొన్ని విషయాలని మనం ఎందుకలా సరైన ప్రశ్నలడగకుండానే అంగీకరిస్తాము?
అంతకు మించి అసలు ఎవరు, ఎప్పుడు, ఎందుకు మనిషి ప్రవర్తన ఎలా ఉండాలి అని నిర్ణయిస్తారు?
అందరితో పాటుగా ఎందుకు కొన్ని పద్దతులు పాటిస్తాము? దీనికి మూలం మనిషి సామాజిక పరిణామమా?

**అనంతపురంలో చదువుకొనే రోజుల్లో :**

టౌను బయట ఉన్న గ్రామ ప్రాంతంలో ఉండేది మా కాలేజ్. ఓరోజు నా క్లాస్ మేట్ తన ఫిజిక్స్ లాబ్ పార్ట్‌నర్ తో హాస్టలు గేటు బయట నుంచొని మాట్లాడుతూ ఉంది. లాబ్ విషయాలతో పాటుగా 'ఏవో కొన్ని ఇతర విషయాల గురించి చర్చిస్తూ నవ్వుకొంటున్నారు. పది, పదిహేను నిమిషాలు గడిచాయనుకొంటా, ఒక నలుగురైదుగురు యువకులు వచ్చారు. లుంగీలతో, సారా వాసనతో వాళ్ళ వాలకమేమీ అర్థమౌవలేదు వీళ్ళిద్దరికీ. పట్టించుకోనట్లుగా వీళ్ళ సంభాషణ కొనసాగించినప్పటికీ, వాళ్ళక్కడనుంచి కదలకపోవడంతో ఇబ్బందిగా అనిపించి, ఆ అబ్బాయి తనకి బై చెప్పి వెళ్ళబోతుంటే వాళ్ళు అడ్డగించి, వాళ్ళిద్దరికీ అల్టిమేటం ఇచ్చారు. మరోసారిలా నవ్వుకుంటూ, తుళ్ళుకుంటూ కనపడ్డారా, ఆ తర్వాతేమౌతుందీ అన్నది వాళ్ళకే తెలీదు అని. ఆ దెబ్బతో నా ఫ్రెండు భయపడిపోయి, అసలు అబ్బాయి అన్నవాడి వైపు క్లాసురూములో తప్ప కన్నెత్తి కూడా చూడలేదు. సగం సమస్య, ఇలాంటి వాళ్ళతోనే ఆరంభం. జీవితంలో సాధించ వలసింది పెద్దగా 'ఏమీ లేకపోవడంతో ఇలాంటి వాళ్ళు ఉన్నవీ, లేనివీ బాధ్యతలు కల్పించుకొని ,మిగిలిన జనాల విషయాలు వీరి సొంత విషయాలన్నట్లుగా ప్రవర్తించే సూడో-మోరలిస్టులు.

ఈ సంఘటన జరిగింది పల్లెటూరులో అన్నది కేవలం కాకతాళీయమే. పల్లె లేక పట్నం మనుషుల ప్రవర్తనలో అంత తేడా తెస్తుందని నేననుకోను. అంత దూరం ఎందుకు, మా అమ్మా, నాన్న నాకెప్పుడూ ఇలాంటి లెక్చర్లివ్వలేదు. హాస్టలు నుండి డబ్బు కోసం ఉత్తరం రాసే నన్ను, కనీసం ఒక్కసారి కూడా ఎందుకంత డబ్బు అవసరం అని కూడా అడగలేదు. అది, డబ్బు ఎక్కువ ఉండి కూడా కాదు, కేవలం నా మీద ఉన్న నమ్మకం మాత్రమే. వాళ్ళిద్దరూ పదహారణాల తెలుగు పల్లెటూరి వాళ్ళు. నా స్నేహితులిద్దరు ఇంటికి కూడా వచ్చి అమ్మ వాళ్ళతో మంచి స్నేహం కూడా కుదుర్చుకున్నారు. బాబాయి కొడుకులతో ప్రవర్తించినట్లుగానే వీళ్ళతో ప్రవర్తిస్తున్న నా గురించి అమ్మ వాళ్ళకేం

భయాలుంటాయి? అందుకే మొదటగా ఉద్దేశాలు అర్థం చేసుకోవడం ముఖ్యం. గుడ్డి భయాలతో ఎప్పుడైతే వింత ఆంక్షలు విధిస్తారో, అప్పుడే అబద్దాల జంఝాటం ప్రారంభం.

ఫైనల్ ఇయర్ అనుకుంటా, 'ఆనకొండా' అన్న సినిమా రిలీజయింది ఇండియాలో. ఆ సినిమా ప్రత్యేకత ఏంటంటే ఒక

నిముషం పాటు సాగే జెన్నిఫర్ లోపెజ్ కీ ఒక హీరోకి మధ్య, 'లిప్ టు లిప్ కిస్' . అంతవరకూ అసలు అలాంటి సీను ఎలా ఉంటుందో తెలీక, టీనేజ్‌లో ఉండే సహజమైన ఆసక్తి వల్ల మా రూం మేట్స్ కలిసి, ఆ సినిమా రెండు సార్లు చూసాము. మొదటి సారి హాస్టల్ కి వచ్చాక నా స్నేహితురాలొకటి , అవునూ ఇండియన్స్ కూడా అలా చేస్తారా అనడిగింది. చిన్నప్పటినుండీ పుస్తకాల పురుగునైన నాకు కనీసం థియరెటికల్ విజ్ఞానమైనా ఏడిచింది, కానీ నా స్నేహితురాలి పరిస్థితి తలుచుకుంటే నాకు జాలేస్తుందిప్పటికీ. మరి ఈ సినిమా చూసాక మేమందరమూ కట్టకట్టుకు వెళ్ళి అబ్బాయిల్ని వెతుక్కొని ముద్దులు పెట్టేసుకున్నామా? ఆకర్షణ, ప్రేమ ఇలాంటివి మనం అనుకున్నదానికన్నా చాలా క్లిష్టమైన విషయాలు. మనకి తెలీని, అర్థం కానీ రసాయన చర్యలు మిళితమై, మన మెదడు ఆ వ్యక్తిని అంచనా వేసి మనకు కావలసిన లక్షణాలున్న వాళ్ళని మాత్రమే మన భాగస్వామిగా ఎన్నుకొంటాము. ఇది పటిష్టమైన, తర్వాత తరాన్ని సృష్టించడానికి మన జీన్స్ లో రాసిన ప్రోగ్రాం. ఇవన్నీ అర్థం చేసుకోకుండా, కనీసం సెక్స్ అంటే ఏమిటి, బాధ్యత లేకుండా ప్రయోగాలు చేస్తే కలిగే అనర్థాలేమిటి అని చెప్పడానికి బదులు, దాని గురించి కూడా మాట్లాడ లేని మనం పరిణామానికి ఆటంకం కలిగించడం లేదూ?

దాదాపు అదే సమయంలో రిలీజ్ అయిన మరో సినిమా, 'ప్రేమించుకుందాం రా' చూస్తున్నప్పుడు, ఆ సినిమాలో విలన్ పంపిచిన రౌడీల చేతిలో కత్తుల్ని , వేర్వేరు సీనుల్లో రక్తాన్ని చూసి, అప్పటి వరకూ అనుభవం కాని భావమేదో, పొత్తి కడుపులో నుండి మొదలై, కాళ్ళలో వణుకులాగా మారింది. తర్వాత నెమ్మదిగా కూచొని ఆలోచిస్తే అర్థమైంది, అది ఒకలాంటి ఏహ్య భావం, ఈ భావాన్ని ఆ ముద్దు సీను చూసినప్పటి కడుపులో సీతాకోక చిలుకలు ఎగురుతున్న మధురమైన భావంతో పోల్చుకుంటే ఆ రెండిటిలో ఏది మంచిదనిపిస్తుంది? అలాంటి హింసాత్మక దృశ్యాలు, అంతెందుకు, రోజూ మనం పేపర్ లో చూసే ఎన్ కౌంటర్ ఫోటోలు, ఇవన్నీ లేత మనసుల్ని ఎంత గాయ పరుస్తాయో ఒక్కసారైనా ఆలోచిస్తామా? ఇవి ఒక్కోసారి మన వయసుకి మించిన ఆలోచనలు కలిగించి అమాయకత్వాన్ని నాశనం చేస్తాయి. అలాగని నిజాన్ని పిల్లలినుండి దాచి పెట్టమనీ కాదు. మన స్వభావాన్ని ఒక సారి మనం పరీక్షించుకొని, మనలో మనం చర్చించుకోవాలి, ఇలాంటి తేడాలు ఎందుకని, మనకీ మన పిల్లలకి, ఎలాంటి ఆలోచన, జీవన శైలి కావాలి అని.

నాకు తెలిసి కొన్ని సినిమాల్లో క్రూరమైన, హింసాత్మకమైన ఘట్టాలున్నాయి, వాటికన్నా ఈ ముద్దు సీను ఎందుకు అభ్యంతరకరం?

హింస మన పూర్వీకులైన వానరాలకి సహజం, కానీ మనకున్న మేధా శక్తితో పాటుగా ఇదీ అవసరమా?

మనిషికి ఆకలి, దప్పిక లాగే కామము, సృష్టీ అత్యవసరమూ, సహజమూ కదా, మరి మనం ఎందుకు దీన్ని గురించి చర్చించడానికి సిగ్గు పడతాం?

అసలు సిగ్గు ఎక్కడనుండి ఉద్భవించింది? మన ఉనికి తాలూకూ జ్ఞానం ఎందుకు, ఎలా ఉపయోగకరం?

ఇన్నేళ్ళయినా ఇంకా ఈ విషయాన్ని చర్చిస్తున్న మనల్ని చూసి చలమేమంటాడు?

మరి చివరగా ఒక్కమాట, ఈ కేసులో మీకూ ఒక భాగముంది. ఈ కేసు వాదిస్తున్న న్యాయవాది మీరని ఊహించుకోండి. మొదట కేసు వేసిన లాయరు తరఫున వాదనలను రాసుకోండి, తర్వాత ప్రతి వాదనని. మరి ఈ వాదనలని, న్యాయమూర్తి అయిన మీకు సమర్పించుకొని, ఒక నిర్ణయం తీసుకోండి. ఎందుకంటే ఇలాంటి సమస్యలకి ఎప్పుడూ ఒక్క పరిష్కారం అంటూ లేదు. మనుషులుగా, అంతకు మించి ఆలోచించ గలిగిన వ్యక్తులుగా మన మనసుల్ని పరిశీలించుకొని మనకు ముఖ్యమైన విలువల్ని నిర్ధారించుకొని ఒక నిర్ణయం తీసుకోవడం మన బాధ్యత.

# మరో ఇరాక్?

ఈ సంఘటన మా ఇంట్లో జరిగి కొన్నేళ్ళయింది. ఊరికి దూరంగా పొలంలోనే ఇళ్ళు కట్టుకొని నివసిస్తూ, ఓ చిన్న ప్రతిగ్రామంగా మారిన మా రైతు సమూహసమాజంలో దాదాపు ప్రతి ఒక్కరి ఇంట్లో ఒకటో రెండో కుక్కలు ఉండడం ఒక రివాజు. అలాగే మా ఇంట్లోనూ ఎప్పుడూ రెండు కుక్కలు ఉండేవి. మా కుక్కలన్నింటిలోకి మాకు బాగా దగ్గరైనవి పప్పీ, జాకీ. నాన్న పప్పీని తెచ్చిన రెండు నెలల తర్వాత, ఇంకా కళ్ళు కూడా తెరవని జాకీని తెచ్చారు. ఆ రోజంతా జాకీ చుట్టూ అమితానందంగా తిరుగుతూ , అతి త్వరలోనే మంచి స్నేహం ఏర్పరుచుకుంది పప్పీ. అంతగా కలిసిపోయి ఒకదాన్ని వదిలి మరోటి ఉండలేనట్లుగా ఉండేవి. ఒక తల్లికి పుట్టిన మా ముగ్గురికన్నా వాటి బంధమే చూడ ముచ్చటగా ఉందని మా అమ్మ అప్పుడప్పుడూ అంటూ ఉండేది (ప్రతి చిన్న విషయానికి జగడాలాడుతూ, చీటికీ మాటికీ అలుగుతుండే మమ్మల్ని చూస్తే అలా అనిపించడమూ సహజమే).

అవి కొంచం పెద్దవైన తర్వాత ఓ ప్రమాదం, జనార్ధనరావు గారింట్లో ఉండే రాజా రూపంలో వచ్చింది. 'రాజా' చూడ్డానికి కుక్కలాగా కాక ఓ చిన్న సైజు సింహంలా ఉండేది. దానికి తోడు చుట్టు పక్కలున్న పొలాలన్నీ తన సొంతమైనట్లు సాయంత్రమైతే చాలు, షికారుగా వచ్చి, ఆ పొలంలో ఉండే కుక్కలతో కొట్లాడి, వాటికి ఒంటినిండా గాయాలు చేసి, వెళుతూ వెళుతూ జాగ్రత్తగా మసులుకోమని చెప్పినట్లుగా మొరిగి వెళుతుండేది. ఈ జంఝాటంలో మొదటిసారి మా పప్పీ మూతి బాగా గాయపడి మానడానికి పాపం చాలా రోజులే పట్టింది. అలాగని రాజా వచ్చే సమయానికి మా కుక్కల్ని కట్టేసి ఉంచితే, మమ్మల్ని భయపెట్టి, కట్టేసిన కుక్కల దగ్గరకి వెళ్ళి ఫైటింగ్ చేసి వెళుతుండేది. ఓసారి జనార్ధనరావు గారికి ఫోన్ చేసి, రాజాని కట్టేసో లేక మరోవిధంగానైనా నిర్బంధించమని చెప్పమని నాన్నతో అంటే, కుక్కల మూలంగా మనుషుల మధ్య మనస్పర్థలెందుకులే పోనీమన్నారు. అప్పటినుండి 'రాజా' మాఇంటి ఛాయల్లో కనపడగానే పప్పీ పరిగెత్తుకుంటూ వెళ్ళి మనుషుల చాటున దాక్కోవడం మొదలు పెట్టింది. జాకీ మాత్రం పెద్ద గొంతుతో మొరిగి భయ పెట్టాలని చూసేది కానీ, తెగించి ఎప్పుడూ పోరాడలేదు.

ఇలాగ కొన్నాళ్ళు గడిచాక, ఓ వేసవికాలం సాయంత్రం, మేమందరం అప్పుడే చల్లటి నీళ్ళు వాకిట్లో చల్లుకొని, ఇంటిముందు అరుగుల మీద కూచొని కాఫీ తాగుతున్నాం. మా పొలం గట్లమీదుగా రాజా ఠీవీగా నడుచుకొంటూ వస్తుంది. మా నాన్న మా అందరికన్నా మొదటగా చూసి, ‘అదిగో కొదమ సింహం వస్తుంది, ఇక మనకి చెవులు దిబ్బిళ్ళు పడేలా కొంచం సేపు జాకీ గోల చేస్తుంది, ఎలా భరించడం‘, అన్నారు. రోహిణీ కార్తె ఎండకి తోడుగా వడగాడుపులు రోజంతా భరించి, అప్పటికే తల భారంగా ఉండడంతో మాకూ విసుగ్గా అనిపించింది. పప్పీ మా మాటల్లో రాజా అన్న మాటే విందో, లేక రాజా వస్తున్న వాసనే పసిగట్టిందో ఇంటి వెనకాతల దాక్కోటానికి పరిగెట్టింది. జాకీ మాత్రం ఎప్పటిలాగా మొరగక, ఏదో నిర్ణయానికి వచ్చిన విధంగా రాజా వస్తున్న వైపు ఊపిరితీసుకోవడం కూడా మరిచిపోయి చూస్తూ నిలబడింది. రాజా మా మోటర్‌షెడ్ సమీపించే వరకూ, ఇలాగే చూసి ఉన్నట్టుండి వెళ్ళి కలబడింది. మా జాకీ రాజా అంత పెద్ద కుక్క కాకపోయినా మరీ అంత చిన్నదేం కాదు. ఇక దాదాపు ఐదు నిముషాల వరకూ మాకు ఏ కుక్క ఎక్కడ ఉన్నదీ తెలియనంత వేగంగా దుమ్ము లేపుతూ రెండు కుక్కల మధ్యా భీకర పోరాటం జరిగింది. అంతలో ఇంటి వెనకాతల నుండి మొక్కల మధ్య దాక్కుంటూ షెడ్ వెనుక వైపుకి ఎలా వచ్చిందో, పప్పీ రాజాని, ఆశ్చర్యంగా, హఠాత్తుగా మరో వైపు నుండి అడ్డగించింది. మొత్తానికి ఆరోజు మా పప్పీ, జాకీ ప్రాణాలకి తెగించి మరీ పోరాడి చివరకి రాజాని పొలం దాటిందాకా తరిమి వచ్చాయి. ఆ దెబ్బకి నిజంగానే బాగా భయపడిందేమో, మా పొలం గట్లకి కానీ, మా ఇంటి చాయలకి కానీ రాజా మరిక రాలేదు.

ఓ రోజు ఒంటరిగా మరో పొలం వైపు సాయంత్రం పూట వెళ్ళిన జాకీ మరి తిరిగి రాలేదు. మేమంతా బయట మంచాలు వేసుకొని, అన్నం తినడానికి కూచుంటున్నాం. పప్పీ ఒక్కటే మా చుట్టూ తిరుగుతూ పళ్ళాల వేపు చూస్తూ కూచుంది కానీ జాకీ వచ్చే సూచనలు కనపడలేదు. మరో గంట, రెండు గంటలు గడిచాయి కానీ జాకీ జాడ మాత్రం తెలీలేదు. మా రెండు కుక్కలూ ఇలా తిరిగిరావడానికి వెళ్ళేవిగాని మేం రాత్రి అన్నం తినే సమయానికి తిరిగి వస్తుండేవి. ఇక ఊరుకోలేక మా అమ్మ మా పక్క పొలాల వాళ్ళకి ఇద్దరి, ముగ్గురికి ఫోన్ చేసింది. ఎవరూ జాకీని ఆ సాయంత్రం చూడలేదన్నారు. ఇలా రెండు రోజులు గడిచాయి, మా నాన్న కొంచం దూరంలో ఉన్న పొలాల దగ్గరికి కూడా వెళ్ళి అడిగి వచ్చారు, కానీ జాకీ కనపడలేదు. మరో రోజు గడిచిన తర్వాత సుబ్బారావు గారు ఇంటికి వెళుతూ, దారిలో ఆగి మాతో మాట్లాడ్డానికి వచ్చారు. ఆయన ఆరోజు పొద్దున్నే పొలం చివరదాక నడిచి వెళుతూ ఉండగా, కరెంట్ తీగ తగిలి చచ్చిపోయిన జాకీ కనపడిందట. వేరుశనగ, మొక్కజొన్న లాంటి పంటలు వేసే రైతులు అడివి పందుల ధాటికి, తట్టుకోలేక పొలం చుట్టూతా కరెంట్ వైర్ వేయడం మా దగ్గర మామూలే.

కొన్ని రోజులు దిగులుగా జాకీని పిలుస్తూ అన్నం అదీ తినక పప్పీ బాగా డీలా పడిపోయింది. మరో కుక్కపిల్లని తెస్తే ఇంట్లో తోడుగా ఉంటుందని, మా నాన్న మూడు నెలల పిల్లయిన 'సోనీ' ని తెచ్చారు. ‘సోని‘ ఇంటికి వచ్చిన మరో క్షణం పప్పీ పిచ్చి పట్టిన దానిలా ప్రవర్తించ సాగింది. మేము కనుచూపు మేరలో లేకపోతే సోనీని చంపేసే ప్రయత్నం చేయటం, తన ప్లేట్లో వేసిన అన్నం తీసుకొని వెళ్ళి పెరట్లో గుంటలు తవ్వి పాతి పెట్టుకోవడం, మేము పిలుస్తున్నా వినిపించుకోక వెళ్ళిపోడం చేస్తూ ఉండేది. పప్పీ మామూలు అవడానికి దాదాపు రెండు నెలలు పట్టింది. ఈ పాటికి మీరంతా, ఏమిటీ ఈ అమ్మాయి ఈ నెల మరేమీ లేనట్టుగా రెండు కుక్కల గురించి రాసింది అనుకుంటున్నారా? ఈ సంఘటనలు మన జీవితాన్ని ఎంతగా పోలి ఉన్నాయో కొన్ని ప్రశ్నలు వేసుకుని పరిశీలిద్దాం.

1. మా నాన్న రాజా గురించి ఎలాంటి చర్యా తీసుకో పోవడం మంచికేనా?

2. లేక, పప్పీని, జాకీకి వాటి సమస్యల్ని ఎదుర్కొని పోరాడ్డానికి అవకాశం ఇవ్వడం మంచిదా?
3. జాకీకి ఏమీ కాని పప్పీ చిన్నప్పటినుంచీ కలిసి పెరిగినంత మాత్రానికే అంత దగ్గరయిందే?
4. ఉన్నట్టుండి, మేమందరం ముద్దు చేస్తున్న సోనీ అంటే పప్పీకి ఎందుకంత అపనమ్మకం?
5. సోనీ వచ్చిన తర్వాత తనకి తిండి కూడా దక్కదన్న అనుమానం ఎందుకు వచ్చింది పప్పీకి?

ఇప్పటికే మీకు వీటికి సమాంతర పరిధిలో ఉన్న మరికొన్ని ప్రశ్నలు ఉదయించాలే!

ఆ. సద్దాం హుస్సేన్ క్రూరుడు అన్న విషయం ప్రపంచ ప్రజలకి అంత ఆలస్యంగా గుర్తుకొచ్చిందే?

2. ఇరాకీ ప్రజలలో ఒక ఉద్యమం వస్తుందన్న నమ్మకం మనకి లేకపోయిందా?
3. అన్ని భేదాలున్న సున్ని, షియా ప్రజలు అంత వరకూ కలిసి ఎలా మనగలిగారు?
4. అనేక సంవత్సరాలుగా అన్నింటినీ అధిగమించి ఒక సమాజం ఏర్పరుచుకున్న అధికార వర్గ నియమాల్ని, ఆ సమాజం గురించి జ్ఞానం లేని మరో దేశం వచ్చి కూలదోసి ఒక వర్గ ప్రజల్ని అధికారుల్ని చేసి మరో వర్గ ప్రజలకి నీకేమీ అధికారం లేదు పొమ్మంటం వెనుక మచ్చుకైనా నీతి, న్యాయం ఉందా?
5. రోజూ వందల మంది ఒకరి నొకరు ఇలాంటి అనుమానాల మధ్య చంపుకోవటం మీకేమైనా అర్థమౌతుందా?
6. కొన్ని వేల మందిని చంపిన సద్దాంకి, అంతకన్నా ఎక్కువ మంది ఇరక్ పౌరుల్ని చంపిన బుష్ కి మధ్య తేడా ఏమిటి?

ఒకరు చేసింది సమంజసమూ, మరొకరు చేసింది అన్యాయమైనా మధ్య ప్రాణాలు కోల్పోయేది నిరపరాధులైన ప్రజలే కదా!

****

మీరు జాగ్రత్తగా గమనిస్తున్నారో లేదో, గత కొద్ది నెలలుగా ఉధృతమౌతున్న ఇరాన్ వ్యవహారం త్వరలో ఒక కొలిక్కి వచ్చేట్టుగా ఉంది. కొన్ని పరిశోధక వార్తా పత్రికలు, జర్నలిస్టులు ఇరాన్ మీద తప్పక విమాన దాడి జరుగుతుందని అంటున్నారు. పేరున్న వార్తా పత్రికలు, టీవీ ఛానళ్ళతో సహా, ఇరాన్ ఎంత ప్రమాదకరమైన దేశమో, దానికి అణుశాస్త్రపు పరిజ్ఞానం ఉండడం ప్రపంచానికి ఎంత ప్రమాదకరమో మన బుర్రల్లో అతుక్కుపోయేట్టుగా మరీ, మరీ చెప్పటం వింటూనే ఉన్నాం. కరెక్టుగా ఇలాంటి వాదనే మరో చోట, మరో సమయంలో విన్నట్టుగా అనిపిస్తుందా? ఒక్కసారి గతంలోకి వెళితే, ముఖ్యంగా 2002, 2003 సంవత్సరాలలో ఇదే వాదన సద్దాం గురించి విన్నాం కదూ! మనకి తెలిసిన మరో సమాజం సమసి పోయే లోగా దాన్ని గురించి కొన్ని ముఖ్యమైన విషయాలు తెలుసుకుందాం.

మానవ సమాజం గత 13, 14 వేల సంవత్సరాలుగా మాత్రమే వ్యవసాయం వృత్తిగా చేపట్టింది. అంతకు ముందంతా మనందరం వేటాడుతూ, ప్రకృతి మనకిచ్చిన పళ్ళు, గింజలు, వేళ్ళు తింటూ బ్రతికే వాళ్ళం. మనకి తెలిసినంత వరకూ మొట్టమొదటి వ్యవసాయం, 'సారవంతమైన వంక', మనకు ఇస్రాయెల్, సిరియా, ఇరాక్, ఇరాన్

లాంటి దేశాలుగా తెలిసిన ప్రాంతంలో మొదలయింది. ఒకసారి వ్యవసాయం విరివిగా వాడుకలోకి వచ్చాక, పెద్ద పెద్ద సమాజాలు, దానిని నియంత్రించటానికి కావలసిన విద్యలు ఏర్పటడం మొదలయ్యాయి. వ్రాత, గణితం, అర్థం, విశ్వ శాస్త్రం, కవిత్వం, మొట్టమొదటి ద్రాక్షా మధురపానీయం లాంటి వన్నీ ఇక్కడే మొదలయి అభివృద్ధి చెందాయి. వేటమీద ఆధార పడిన సమాజంలో ప్రతి ఒక్కరూ పని చేయవలిసిందే, అదే వ్యవసాయాధారమైన సమాజంలో కొంత మంది పంటలు పండిస్తే, వాటిని వినియోగించుకొని సమాజ శ్రేయస్సు కొరకు పనిచేసే కొంత మందికి ఉద్యోగాలు ఇవ్వడం సాధ్యమౌతుంది, లేదా రైతు తన కింద పని చేయడానికి కొంత మందిని పెట్టుకోవచ్చు. అందుకే నాగరికత అభివృద్ధి చెందడానికి వ్యవసాయం చాలా అవసరం అంటారు సమాజ శాస్త్రం చదివే పండితులు. ఏదైతేనేం, గ్రీకు మహా స్సామ్రాజ్యానికి ధీటుగా నిలవ గలిగే స్థాయికి ఎదగ గలిగింది పర్షియన్ రాజ్యం. గ్రీకు చరిత్ర కారుల రచనలు చదివితే పర్షియన్ రాజ్య ప్రాబల్యాన్ని ఎంత ముఖ్యమైన విషయంగా భావించారో అర్థమౌతుంది.

1500-1700 మధ్య, షా అబ్బాస్, నాదిర్ షా నాయకత్వంలో ఇరాన్ పటిష్టమైన దేశంగా రూపొందింది. కానీ అప్పటికే మెల్లగా యూరోప్ దేశాలు చిన్న చిన్న కాలనీలు ఏర్పాటు చేయడం మొదలు పెట్టాయి. కానీ ఇరాన్ ప్రజలు 1890 ప్రాంతంలో షా వంశపు నాయకత్వానికి వ్యతిరేకంగా తమకై ఒక రాజ్యాంగం, పార్లమెంటు ఉండాలని ఉద్యమం మొదలుపెట్టారు. ఇక తప్పనిసరై షా, కొంత అధికారాన్నిచ్చి ఒక పార్లమెంటును ఏర్పాటు చేశాడు. ఇదే సమయంలో ఇరాన్‌లో చమురు నిల్వలు బయలు పడ్డాయి. ఇంగ్లండు, రష్యా మధ్య, మంచి నాయకత్వం లేని ఇరాన్ భవిష్యత్ బలి అయింది. ఇంగ్లడ్‌కి చెందిన బి.పి కంపెనీ (మన దేశంలో ఈస్టు ఇండియా కంపెనీలాగా) అనధికారంగా పాలిస్తూ ఉండేది. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత, ప్రజలు తమ దేశపు ప్రకృతి వనరులైన చమురు నిల్వలు విదేశీయులు అన్యాయంగా కొల్లగొట్టటం సహించక ఉన్నత ఉద్దేశాలున్న 'మొహమ్మద్ మొస్సాడెక్' ని ప్రధాన మంత్రిగా ఎన్నుకున్నారు. కొంత మంది, ఈ నాయకుణ్ణి ఇరాన్ ఆశాదీపంగా చెప్పుకున్నారు. కానీ అతను చమురు నిల్వలు మొదలగు వనరుల్ని, దేశీయం చేసి, వాటి ద్వారా వచ్చే ఆదాయాన్ని ప్రజలకు చెందేట్లుగా చట్టాలవీ చేయడం ఇంగ్లండుకి కంటకమైంది. ఎలాగైనా అతన్ని పదవి నుంచి తొలిగించాలని చూస్తున్న ఇంగ్లండుకి, అమెరికా రష్యాల మధ్య కోల్డ్ వార్ సమయానుకూలంగా ఉపయోగపడింది. రెండు దేశాలు కలిసి, మొసాడెక్ని తొలగించి తిరిగి రేజా షా ని రాజుని చేసాయి. దాని ఫలితమే ఇరాన్ 1979 మతపరమైన ఉద్యమం. దీని వెనుకా పశ్చిమ దేశాల హస్తం ఉందని చాలా మందికి అనుమానం.  కానీ, 1957లో, అమెరికా, ఇంగ్లండు కలిసి ఇరాన్ పురోభివృద్దిని నిరోధించక పోయినట్లయితే ఇప్పటికి ఆ దేశం మొట్ట మొదటి ప్రజా స్వామ్యంగా విలసిల్లుతుండేది. ఇలా ఎప్పటికప్పుడు మన ఆసియా వ్యవహారాల్లో తమ ప్రయోజనాలకై తల దూర్చడం పశ్చిమ దేశాలకి తగని పని కాదా?

ఇప్పుడు సమయాన్నే ఉదాహరణగా తీసుకోండి. యుద్ధమే ప్రధానమైన మార్గంగా ఎన్నుకున్న కొంతమంది చేసే వాదనలు వింటుంటే నాకు ఒక్కోసారి నవ్వు వస్తుంది. మనల్ని అంత అజ్ఞానుల కింద జమకడుతున్నారా? ఒక ప్రక్క శాస్త్రవేత్తలు 4% ఎన్‌రిచ్ చేసిన యురేనియం శాంతియుతమైనపనులకి మాత్రమే ఉపయోగ పడుతుంది అని, అణు బాంబ్ తయారు చేయడానికి 90% ఎన్‌రిచ్ చేయాలి, అది చేయడం అంత సులభతరం కాదు, కొన్ని సంవత్సరాలు పడుతుంది అని చెపుతుంటే, కొంతమంది నాయకులు, ఒకసారి ఎన్‌రిచ్ చేయడం మొదలు పెడితే కొన్ని వారాల్లో ఆయుధాలు తయారు చేయొచ్చు అంటున్నారు. ఇదేమైనా పిడకలు చేయడం అనుకున్నారా? అణు శాస్త్రం చాలా

కొత్తది, దానిలో మెళుకువలు తెలిసిన వారు చాలా కొద్ది మంది ఉన్నారు. ఒక ప్రయోగశాల బాంబ్ తయారు చేయడానికి నిర్మించాలంటే అంత సులభం కాదు.

దానికి మించి బుష్ ప్రవర్తన ఎలా ఉందంటే, ఒక చిన్న పిల్లవాడు తనని క్లాసులో ఎవరో పిల్లవాడు కొడతాడని అనుమానంగా ఉందనీ టీచర్‌తో (ఇక్కడ టీచర్ యు.ఎన్) చెప్పి, అందుమూలకంగా ముందే ఆ పిల్లవాడి కాళ్ళు చేతులు విరగ్గొడతానని పంతంగా మాట్లాడితే, టీచర్ ఆ పని చేయబోయేముందు, ఆ పిల్లవాడితో మాట్లాడి , అసలు కొట్టాలన్న ఉద్దేశం ఉందా లేదా అన్న విషయం పరిశీలించమని చెపితే, కాదూ కూడదు, నాకు తెలుసు వాడు కొడతాడు. నేనా వెధవతో మాట్లాడను అన్నట్లుగా ఉంది. దానికి తోడు నా స్నేహితులు కొంతమంది ఇరాన్ మొండితనాన్ని ఛాదస్తంగా భావిస్తుంటారు. అమెరికా లాంటి దేశం ఓ పక్కనుండి శాంక్షన్స్ అంటూ బెదిరిస్తుంటే మాట వినక ఎందుకలా చేస్తుంది అంటారు. గత కొన్ని దశాబ్దాలుగా మన ఆసియా ప్రాంతం పశ్చిమ దేశాల మూలంగా మన సమాజాలు ఎలాంటి మార్పులు చూడవలిసి వచ్చాయో గమనించి, దానికి వ్యతిరేకంగా ప్రవర్తించడం మొదలు పెట్టాయి. కానీ అన్ని దేశాల మధ్య అల్లుకుపోయిన వ్యాపార బంధాల మూలంగా ప్రతిఘటన అంత సులభతరం కాదు. ఇరాన్ తమ అణు శాస్త్రం విద్యుత్ కోసం మాత్రమేనన్న వాదనలో కొంత వాస్తవమూ, కొంత మొండితనమూ లేకపోలేదు. కానీ ఆసియా నుండి, ముఖ్యంగా పశ్చిమ దేశం పాలించిన దేశం నుండి వచ్చిన నాకు ఈ మొండితనం అర్థం చేసుకోవడం నా అమెరికన్ స్నేహితులకన్నా సులభతరం.

1. అసలు అణుశాస్త్రం దేనికైనా వినియోగించడం అంగీకరించదగ్గ విషయమేనా?
2. అంతకన్నా సురక్షితమైన పద్దతులు లేవా?
3. నార్త్ కొరియా, ఇండియా, ఇస్రాయెల్, చైనా ఉపయోగించగాలేంది, ఇరాన్ వాడితే వచ్చిన ప్రమాదమేంటి?
4. నాన్-ప్రొలిఫరేషన్ ఒప్పందంలో ఇండియా పాల్గొనలేదు, కానీ అమెరికా మొన్నటికి మొన్న ఇండియాకి అణు శాస్త్ర పరిశోధనలో సహాయపడ్డానికి అంగీకరించింది. దీని వెనుక అసలు కారణం పెరుగుతున్న చైనా అధికారమా?
5. మొదట ఉపయోగించిన 'మిడిల్ ఈస్టులో ప్రజాస్వామ్యం' అన్న పదం అంతగా వినిపించడంలేదే ఇప్పుడు? ఇరాక్‌లో వీళ్ళు వెలగబెట్టిన ప్రజాస్వామ్యం ఉదాహరణ వాళ్ళ నోళ్ళే మూయిస్తోందా?
6. ఇరాక్ షియా నాయకులు ఇరాన్‌తో బలమైన బంధాలు ఏర్పరుచుకోవడం ఈ విషయానికి మూల కారణమా?
7. లేక ఇదీ ప్రకృతి వనరులకై జరుగుతున మరో పోరాటమేనా?
8. అసలు యుద్ధం అన్నది మానవజాతి పురోగతికి అవసరమా, లేదా?

****

# మనం - మతం

మా ఇంట్లో ఆచారాలకి పెద్దపీఠం ఎప్పుడూ లేదు. అర్థం కాని, అర్థం లేని, సరైన జవాబులు లేని కొన్ని పనులు అందరూ చేస్తున్నారు కదా, మనమూ చేద్దాం అన్న ఆలోచన మా నాన్న ఎప్పుడూ ప్రోత్సాహించేవాళ్ళు కాదు. మా ముత్తాత శ్రీరామయ్య స్వాతంత్రం రాక ముందు రోజుల్లో ఊపందుకున్న జ్ఞాన విస్తృత (ఇంతకన్నా ఎలా బాగా చెప్పాలో తెలియట్లేదు). ఉద్యమంలో భాగంగా, తనకున్న వేదం, సంస్కృత పాండిత్యంతో, బ్రాహ్మణులతో అవసరం

లేకుండా ఊరివారందరికి అవసరమైన కర్మ, కాండలు, పెళ్ళిళ్ళూ మొదలైనవి తనే చేసేవాడట. కొన్ని మైళ్ళ దూరం నడచి వెళ్ళి తెచ్చుకొన్న వార్తా పత్రికలు, పుస్తకాలు, బ్రహ్మ సమాజానికి సంబంధించిన విషయాలు చదివి రోజులు గడిచే కొద్దీ, అసలు అవికూడా అవసరంలేదని ప్రజలకి ఉపన్యాసాలివ్వటం మొదలు పెట్టాడట. అలాగే ఆయన మా తాతయ్యకి భగవద్గీత చదివితే చాలు, మరిక ఏ పుస్తకమూ చదవనవసరం లేదని బోధించడంతో, అవే విలువలు మా నాన్నకీ వంటబట్టాయి. ఇదీ నా పేరు వెనకాతల ఉన్న కథ, అప్పుడప్పుడూ ఇంత సాధారణమైన పేరు పెట్టారని బాధ పడ్డా, ఇదంతా ఆలోచిస్తున్నప్పుడు చాలా సంతోషంగా ఉంటుంది, అలాంటి వాళ్ళ నమ్మకాల్ని నేను, నా పేరు సంతరించుకోడం. ఇలా మా ఇంట్లో అన్ని పండగలకీ, మత ప్రాధాన్యత కన్నా సాంస్కృతిక ప్రాధాన్యత ఎక్కువగా ఉండేది. అన్నింట్లోకి సంక్రాంతి చాలా సంబరంగా జరుపుకునే వాళ్ళం. తరాల తరబడి వ్యవసాయం మీద ఆధారపడ్డ సమాజం మనది, అన్ని వేల సంవత్సరాలపాటు మనల్ని భరించి, పోషిస్తున్న భూమాతని తలుచుకోవలసిన సమయం అన్నది మానాన్న అభిప్రాయం. జరిగిపోయిన రోజులన్నింటిలో నాకు చాలా ముఖ్యమైన రోజుల్ని గురించి ఎవరైనా అడిగితే, మా ఇంట్లో వాళ్ళతో గడిపిన సంక్రాంతి శెలవలు అని తడుముకోకుండా చెపుతాను.

సంక్రాంతి నెల రావటమే, హేమంతపు వెన్నెల నీడల్లో, ధనుర్మాసపు మంచు తెరల్లో తడిసి వింతగా నవ్వుతున్న పున్నాగపూలతో పాటుగా అందంగా వస్తుంది. గడ్డి పరకల చివర వేళ్ళాడుతున్న మంచు బిందువుల్లో పరావర్తనం చెందే వేకువ, తెల్ల తివాచీ పరచి సమ్మోహనంగా స్వాగతమిస్తున్న పారిజాతాలు, పెరట్లో తువ్వాయి మెడలో మోగుతున్న గంటలు, సగం నిద్రలో జామ చెట్టుమీద కువకువ లాడుతున్న చిలకలు, సృష్టిలో ఇంతకన్నా అందమైన ఉదయం మరెక్కడుంటుంది, భోగిరోజు కాక మరెప్పుడుంటుంది? కష్టపడి సంవత్సరం పాటూ సేవలందించిన గోమాతకి, భూమాతకి (నన్నడిగితే మన నిజమైన దేవుళ్ళకి) కృతజ్ఞతలు సమర్పించుకొనే మనుషుల్ని చూస్తే అంతకన్నా అర్థవంతమైన పద్ధతి మరోటి లేదనిపించే సమయం, కనుమ రోజు కాక మరెప్పుడొస్తుంది?

సంక్రాంతి తర్వాత బాగా గుర్తున్నది మా కుటుంబానికి బాగా దగ్గరైన రసూల్ కుటుంబం జరిపే రంజాన్ పండుగ. సహజంగానే బాగా తిన గలిగే రసూల్, ఆకలి మీద ఉంటే ఒక కోడిని సునాయాసంగా తినేసే వాడు. మా ఇంట్లో మాంసం వడుకొన్న రోజల్లా తను మాతో తినడానికి వీలుగా, నాన్న మస్తాన్ దగ్గరనుండి హలాల్ మాంసమే తెచ్చేవాళ్ళు. అలాంటి రసూల్ రంజాన్ నెల పొడుగూ, పగలంతా ఏమీ తినకుండా ఎలా ఉండగలిగే వాడన్నది మాకు అర్థమయ్యేది కాదు. ‘భేటా, మనకన్నా తక్కువలో ఉన్న వాళ్ళకి చేయగలిగింది చేస్తూ, మనం తినడం తగ్గించుకోవడం చేయమని అల్లా చెప్పినప్పుడు చేయడం పెద్ద కష్టమేమీ కాదు‘ అనేవాడు ఉర్దు యాసలో. నిజంగానే ఆలోచిస్తే, మొహమ్మద్ ప్రవక్త తన మతప్రచారం చేస్తున్న సమయంలో, తన శిష్యులందరి మధ్యా మంచిస్నేహం, స్వార్థం, అసూయ మరిచిపోయి ఒకరికొకరు సహాయం చేసుకోవడం ఆ కొత్త మతానికి చాలా అవసరమైన విషయం అయి ఉంటుంది. నాకు తెలిసిన మరికొంత మంది , నోటిలో లాలాజలం కూడా లోపలికి వెళ్ళనిచ్చేవారు కాదు. కొన్ని సంవత్సరాల తర్వాత ఖురాన్ చదువుతున్నప్పుడు, ఈ వాఖ్యం కనపడి నన్ను ఆశ్చర్య పరిచింది. ఏ మతమైనా కొన్ని సంవత్సరాల తర్వాత తనలోని కొన్ని మంచి గుణాల్ని, సరిగా అర్థం చేసుకోలేని మనుషుల మూలంగా కోల్పోతుందనుకుంటా.

"మీలో ఎవరైతే ఖురాన్ చదివి, దాని విలువ అర్థం చేసుకుంటారో వారు, ఈ నెలని జాగ్రత్తగా ఆచరించాలి. కానీ ప్రయాణం చేస్తున్న వాళ్ళు కానీ, జబ్బు పడ్డవాళ్ళు కానీ, అన్నే రోజులు మరో సమయంలో పాటించవచ్చు. దేవుడు మీ సంక్షేమాన్ని ఆసిస్తాడు కానీ, ఇబ్బందుల్ని కాదు. మీ బాధ్యతలు నెరవేర్చి, దేవుడు మిమ్మల్ని కాపాడి, ఒక మార్గం

చూపినందుకు కృతజ్ఞత చూపించండి" (2:185)
రంజాన్ వచ్చిందంటే మా ఇంటిల్లిపాదీ రసూల్ వాళ్ళ ఇంట్లోనే భోజనం. గంటల తరబడి నిప్పులమీద ఉడికి ఘుమఘుమ లాడుతున్న బిరియాని, కోడి కూర, గోంగూర పచ్చడి ఇప్పటికీ అప్పుడప్పుడూ గుర్తుకువస్తుంటాయి. వాళ్ళ తమ్ముళ్ళు, అన్నల కుటుంబాలు కలిసి రసూల్ వాళ్ళింట్లో కలిసి వండుకొనే వాళ్ళు, ఎంత సందడిగా ఉండేదో. అంతకు మించి వాళ్ళందిరిలో కలిసిపోయిన మాకు, మేము వాళ్ళనుండి ఏమ్మాత్రమూ వేరే కాదన్న భావం. అవే బంధాలు, అవే భావాలూ, అవే అవేశాలు, అంతకన్నా మనుషుల్ని దగ్గర చేసేవేముంటాయి?
అలాంటిది 2005లో అదృష్టవశాత్తూ రంజాన్ సమయంలో ఇంటికి వెళ్ళిన నాకు, పండగరోజు బాషా అన్నయ్య వాళ్ళింట్లో గడిపే అవకాశం వచ్చింది. అందరం కలిసి భోజనం చేసాక, గౌస్య రిమోట్ తీసుకొని ఛానెల్ మారుస్తూ ఉంటే, ఏదో సినిమా జరుగుతూ ఉండడం గమనించి, 'ఇదేమైనా కొత్త సినిమానా?' అని అడిగా. 'ఆ కొత్త సినిమానా, మా పండక్కి కొత్త సినిమా ఎందుకు వేస్తారక్కా?', అని పాకిస్తానీ చానెల్ పెట్టింది. నాకు ఒక్కక్షణం ఏం చెప్పాలో తోచలేదు. నేను లేకపోవడం చూసి, ఇండియా ఒక్కసారిగా మారిపోయినట్లుగా అనిపించింది. 1990ల్లో గొడవలు జరిగినప్పుడు కూడా, మా ఊరులో ఎలాంటి వాదనలు జరగలేదు. ఆ గొడవలు మరేదేశంలో, మరో కాలంలో జరిగినట్లనిపించాయి. దీనికి తోడు, నాకు బాగా దగ్గరైన మంచి చదువు , ఉద్యోగం ఉన్న నా స్నేహితుడొకడికి ముసల్మాన్‌లంటే పడదు(చదువున్నంత మాత్రాన జ్ఞానం రాదు అన్న సంగతి నేను చాలా బలంగా నమ్ముతాను). అదేమంటే వాళ్ళ మతం గుడ్డి నమ్మకాన్ని బోధిస్తుంది, వాళ్ళు ఆడవాళ్ళని సరిగా చూడరు లాంటివి చెపుతుంటాడు. ఇదే మహానుభావుడు ప్రతి శనివారం గుడికి వెళ్ళి జేబులు ఖాళీ చేసుకొని వస్తాడు. ఓరోజున మాటవరసకి ఒక పరిశోధనలో ఆడవాళ్ళ మెదడు నిర్మాణం , మగవారికన్నా తేడాగా ఉండడం మూలాన ఆడవాళ్ళు తొందరగా పరిస్థితిని అర్థంచేసుకొని ప్రతిస్పందిస్తారు అంటే, దాని గురించి నెలరోజులు గింజుకున్నాడు.
కానీ ఇవ్వాళ రోజున ఎక్కడో మారుమూల ఉన్న మా ఊరులో ఉన్న పదహారేళ్ళ పిల్ల, అమెరికాలో ఉండే ఒక సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఇలా ఆలోచిస్తున్నారంటే అది కేవలం మతాల్ని తమ స్వార్థం కోసం వాడుకొంటున్న రాజకీయ నాయకులు, అనవసరమైన విషయాలు గోరంతలు కొండంతలు చేసి చూపించే టి. వి ఛానెళ్ళు, వార్తా పత్రికలదేనా తప్పు? లేక ఒక సమాజంగా మనకేమయిందని ఒక్క నిముషం ఆగి ఆలోచించుకోవాలసిన బాధ్యత మనమీదుందా?

*****

## మనం తెలుసుకోవలసిన కొన్ని నిజాలు

మొదటగా నేను 'హిందు' అని గర్వంగా చెప్పుకునే వాళ్ళకి:
ఆ. హిందు అన్న పదం మతానికి పరిమితమైన పదం కాదని తెలుసా? సింధూ నది ప్రాంతంలో నివసించే వాళ్ళని గ్రీకులు హిందువులని పిలిచేవారు.
2. ఇస్లాం మనపై దాడి చేసిన రాజులెవరూ రాక మునుపు, మొహమ్మద్ బ్రతికి ఉన్న రోజుల్లోనే (571-632) ఇండియాకి వ్యాప్తి చెందిందని తెలుసా?
చెర్మన్ పెరుమాళ్ కాలంలో, 629వ సంవత్సరంలోనే ఇండియాలో మొట్టమొదటి మసీదు కొడుంగళ్ళూర్ లో కట్టబడింది. దీనికి మూల కారణం మన మలబార్ తీరానికి, అరేబియాకి మధ్య నడిచిన కీలకమైన వ్యాపారం.

ఇండియాకు వచ్చే వర్తకులు కొంతమంది తమతో పాటూ ఈ మతాన్ని తీసుకు వచ్చారు.

3. కత్తి ద్వారా వ్యాపించిన మతంగా ఇండియాలో పేరొందిన దీని వెనుక మరెన్నో కారణాలు ఉండి ఉండొచ్చు.

అ. సూఫీ మత ప్రాబల్యం, ఆ మతంయొక్క ఆలోచనా విధానం తాత్వికంగా సమంజసంగా అనిపించడమే కాక, అప్పటికే ఇండియాలో ప్రాచుర్యం పొందిన బౌద్ధ, అద్వైతాల్ని పోలి ఉండడం.

ఆ. పాలించే రాజులతో సఖ్యతగా మెలగడానికి, మంచి ఉద్యోగాలు సంపాదించడానికి దోహదం చేయడం.

ఇ. ప్రబలిపోయి ఉన్న కులాల బారి నుండి తప్పించుకోవడానికి అవకాశం.

ఈ. ఆ మతం బోధిస్తున్నవిషయాలు, హిందూ మతం బోధిస్తున్న వాటికన్నా మెరుగ్గా అనిపించి ఉండవచ్చు.

4. హిందూ మతమూ తన పాటి దాడి తను చేసిందన్న విషయం ఎంత మందికి తెలుసు? 200 బి.సి. లోనే జావా, సుమాత్రా ద్వీపాలమీద దాడి చేసిన తమిళ రాజులు తమతో పాటు హిందూ మతాన్ని తీసుకొని వెళ్ళారు. పైన చెప్పిన అన్ని కారణాలు ఇక్కడా వర్తిస్తాయి. తర్వాత కాలంలో, మగధ సామ్రాజ్యం, ఛోళులు, హిందూ మతాన్ని బర్మా, థాయిలాండ్, ఫిలిప్పీన్స్, కంబోడియా, వియెత్నాం లాంటిదేశాలన్నింటికీ తీసుకొని వెళ్ళారు. ప్రపంచం మొత్తమ్మీద బ్రహ్మదేవుడికి మూడే గుళ్ళుంటే, అందులో ఒకటి వియెత్నాంలోని అకోర్-వాట్ అన్న ప్రదేశంలో ఉందని మీకు తెలుసా?

5. ఇండియా ప్రగతికి, స్వాతంత్రానికి తమ జీవితాలని అర్పించిన మొహమ్మదీయుల్ని మీరు మర్చిపోయి ఉంటే, ఇదిగో ఇక్కడ మీకోసం కొన్ని పేర్లు:

అబ్దుల్ కలం ఆజాద్, ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్, హకిం అజ్మల్ ఖాన్, రహ్మత్ షా, హైదర్ ఆలి ఇంకా మరెంత లెక్కలేని మంది?

**మరి 'మేమెవ్వరికీ కాని మొహమ్మదీయులం' అని రోదించే నా ముసల్మాన్ సహోదరలు/ సహోదరీమణులకి:**

ఆ. మొదటగా మీరీ దేశంలో ఉండాల్సిన వాళ్ళు కాదు అన్న మొండి వాదన మానుకోండి. పైన చెప్పినట్లుగా మీరు ఎక్కడనుండో వచ్చిన వాళ్ళు కాదు. 95 శాతం మీ పూర్వీకులు ఇండియాలో పుట్టి ఉంటారు.

2. ప్రపంచ దేశాలన్నింటిలోకి మత సామరస్యమైన దేశంగా ఇండియా పేరుగాంచింది. ఇప్పటి రాజకీయ నాయకుల్ని వదిలేసి ఆలోచించండి. ఒకప్పుడు నేను, నాకు మొదటిసారి మోపెడ్ నేర్పి, సొంత కూతురిలాగా చూసుకొన్న రసూల్ లాగా, మనందరం కలిసి బతకలేదా?

3. అసలు పూర్వ కాలానికే వెళ్ళి చూద్దాం, డిల్లీ సుల్తానులే హిందువుల మంచి తనాన్ని గుర్తించి, కొందరు రాణుల్ని చేయడమే కాక, రెండు మతాల సూత్రాల ఆధారంగా మరో మెరుగైన మతాన్ని, జీవన విధానాన్ని సృష్టించాలని చూసారు.

4. ఇండియన్ న్యాయస్థానాలు 'షరియా' న్యాయాన్ని గౌరవిస్తాయి, ఇలాంటి స్వాతంత్రం మరే మత సామరస్య దేశంలోనూ లభించదు.

5. మిమ్మల్ని మీరు అన్యాయానికి గురైన వాళ్ళగా కాక, అసలా భావం ఎందుకు వస్తుంది, ఏం చేస్తే దాన్ని ఎదుర్కొన వచ్చు అని ఆలోచించండి. మనసుంటే మార్గం లేకపోలేదు. ఒకవేళ తీవ్రమైన సమస్యే వస్తే, ఇది మీ దేశం, పరిస్థితులనుండి, సమస్యలనుండి పిరికిగా పారిపోయే కన్నా, సవాల్ చేసి గెలుచుకోండి.

6. ఎక్కడో తలకు మాసిన ఎవడో తలపెట్టిన భయానక చర్యల గురించి చర్చించుకోవలసిన పని మనకు లేదు. ఏ మార్గమూ లేనప్పుడూ హింసాత్మక మార్గం ఎన్నుకుంటారన్నది వాస్తవం, అందుకే సమస్యల్ని ఎలా మెరుగ్గా

పరిష్కరించాలి అన్న ప్రశ్నలో సగభాగం మీదీను.

**మనందరికీ:**

శతాబ్దాల తరబడి నివసిస్తున్న మనం, మతం, రాజకీయాల తేడాల మూలంగా కొట్టుకు చావడం ఎంత హాస్యాస్పదం? మతం ఒక మత్తుమందు అన్నారెవరో, ఎంత నిజముంది ఆ వాఖ్యంలో. మారుతున్న కాలాన్ని బట్టీ మత విశ్వాసాలు మారాలే, అలాగే గతంలో జరిగాయి కానీ గత ఆ300 సంవత్సరాలనుండీ వేరే కొత్తమతం ఏం రాలేదు? మతం చుట్టూ, డబ్బూ, అధికారం ఏర్పరుచుకొన్నాం గనుకనా? రెండు మతాల్లోనూ ఉన్న ఛాదస్తుల్ని ఎదురు తిరిగి ప్రశ్నించడానికేం జంకు? వార్తా పత్రికలు, టెలివిజన్ చెపుతున్న విషయాలు ఆలకించి, మరోసారి ఆలోచించి, అవలోకించి అర్థం చేసుకోండి. ప్రతిదాని వెనకా ఎవడిదో స్వార్థం, ప్రయోజనం లేకపోలేదు.

చివరగా, దాదాపు అరవై వేల సం వత్సరాల క్రితం, ఆహారం దొరక్క మరో దారి లేక ప్రకృతి వనరుల్ని వెదుక్కొంటూ బయలుదేరిన కొన్ని తెలివైన వానరాలు కలిసి కట్టుగా ఉండక, కొట్టుకు చచ్చిఉంటే ఇవ్వాళ మనము ఇక్కడిలా ఉండేవాళ్ళమే కాదు. మానవజాతి మనుగడకి శాంతి, సహనం ఎంతో ముఖ్యం, లేకపోతే వచ్చే తరానికి ఇప్పుడే సమాధి కట్టడం తప్పదు.

*****

# నువ్వు - నేను - ప్రేమ

*"ఒక శరద్రాతి ఏటవాలు క్షణాల మీద నిటారుగా నిలబడి*
*వెన్నెల తీవెల్ని మీటగల ధైర్యాన్నిచ్చేదే ప్రేమ .*
*కనురెప్పల మైదానాల మీద కలల విత్తనాలు జల్లి*
*అనుభూతుల పంట పండించేదే ప్రేమ .*
*నాలోంచి నేను దూకేసి నీ దగ్గరకు వచ్చేయాలనిపించేది,*
*నా మనసుకు మాట్లాడే అనుమతినిచ్చేదే ప్రేమ .'*

మనిషిగా పుట్టడం వలన మనకు ప్రాప్తించిన వరం మన భావాలను వ్యక్తం చేయగలగడం. కానీ దాని వెనుక దాగి ఉన్న శాపం, ఆ భావాలను అర్థం చేసుకోవాలన్న తాపత్రయం. ఎప్పుడైనా జీవితంలో ఒక్క నిమిషం ఆగి కోపము, భయము, ప్రేమ, వేదన లాంటి భావావేశాలు మనలో ఎందుకు కలుగుతాయి, వాటి మూలంగా మన మనుగడ ఎలా సులభతరమౌతుందా, అని పరిశీలించిన వారికి అర్థమౌతుంది నేను ఈ జ్ఞానతృష్ణను శాపంగా ఎందుకు పరిగణించానో.

కానీ మొదట శీర్షికలో చెప్పినట్లుగా ఈ ప్రశ్న వేసుకోగల మెదడు మనకున్న మరో అందమైన వరం.

పరిణామ శాస్త్రవేత్తలు చెప్పినట్లుగా కోపం, భయం, ఆవేశం ఇవి మనకు అర్థం కాని, ఇష్టం లేని, ప్రాణ హాని కలిగించే పరిస్థితులు లేక శతృవులు ఎదురైనప్పుడు మన మెదడు ఆలోచించే ఒక నిర్ణయానికి వచ్చేంత సమయం లేనప్పుడు, మన క్షేమం కోసమై మన శరీరం రూపొందించిన పరిరక్షణ విధానాలు. కానీ మరికొన్ని భావాలు మన ఊహకు అందనంత క్లిష్టతరమైనవి, ఉదాహరణకి ప్రేమ, మరణం లాంటివి. (అవునూ ఇంతకూ మరణం నిజమైన అనుభవమా, లేక అదీ ఒక భావమా? అనుభవించిన వారెవరూ మన మధ్య మిగల్లేదు గనుక అదీ ఒక భావమేనంటాను. అలోచిస్తే మరో ప్రశ్న తోస్తోంది: దుఃఖమూ, వేదనా ఒకటేనా లేక రెండు వేర్వేరు భావాలా?). ప్రేమ గురించి చెప్పటానికి, దానికో నిర్వచనాన్ని ఇవ్వటానికి ప్రయత్నించి చరిత్రలో చాలామంది మహానుభావులే విఫలులయ్యారు. మనకు కావలసిన లక్షణాలున్న వాళ్ళను కలిసిన క్షణాల్లో, ఆ విషయం మన శరీరం మనకు చెప్పడానికి విడుదల చేసే కొన్ని రసాయనాల, హార్మోనులే ప్రేమ అన్న భావరహితమైన, శృంగార హీనమైన నిర్వచనాన్ని సైన్స్ ప్రసాదిస్తుంది. కానీ ప్రేమని ఇలాంటి విభిన్న కోణాలనుంచి శోధించి పరిశీలించినా అర్థం చేసుకోగలమంటారా?

మనలో ప్రతి ఒక్కరికీ ఎదురై, చిన్న చిన్న వివరాలతో సహా జీవితాంతం గుర్తుండిపోతుంది ఆ సంఘటన. ఒక్కోసారి అది, తొలకరి చినుకుల మధ్య, మేఘాల అంచున చిరువెచ్చని మెరుపులతో పాటూ వస్తే, మరికొన్ని సార్లు గది బయట వెన్నెల్లో తళుక్కుమన్న ఇసుక రేణువుల నవ్వులతో పాటుగా వస్తుంది. గోదారి అంచుల్లో తడిసిన పచ్చగడ్డి పరిమళమో, ప్రశాంతంగా ఉన్న కాలువలో గుల్‌మొహర్ పూవు రాలిపడిన శబ్దమో, మసక వెన్నెల్లో మెరుస్తున్న కోనేటి అలో, వీటన్నింటికీ తోడుగా వస్తుందే ఏవో అస్పష్టమైన కోరికల జాడ, తప్పక మన ప్రేమ తాలూకూ జ్ఞాపకమే అయి ఉంటుంది. ఈ ప్రేమ బోల్డన్ని రకాలు: అవతలి వ్యక్తికి తెలిసిన ప్రేమ, తెలియని ప్రేమ, తెలిసినా ఉపయోగం లేని ప్రేమ, తెలియకూడని ప్రేమ. కోరుకున్న ప్రేమ, కోరికలకి అతీతమైన ప్రేమ. కలవారి ప్రేమ, కలల వారధి ప్రేమ. ఆనందాన్నిచ్చే ప్రేమ, అవధులు దాటించే ప్రేమ. ఏదైతేనేం అది, చిరుగాలి స్వాంతన చిలికి గాలివాన చేసే సత్తా ఉన్న అమోఘమైన మాయ!

ఒక్కోసారి ఆగి ఉన్న బోగీలో కూచుని కిటికీ లోంచి చూస్తాం, అవతల పట్టాల మీద ఆగిన రైలు బోగీలో వ్యక్తి మనకి అత్యంత ఇష్టమైన పుస్తకంలో లీనమై మోహనంగా నవ్వుతూ! మరోసారి మన పక్క సీటులో కూచున్న వ్యక్తితో మాటలు కలిపి పేరు తెలుసుకొనే లోపున, తెలీని గమ్యస్థానంలో దిగుతూ! మరికొన్ని సార్లు, సంవత్సరాల తరబడి స్నేహాన్ని మించిన ఆ భావం ఆనవాలు తెలిసే లోపున, మరొకరి సొంతమైపోతూ! చాలా కొన్ని సార్లు జీవితానికి, మన అస్తిత్వానికి అర్థాన్నిస్తూ అదృష్టవశాత్తూ మన సొంతమై! ఇంకా కొన్నిసార్లు, దూరమైతే కాని సాధ్యం కాక, జ్ఞాపకాల సంధ్యాకాంతుల సందిట్లో కరిగిపోతూ! ఎలా అయితేనేం, వయసు చేసిన గాయాలు మాన్పి, అనుభవాలు వేసిన సంకెళ్ళు తెంచే అందమైన ప్రేమ.

ఈ ప్రేమ మనలో కొంతమందికి ఊపిరి పోస్తే, మరికొంత మందిని ఉక్కిరి బిక్కిరి చేస్తుంది. మనలో కొందరకి అపూర్వమైన స్వాతంత్రాన్నిస్తే, మరి కొంత మందికి క్రూరత్వాన్ని ఆపాదిస్తుంది. మనలో కొంతమందికి ధైర్యాన్నిస్తే, మరికొంత మందికి పిరికిమందు నూరిపోస్తుంది. మనలో కొంతమందికి కొన్ని జీవితకాలాలకి సరిపడే అందమైన అనుభవాల్నిస్తే, మరికొంతమందిని విలువల పేరిట విరాగుల్ని చేస్తుంది. మనలో కొంతమందికి బ్రతుకుని ఎదుర్కొనే సత్తువనిస్తే, మరికొంత మందిని అకాలంగా బలిచేస్తుంది.

ఇంతటి క్లిష్టమైన సమస్యనెలా పరిష్కరించడం? ఇలాంటి ప్రేమనెలా అర్థం చేసుకోవడం? ప్రేమంటే ఏమిటన్న నీ ప్రశ్నకు నేనెలా బదులివ్వడం?

మరి మన వ్యక్తిగత ప్రేమల్ని పక్కన పెడితే:

నానా రకాల యాతనలూ పడి, తన శరీర సౌందర్యాన్ని నాశనం చేసుకొని, మనశ్శాంతిని త్యాగం చేసి కని పెంచి ప్రాణం కన్నా మిన్నగా చూసుకొనే తల్లి ప్రేమ.

తన జీవితమేమైనా లెక్కచేయక మనకోసమై అహోరాత్రులూ శ్రమించి సౌకర్యాలు కూర్చిన నాన్న ఉన్నతమైన ప్రేమ.

కొన్ని ప్రాణులు (కొన్ని రకాల చేపలు, తేళ్ళు మొదలగు జీవులు) తమ జీవితంలో ఒక్కేఒక్క సారి ప్రత్యుత్పత్తి జరిపి తమ ప్రాణ త్యాగం చేస్తాయి. మరి వాటి ప్రేమ? మదర్ తెరీసా లాంటి వాళ్ళకి తనకేమీ కాని మనుషుల మీద ప్రేమ. దయ ప్రేమకు దారి తీస్తుందా లేక ప్రేమ దయకా? అలా కాక మతం మనకు చేయగల ఒకేఒక్క ఉపకారం, మదర్ తెరీసా లాంటి మనుషుల్ని మనకివ్వడమా? మరి జీసస్ బోధించిన విశ్వ జనీనమైన ప్రేమకి అర్థం? ఒక్క దేశంలో కలిసి కట్టుగా బ్రతకలేక కొట్టుకు చస్తున్న ప్రస్తుత సమాజంలో యేసుచెప్పిన మాటలకి అర్థం ఏమిటి?

ఇక గాంధి, మార్టిన్ లూథర్ కింగ్ బోధించిన అహింసకు అర్థం ఏమిటి? శత్రువులను సైతం ప్రేమించటం సాధారణమైన మనుషులకు సాధ్యమా? కారణం లేకుండా దేశాల్ని నాశనం చేస్తున్న నాయకుల్ని ప్రేమించడం పక్కన పెడితే, కనీసం క్షమించడమైనా న్యాయమా? నిజాన్ని మాత్రమే ప్రేమించమన్న బుద్ధుడి మాటో? అసలు నిజమన్న మాటకు నిర్వచనం మనకింకా గుర్తుందా? నోరు తెరిస్తే అబద్ధాలు, సమాజం కోసం మాత్రమే బ్రతుకులు, మనలో ఎంతమంది గుండె మీద చేయి వేసుకొని నిబ్బరంగా నిజం చెప్పగలం? కనీసం మనతో, మనమైనా అబద్ధాలడకుండా ఉండగలమా?

ఇన్ని పుస్తకాలు, కవితలు చదివిన నాకు ప్రేమ గురించి నిజంగా తోచిన ఒక్క పేరా ఇక్కడ రాస్తున్నా. మీలో చాలా మందికి అసలు దీని వెనుక అర్థమే ఉన్నట్లు అనిపించదేమో. కరెక్టుగా నా పాయింటూ అదే ప్రేమ అన్నది మనకు చాలా దగ్గరైన, వ్యక్తిగతమైన విషయం. దాన్ని మరొకళ్ళు అనుభవించిన, నిర్వచించిన విధంగా మనం అనుభవించలేం. ప్రేమలో పడ్డ ఇద్దరిని దానికర్థమేంటని అడిగితే, మనకి వాళ్ళిద్దరూ సాధారణంగా వేర్వేరు సమాధానాలు ఇస్తారు. అదే ప్రేమకున్న గొప్పతనం. మనకెప్పటికీ అర్థం కాకుండా, అది లేకపోతే అసలు మన జీవితాలకి అర్థమంటూ లేకుండా చేస్తుంది

"And as I sat there brooding on the old, unknown world, I thought of Gatsby's wonder when he first picked out the green light at the end of Daisy's dock. He had come a long way to this blue lawn, and his dream must have seemed so close that he could hardly fail to grasp it. He did not know that it was already behind him, somewhere back in that vast obscurity beyond the city, where the dark fields of the republic rolled on under the night."

*" నేనందిరి మధ్యా ఉన్నప్పుడు*
*కళ్ళెత్తి నెమ్మదిగా నిశితంగా చూస్తావ్..*
*నీకేం తెలుసు? ఆ క్షణం నాలో*
*చెలరేగే స్పందనల గురించి, నిశ్శబ్ద సంఘర్షణల గురించి?*
*అకస్మాత్తుగా నిన్నుతప్ప అందర్నీ మాయం చేసే శూన్యం గురించి,*
*ఆ క్షణం మనిద్దరికీ చాలక ఇరుకైపోయే విశ్వం గురించి?*
*ఊపిరి ఉద్వేగాల తాకిడికి ఆవిరైపోయే లిప్తల గురించి,*
*నీ చూపుల వలలో చిక్కుబడి చెల్లాచెదురయ్యే నా అక్షరాల గురించి?"*

# గతానురక్తి

*"సందె పొద్దుల కాడ సంపంగి నవ్విందీ,  అందగత్తెను చూడ జాబిల్లి వచ్చింది*
*మబ్బు పట్టే కళ్ళు, తబ్బిబ్బులయ్యే వళ్ళూ ఎవ్వరికిస్తుందో, ఏమౌతుందో? "*

మొన్నా మధ్య ఒక స్నేహితుడితో సినిమా పాటల సాహిత్యం గురించి చర్చిస్తున్నప్పుడు, అభిలాష సినిమాలో పైన చెప్పిన పాట గురించి మేమిద్దరం విన్న 'ప్రేమ' పాటలన్నింటిలోకి, సున్నితమైన శృంగార భరిత సాహిత్యానికి, మత్తుజల్లే జానకి స్వరం, ఇళయరాజా కూర్చిన అందమైన సంగీతం కలిసిన ఈపాట మాఇద్దరికి  నచ్చినదని ఒప్పుకున్నాము. ఇప్పుడు వస్తున్న సినిమాల్లో అలాంటి పాటలుగాని, నిరీక్షణ, మేఘసందేశం, తరంగిణి లాంటి కథలు గాని రావట్లేదని వాపోయాం. తరంగిణి సినిమా మీరు చూసుండక పోతే, ఒకసారైనా చూడమని నా సలహా. చాలా ఆసక్తికరమైన, ధైర్యవంతమైన విషయాన్ని తీసుకొని కోడి రామక్రిష్ణ గారు చేసిన ప్రయోగం. చివరకు కొంచెం మెలో డ్రామాగా మారినా మొత్తానికి మంచి సినిమా. అతనితో మాట్లాడి ఫోను పెట్టేసిన తర్వాత ఆ సంభాషణ గురించి మరోసారి ఆలోచిస్తుంటే నాకో విషయం హఠాత్తుగా స్ఫురించింది.  కొన్ని సంవత్సరాల క్రితం (వివిధభారతి  స్టేషన్ నుంచి సినిమా పాటలు వినే కాలంలో), కరెక్టుగా ఇదే పాట రేడియోలో వచ్చినప్పుడు మేం సౌండు చాలా పెంచేసి వింటుంటే, మా నాన్న విసురుగా లోపలికి వచ్చి, రేడియో కట్టేయడం గుర్తుకు వచ్చింది. మా ఇంట్లో మాకూ, మా నాన్నకు ఘంటసాల, బాలు మధ్య ఎవరు మంచి గాయకులు అన్న విషయమ్మై వివాదాలు జరుగుతూ ఉండేవి. ఆయన్ను ఉడికించడానికి మేము బాలు పాటలు వచ్చినప్పుడు రేడియో సౌండు పెంచేయడమో లేక గొంతులు కలిపి పెద్దగా పాడడమో చేసేవాళ్ళము. మా నాన్న కొన్నిసార్లు నవ్వేసి వెళ్ళిపోయేవాళ్ళు. మరికొన్ని సార్లు ఘంటసాల గొంతులో

మాధుర్యం గురించి, అప్పటి పాత పాటల్లో సాహిత్యం (సముద్రాల రాసిన పాటలంటే మా నాన్నకు చాలా ఇష్టం. ఏదేమైనా ఆయన రాసిన పాటలంటే నాకూ ఇష్టమే), ఈతరం సినిమా పాటల్లో ఉండదని అనేవాళ్ళు. కరెక్టుగా మరో పదిహేను సంవత్సరాల తర్వాత అచ్చు ఆయన మాట్లాడినట్టుగా మేమూ అనుకోవడం తలుచుకొంటే, నాకు కొంచెం నవ్వు వచ్చింది. మొదటగా నా వయసు, మనసు తేడాలు తలచుకొని (అప్పటికన్నా పదిహేనేళ్ళు పెద్దదాన్ని గదా!), రెండోది, అసలు నాన్న ఉక్రోషం సగం తన భావాల్ని, జ్ఞాపకాల్ని మేం గౌరవించట్లేదన్న భావనేమో అన్న సందేహం. ఈ సంఘటన జరిగిందాకా నేను, వర్తమానంలో మార్పు నంగీకరిస్తూ బ్రతికే వ్యక్తినన్న విషయాన్ని చాలా గాఢంగా నమ్మాను. కానీ ఈ చిన్న సంఘటన, నా నమ్మకాన్ని పటాపంచలు చేసింది.

ఒక స్నేహితురాలింట్లో పార్టీకి వెళ్ళినప్పుడు కలిసిందీవిడ. ఇంగ్లండు నుంచి వచ్చింది. ఒకప్పుడు, దాదాపు ముప్పయి, నలభై సంవత్సరాల క్రితం కేప్‌టౌన్‌లో నివసించిందట. అపార్తైడు గురించి మాట్లాడుతూ ఈ సంఘటన గురించి చెప్పింది. తన ఇంట్లో పనిచేయడానికి వచ్చిన అమ్మాయికి అమెరికాలో జరుగుతున్న సివిల్ రైట్స్ ఉద్యమం గురించి అసలేం అర్థం కాలేదు అని చెప్పింది. నాకు ఒక్క క్షణం ఏం అర్థం కాలేదు. వివరించి ఇలా చెప్పుకొచ్చింది. అమెరికాలో నల్ల జాతి వాళ్ళు ఆ అమ్మాయి దృష్టిలో చాలా అవకాశాలతో, హాయిగా బ్రతుకుతున్నారు, ఇంకా పోరాడాల్సిన అవసరం వాళ్ళకేం వచ్చింది అని? మనిషి ఆలోచన తన పరిస్థితుల వలన ఎంత ప్రభావితమౌతాయి అన్నదానికి ఇదో గొప్ప ఉదాహరణేమో. తమ హక్కులు ఏమిటి అని తెలుసుకోలేని పరిస్థితుల్లో నివసిస్తున్నప్పుడు అది తప్ప వేరే జీవితం సాధ్యమేనన్న విషయం కూడా తట్టదనుకుంటా. అలా కాకపోతే తన జీవితం తప్ప, మరెవరి జీవితమైనా సుఖంగా గడిచిపోతున్నట్టుగా అనిపిస్తుందేమో. దీనికీ, మన గతానురక్తికీ ఏదైనా సంబంధం ఉందంటారా? మన ప్రస్తుత జీవితం భారంగా ఉన్నప్పుడు, మనకు తెలిసిన మరో కాలం, మరో జీవితం, దాని తాలూకూ జ్ఞాపకాలు మెరుగ్గా అనిపిస్తాయా? లేక కొంత వయసొచ్చాక ఆశావాదం నుంచి, నిరాశావాదానికి సహజంగానే ఆకర్షింపబడతామా? దాని మూలంగా మన జ్ఞాపకాలు వర్తమానంలోని అనుభవాలకన్నా మధురంగా అనిపిస్తాయా? ఎందుకిలా మనందరం జరిగి పోయిన కాలాన్ని, జ్ఞా పకాల్ని పట్టుకొని వేళ్ళాడుతుంటాము? భూత కాలమెప్పుడూ, వర్తమానానికన్నా మెరుగైందనిపిస్తుందేం? అసలు నిజంగా అది మెరుగైందేనా లేక నిస్సారమైన జీవితాలతో పోరాడే మనకో ఎండమావి లాంటిదా?

సరే, గతానురక్తి ఎలాంటి వారికైనా సహజమేనన్న విషయాన్ని స్పష్టంగా అర్థం చేసుకొన్నాం కదా, మరి ఇక ముందు పాత జ్ఞాపకాలు, జీవితాల గురించి అత్యంత ప్రీతిపాత్రంగా మాట్లాడే ముందు కొంచెం ఆలోచించుకొని, అవలోకించుకొని మాట్లాడదాం. ప్రవాసాంధ్రులలో ముఖ్యంగా నాకు నచ్చని ఒక్క విషయం, పాశ్చాత్య పద్దతులు మన యువతనెలా పట్టి పీడిస్తున్నాయన్న విషయంపై వీళ్ళు గంటలు గంటలు మాట్లాడుతారు. పోయిన సంవత్సరం ఒక సమావేశంలో కలిసినప్పుడు ఒక అమ్మాయి, తను ఇప్పుడు ఇండియా వెళితే సరిగ్గా సాంప్రదాయంగా వోణీలు, చీరల్లో కాలేజ్ అమ్మాయిలే కనపడ్డంలేదని చాలా బాధ పడిపోయింది. కానీ, చూడ్డానికి, మాట్లాడ్డానికి తను మాత్రం మచ్చుకైనా ఆంధ్ర అమ్మాయిలా లేదు. మరి సంప్రదాయాల గురించి అంత ప్రేమ ఉన్న ఈవిడ ఇలా మారువేషంలో ఇక్కడేం చేస్తోంది? మన సాంప్రదాయం, విలువలు, వాటి సంరక్షణ తన జీవితాశయాలన్నట్లుగా మాట్లాడే వీళ్ళ చేతలకీ,

మాటలకీ పోలికెక్కడా ఉండదు.

మరో దేశంలో ఉన్నప్పుడు, అక్కడి ప్రజల సంస్కృతికి అనుగుణంగా నడుచుకోవడం ప్రవాస భారతీయులం మనం నేర్చుకొన్నాం కదా! అలాగే అసలు ఏ పాత సంస్కృతైనా మారిపోయి, మరో సంస్కృతి అలవరుచుకోవడం వెనుక ఏదో కారణం ఉండే ఉంటుంది. దానికి కారణం ఇవ్వాళ టీ.వీలు, సినిమాలే కారణం కావచ్చు లేక వాటి మూలంగా చిన్నదైన ప్రపంచంలో అందరి చేత అంగీకరింపబడే విధంగా ఉండాలన్న కోరికే కావచ్చు. మనిషి సమాజ మృగం (Human is A social Animal.) మార్పు అన్నది సహజం, దాన్ని ఆపడం మన చేతుల్లో లేదు. కొన్నిసార్లు ఆ మార్పు బలవంతమైన సమాజాలనుండి వస్తే, మరికొన్ని సార్లు విప్లవాల రూపంలో బలహీన సమాజాల్నుండీ వస్తుంది. ఇదే కాక, కొన్ని ఆలోచనలు, ఆకర్షణలు పరిస్థితుల వల్ల ప్రాబల్యం వల్ల, మన సైకాలజీని తెలివిగా ఉపయోగించుకోవడం వల్ల విశేషమైన ప్రాచుర్యం పొందుతాయి. ఇది రిచర్డ్ డాకిన్స్ ప్రతిపాదించిన విప్లవాత్మకమైన ఆలోచన. దాన్ని గురించి తెలుసుకోవాలంటే, The Selfish Meme , అన్న పుస్తకం చదవండి. అలాగే ఇప్పటి కాలంలో పశ్చిమ దేశాల సంస్కృతికి ఏదో విషయంలో పైచేయి ఉండి ఉంటుంది. భవిష్యత్‌లో మనకు ఆ అవకాశం వస్తుందేమో, చూడాలి. ఇవేవీ అర్థం చేసుకోకుండా, గుడ్డిగా నా దేశం, నా ప్రజలు మారిపోతున్నారో దేవుడో, అని ఏడవడం హాస్యాస్పదం. అసలు వీళ్ళ బాధ, దేశ విదేశాలు తిరిగి వచ్చిన తాము భిన్నంగా ఉండే అవకాశం కోల్పోయారన్న ఆవేదనేమో అన్న చిన్న అనుమానం నాకు.

మరో పెద్ద మనిషి తను చిన్నప్పుడు పెరిగిన సమాజమూ, పద్దతులూ, ఆచారాలు ఇప్పుడు దర్భణం వేసి వెతికినా కానరావని అప్పుడప్పుడూ చెప్పుకొంటుంటాడు. నాకు చర్రున కోపం వస్తుంది ఇలాంటి వాదన విన్నప్పుడల్లా. యాభై సంవత్సరాల క్రితం, మనం గర్వించ దగ్గ విషయాలు చాలా ఉండి ఉంటాయన్నది అనుమానాస్పదం. యాభై సంవత్సరాల క్రితం, ఆలోచనా స్వాతంత్రం, భావ స్వాతంత్రం లేని రోజులవి (చలం పుస్తకాలు అందుకే నాకు అంత ముఖ్యం). ఆడవాళ్ళకి ఆర్థిక స్వాతంత్రం లేని రోజులవి, అస్పృశ్యత అంటురోగంలా వ్యాపించిన రోజులవి. మనం సిగ్గు పడాల్సినంతగా వెనుకబడి ఉన్న రోజులు. ఆయన్ని అడిగితే ఆరోజుల గురించి, వాటి ప్రాముఖ్యత గురించి మీకు పెద్ద వ్యాసమే రాసి ఇస్తాడు. కాని అది ఆయన దృక్కోణంలోంచి చూసిన వారికే అర్థమౌతుంది.

ఇంతా చదివి, గతానురక్తితో జీవించే వాళ్ళమీద నాకు చిన్న చూపు అనుకోకండి. ఎందుకంటే, వాళ్ళలో నేనూ ఒకదాన్నే కదా. దాన్ని సరిగ్గా అర్థం చేసుకోలేక, మన అవసరాలకి అనువదించుకోలేక, మరెవరినో నిందించే వాళ్ళంటేనే నాకు చిన్నచూపు. నిజం చెప్పాలంటే నాకు ఈ భావాలు, వాటి వెనుక దాగిన ఆవేశాలు, అనుబంధాలు అర్థం చేసుకోవాలన్న గాఢమైన కోరిక. అందుకని, నన్ను, నా ఆలోచల్ని ఒక్కోసారి విడమర్చి అర్థంచేసుకోడానికి ప్రయత్నిస్తుంటాను. డబ్బు కోసం, మెరుగైన జీవితం కోసం కావలిసిన వాళ్ళనొదులుకొని ఇన్ని వేళ మైళ్ళ దూరాన ఉన్న నాకొక ఉపశమనం, నా దేశపు జ్ఞాపకాలు. శెలవు దొరికినప్పుడు చూడ్డానికి వెళ్ళినప్పుడు, మనుషుల్లోనూ, ప్రదేశాల్లోనూ నా జ్ఞాపకాలు, గత స్మృతులు వెదుక్కోడానికి ప్రయత్నిస్తాను. నాక్కావాలిసిన మనుషులు, తెలిసిన ప్రదేశాలు అకస్మాత్తుగా మారిపోయినప్పుడు నాకు చాలా బాధగా అనిపిస్తుంది. తీరిగ్గా ఆలోచిస్తే, అది నాకు మాత్రమే సంబంధించిన సమస్య. అక్కడ ఉన్న వాళ్ళ జీవితాలు నేను జీవించి చూడడం లేదు కదా, వాళ్ళ దృక్పథం ఏమిటో అర్థం చేసుకోవడానికి. నాలాగే గతస్మృతుల్లో ఉపశమనం వెతుక్కొనే అందరికీ ఈ సమస్య ఎదురయ్యే ఉంటుంది. కానీ మనకోసం మార్పు ఆగదు కదా. మనకన్నా, ఈ మార్పులకనుకూలంగా జీవితాలని మలుచుకోవలసిన వాళ్ళ గురించి ఓసారి తలచుకొని,

వాళ్ళకీ , మార్పుకీ ఒక అవకాశం ఇద్దాం. *మనకి అనుకూలంగా బ్రతకనంత మాత్రాన, మనవాళ్ళు మనకు కాకుండా పోతారా? అయినా జరిగేది చెడ్డకేనన్న గాఢ నమ్మకమెందుకు మనకి? అనుభవించకుండా ముందుగానే నిర్ణయించడం అంత తెలివైన లక్షణమా?*

చివరకు ఆలోచనలతో కూడిన గతానురక్తి అన్నది అంత ప్రమాదకరమైనది కాదు అన్న వాఖ్యంతో ముగిస్తాను. ఉదాహరణకి, చిన్నప్పుడు చెట్టెక్కి పక్కవాళ్ళింటి నారింజ కాయలు కోసిన ఆనందం, మావి తోపులో మొదటిసారి కోకిల పాట విన్నప్పటి పరవశం, వెన్నెల పరవళ్ళలో తేలివచ్చే మొదటి ప్రేమ జ్ఞాపకం, ఇవన్నీ మనకు సంబంధిచిన వ్యక్తిగతమైన గతానుభవాలు. వాటిని ప్రేమించినా, ద్వేషించినా, దూషించినా అవి మనకు మాత్రమే పరిమితం. ఇంటికప్పు పాడు చేస్తుందని నారింజ చెట్టు నరికి వేసిన పక్కింటి వాళ్ళని, మరిక పాడలేని కోకిలని, మన అవసరాలని ఖాతరు చేయలేదని నిందించగలమా? మనకున్న జ్ఞాపకాలు చాలనుకొని సంతృప్తి పడడం నేర్చుకొన్నాం కదా. సరే మరి, ఎవరూ చూడని క్షణాల్లో ఓ చిరునవ్వు పెదాలపై వెలిగించే ఈ జ్ఞాపకాల్ని పదిలంగా దాచుకొందాం, పదండి.

# మరో కోణం లోంచి చూస్తే

నాకు సాధారణంగా సభలు, సంఘాలు, వాటి సమావేశాలు మొదలైనవి పెద్దగా ఆసక్తికరంగా అనిపించవు. వీటన్నింటి వెనుకా ఏదో రహస్య ఉద్దేశ్యం ఉంటుందని నాకు అనుమానం. అలాంటిది దాదాపు రెండు సంవత్సరాల క్రితం ఏదో కొత్త సంఘం, తెలుగు సాహితి, సంస్కృతి ప్రధానంగా ఒక కార్యక్రమం జరుపుతున్నారని ఎవరో చెప్పగా , ఆ కార్యక్రమం ముందు రోజు ఏర్పాట్లలో సహాయం చేద్దామని వెళ్ళాను. ఆడిటోరియంలో అడుగుపెట్టగానే మొట్టమొదటిగా నాకు తోచిన విషయమేమిటంటే, అక్కడున్న ఆడవాళ్ళందరూ కిచెన్‌లో కూరలు కోస్తున్నారు, మగవాళ్ళు వేదికను రంగు కాగితాలు, పూలతో అలంకరిస్తున్నారు. ఒక్కసారిగా మనసు చివుక్కుమంది నాకు. ఇంతదూరం వచ్చి, ఈ కాలంలో కూడా మనకు ఆడవాళ్ళు ఒక చోట, మగవాళ్ళు మరో చోట ఉండాల్సినంత అవసరం ఏం వచ్చింది? నా స్వభావం తరహా, నేను వెళ్ళి రంగు కాగితాలు అంటించాలని నిర్ణయించుకొన్నాను (గమనిక: నేనలా చేసింది కూరలు కోయడం ఇష్టం లేక కాదు. వంట చేయడం నాకు చాలా నచ్చిన పనుల్లో ఒకటి. అందరిలో ఒకరిగా ఉండడం ఇష్టంలేక. మా అమ్మమ్మ నా గురించి చిన్నప్పుడెప్పుడూ అంటూ ఉండేది, "ఊరందరిదీ ఒకదారైతే, ఉలిపికట్టెది మరో దారి" అని, దానిలో కొంత నిజమూ లేకపోలేదు). అక్కడున్న ఇద్దరి ముగ్గురికి, నేను కాగితాలకీ, పువ్వులకి పిన్నులు గుచ్చి ఇస్తూ సహాయం చేస్తున్నాను, కొద్ది నిముషాల తర్వాత వాళ్ళలో ఒకతను చాలా అసహనంగా ఏదో ఇమ్మని అడిగాడు. అతని మొహంలోను, గొంతులోనూ 'నువ్వెందుకటా ఇక్కడ, లోపల కూరలు కోయొచ్చు

గదా` అన్న అభిప్రాయం చాలా స్పష్టంగా వినపడింది. నేను అతని వంక ఓ సారి తృణప్రాయంగా చూసి, తిరిగి జవాబు కూడా ఇవ్వక నాపని నేను చేసుకొంటూ పోయాను. అలాంటి వారికి జవాబు ఇవ్వడం వాళ్ళ ఉనికిని గమనించడం, అలాంటి అవకాశం అతనికి ఇవ్వదలుచుకోలేదు నేను.

మరోసారి, మరో అతను. అంతవరకూ అతని అభిప్రాయాలు, స్వభావమూ నాకు బాగా నచ్చిన మనిషి. ఏదో మాటల మధ్యలో వాళ్ళావిడ ఇండియా వెళ్ళిందని చెపుతూ, తను వెళ్ళిందగ్గర నుండీ, ఎవరో ఒకరు స్నేహితులింట్లో తింటున్నానని చెప్పాడు. ఏం, నీకు వండుకోవటం రాదా అనడిగాను. దానికతను నన్నో వెర్రిదాన్ని చూసినట్టుగా చూసి, అసలు తన జీవితకాలం మొత్తంలో వంటింట్లో అడుగు కూడా పెట్టలేదని చెప్పాడు. అలాంటి మాటలు విన్నప్పుడు, ఠక్కున నాకో ఆలోచన వస్తుంది. వీళ్ళందరిని నాగరికతకు దూరంగా తీసుకెళ్ళి వదిలేస్తే ఏమౌతుందో? అప్పుడు కూడా వాళ్ళావిడ వచ్చి పెడుతుందని పొట్టమాడుతూ ఉంటారా? అసలు వీళ్ళ భార్యల తప్పు సగం ఉందని నాకు సంశయం. వంటచేయడం ఏదో మర్యాదలేని పని అని వాళ్ళని అనుకోనివ్వడం. పొద్దున్నే లేచినప్పుడు కాఫీ పెట్టిన లేక ఆఫీసు నుండి త్వరగా వచ్చి డిన్నర్ తయారు చేసిన మగవాడిలో నాకు నిజమైన ప్రేమ, కోరిక, ఆప్యాయత కనపడుతుంది. అలాంటి వాడిని ఆరాధించినా, లాలించినా దానికి ఒక అర్థం ఉంది, అతను దానికి అర్హత సంపాదించుకొన్నాడు.

మొన్నామధ్య ఎవరితోనో వరకట్నం గురించి మాట్లాడదామంటే, అసలా సమస్య ఇప్పుడెక్కడుంది అన్నాడో స్నేహితుడు. ఒక్క క్షణం నేను ఖంగుతిన్నాను. అతను నిజంగానే ఈ సమస్య లేదని నమ్ముతున్నాడా లేక నిప్పుకోడి గనుక తన తల ఇసుకలో దాచి ప్రమాదమేమీ లేదని అనుకున్నట్లుగా తను కూడా అసలా సమస్యే లేదని నమ్మడానికి ఇష్టపడుతున్నాడా? నాకు తెలిసిన వాళ్ళు, బంధువులూ, నాతో పనిచేసే వాళ్ళు ఎవరెంత కట్నం తీసుకొన్నది, ఆ కట్నం ఇవ్వడం కోసం అమ్మాయిల తల్లిదండ్రులెంత కష్టపడిందీ నాకు తెలుసు.

ఒక స్నేహితురాలి కొడుకు అమ్మాయిలు పోలీసు ఉద్యోగం చేయలేరు అన్నాడు. మరో స్నేహితుడి కూతురు అమ్మాయిలు జుట్టు కత్తిరించుకోరు, చిన్న జుట్టు, ప్యాంట్లు అబ్బాయిలు మాత్రమే వేసుకుంటారు అంది. నేనిద్దరినీ అడిగాను, వాళ్ళెందుకలా అనుకుంటున్నారా అని, వాళ్ళు ఇదీ అని జవాబు ఇవ్వలేకపోయారు. అయితే ఎవరైనా వాళ్ళకి అలా అని చెప్పి ఉండాలి లేక వాళ్ళ చుట్టూ పరిస్తిత్థులని గమనించి వాళ్ళు ఆ అభిప్రాయం ఏర్పరుచుకొనైనా ఉండాలి.

నేనేదో ఇలా ఆడవాళ్ళ తరఫున గొంతుచించుకొని అరుస్తున్నానని అనుకోవద్దు. మాకేదో అన్యాయం జరిగిపోతుందో అని అరిచే వాళ్ళ కన్నా, తన హక్కులు తను తెలుసుకొని బ్రతికే ఆడవాళ్ళంటే నాకు మరింత గౌరవం. పైగా నాకు ముందు చెప్పినట్లుగా అవసరంలేని ఉద్యమాల కన్నా, జ్ఞానంతో ప్రజలు ఎన్నుకున్న నిర్ణయాలే ముఖ్యం. అసలు ఇరవై ఒకటో శతాబ్దంలో ఇంకా ఆడవాళ్ళ, మగవాళ్ళా మధ్య తేడాల గురించి ఇంకా మాట్లాడుతున్నామంటే మానవాళికే సిగ్గుచేటు. కానీ ఉన్న నిజాన్ని కాదనలేం కదా. ఈ సమస్యని అర్థం చేసుకోలేకపోవడంలో మనందరికి, మనందరీ అజ్ఞానానికి పాత్ర ఉంది. మనం శారీరకంగా, మానసికంగా సహజ శరీర నిర్మాణ మూలంగా వేరే కానీ రెంటిలో ఏ ఒక్కటీ ఉన్నతమైనది అని ఎవరూ నిర్ధరించలేదు. మన మధ్య ఎందుకీ అనవసరమైన బేధాలు, విభేదాలు, వాదనలు అన్నదే నా చిన్న ప్రశ్న.

అసలు ఆడవాళ్ళ, మగవాళ్ళ బాధ్యతలేమిటి? నాగరికతతో పాటూ, అవి కూడా మారుతూ ఉంటాయి (ఉండాలి) కదా? వేట, వ్యవసాయం, సమాజ పరిరక్షణ ప్రధానంగా బ్రతికిన రోజుల్లో సహజంగానే ధారుడ్యం గల

పురుషులకి ఇంటి బయట పాత్ర ఉండడం ఆశ్చర్యకరమేమీ కాదు. కానీ సమానమైన బాధ్యతలు పంచుకుంటున్న మన జీవితాల్లో ఇంకా ఆ రోజులనాటి ఆలోచనలు ఉండడం హాస్యాస్పదం. దీన్ని అర్థంచేసుకోవాలంటే అసలు పరిణామ క్రమంలో మన బాధ్యతలేమిటి అన్నది అర్థం చేసుకోవాలి.

ఏ జీవితానికైనా (జంతువు, మనిషి, పక్షి లేదా సూక్ష్మజీవి) ఉన్న ఒకేఒక ఆశయం, తన సంతానం ద్వారా తన జీన్స్ తర్వాత తరానికి అందజేయడం. దీనిలో భాగంగా మనలో కొన్ని జీవులు, రెండు రకాల లింగ బేధాలు ఏర్పరుచుకొన్నాయి. (పుట్టగొడుగుల్లో 36,000 రకాల లింగాలున్నాయని మీకు తెలుసా? http://news.bbc.co.uk/1/hi/sci/tech/specials/sheffield_99/447058.stm . వాటిలో సంతానానికి జన్మనివ్వడం, లాలించడం ఆడజాతికి చెందిన ముఖ్యమైన లక్షణం. అందుకే ఆరోగ్యకరమైన ఆడజంతువుని ఆకర్షించడం అన్ని జాతుల్లోనూ అంత ముఖ్యమైన విషయం. అందుకే మగ నెమలి అంత అందంగా ఉంటుంది. ఇదే విషయం డార్విన్ తన **sexual selection theory** ప్రతిపాదించిందాకా అతనికి నిద్రను కూడా దూరం చేసింది. కానీ ఇది మనిషి దగ్గరికి, మరీ ముఖ్యంగా నాగరిక సమాజపు మనిషి దగ్గరికి వచ్చే సరికి మారుతుంది. మనం వేటతో మన జీవితం ప్రారంభించాం, క్రమేణా వ్యవసాయంలోకి మారాం, దానితో ధనం, ఆస్తి అన్న విషయాలకి ఉనికి వచ్చింది. కాలంతో పాటుగా సమాజాల్లో జనాభా సంఖ్య పెరిగింది. ప్రత్యుత్పత్తి, సంతానాన్ని పెంచడం సులభతరమైంది. ఈ సమయంలో వంశ క్రమం కాపాడ్డానికి ఆస్తులు పంచుకోవడం చాలా ప్రాధాన్యతని సంతరించుకొంది. ఈ పరిరక్షణకి మరో అత్యవసరమైన విషయం, తన పిల్లల్ని మాత్రమే పెంచగల మరో మనిషి. కానీ ఇలాంటి కీలకమైన, క్లిష్టమైన బంధాన్ని సాగించడానికి కొన్ని నియమాలు, నిబంధనలూ అవసరమయ్యాయి. అవే మనకు తెలిసిన పెళ్ళిగా మారాయి(For More information, read the book: Marriage, a History). అదీ మన బంధాల వెనుక ఉన్న మూల కారణం.

అక్కడనుండి అసలీ సమస్య లోకి ఎలా వచ్చి పడ్డాం? మానవజాతి పురోగతికి ఇద్దరూ చాలా అవసరమైన వాళ్ళమే కదా! మరెందుకీ వ్యత్యాసం?


ఒకానొక సమయంలో మగవారు తమ కుటుంబాల స్థిరత్వం గురించి ఏమైనా ఆందోళన పడ్డారా? దాని మూలంగా ఆడవాళ్ళని నియంత్రించడం మొదలుపెట్టారా?

అది ఇప్పటికీ నిజమే అనిపిస్తుంది నాకు. నిజంగా తనమీద తనకి నమ్మకమున్న మనిషికి తను మరెవరికన్నా ముఖ్యం అని అనుకోవలసిన అవసరం రాదు.

లేక ఆడవాళ్ళు తమ పోషణకి, రక్షణకీ ఇలాంటి ప్రతిపాదన అంగీకరించారా?


ఇదే విషయమే కాక , మరో ఏ సమస్య తీసుకున్నా, ఉదాహరణకి: పశ్చిమ దేశాల్లో రేస్ విషయం కానీ, మన దేశంలో కులం విషయమే కానివ్వండి, ఒక మతం మరో మతంతో పోల్చుకోవడమే కానివ్వండి, లేక మరో దేశంలో ధనిక, పేద బేధం కానివ్వండి, మనిషికి తను మరొకరికన్నా ఉన్నతమైన వాడిని(దానిని) అన్న భావం ఎందుకు కలుగుతుంది?


దీనికి, మన మతానికి సంబంధించిన నమ్మకాలకి ఏమైనా సంబంధం ఉందా? అలా అని నేనెందుకంటున్నానంటే, సైన్స్ ఇన్ని విషయాలు వివరించి చెప్పినా, మనలో చాలామంది ఇంకా మనల్ని ఎవరో మహాశక్తి ఇక్కడ ప్రత్యేకంగా భూమిమీద మాత్రమే సృష్టించి, మన ఆలనా పాలనా చూసుకుంటుందని నమ్ముతున్నాం. ఇంతటి విశాలమైన విశ్వంలో, ప్రమాదవ శాత్తూ మాత్రమే సంభవించిన సూక్ష్మజీవి నుండి ఉద్భవించాం అని






అంగీకరించలేకపోతున్నామేం? మనకో ప్రత్యేకమైన ఆశయం ఉంది అని అనుకోవడం మన పరిణామ క్రమానికి చాలా అవసరమైన విషయమా?

మన జీవితం, మన ఉనికి, మన గ్రహం, చివరకి మన సూర్య మండలం మిగిలిన విశ్వంతో పోల్చుకొంటే ఎంత అల్పమైనదో తెలుసుకొంటే, దానికి మనం ఆపాదించే ప్రాముఖ్యత ఎంత అనవసరమో మనకు అర్థమౌతుంది. క్రింద జతపరిచిన కొన్ని చిత్రాలు మీకు ఇందుకు పనికొస్తాయని ఆశిస్తాను. ఒకసారి మన అహంకారం నశించాక, తీరిగ్గా కూచుని ఆలోచిస్తే, మనకు ఈ సమస్యనెలా పరిష్కరించాలో అవగతమౌతుంది. ఆ ఆలోచనలో భాగంగా, మనందరం ఇక్కడ ఉండడానికి, మనందరి మధ్యా ఉన్న తేడాలకి మూల కారణం నీరు, గాలి, కాంతి సహాయంతో ఉనికిలోకి వచ్చిన మొట్టమొదటి ఆ జీవకణం అని అంగీకరించగలగడంలో సగం సమాధానం ఉంది.



# నిజమా? అంటే ఏమిటి?

మీలో కొంతమంది Flatland అన్న పుస్తకం చదివి ఉంటారు. ఆ కథలో ముఖ్య పాత్రధారి సమాంతర ప్రపంచంలో (AAA world with only two dimensions) నివసించే ఓ చతురస్రం. ఆ ప్రపంచంలో ఉండే మిగతా జీవులతో పాటూ తనకు తెలిసిన ప్రమాణాలు రెండు. కానీ ఓ రోజు దానికో కల వస్తుంది, ఆ కలలో తను మరో లోకం, రేఖా ప్రపంచంలోకి వెళుతుంది. అక్కడ ఉన్న జీవులతో మాట్లాడుతూ తెలుసుకున్న విషయమేమిటంటే రేఖా ప్రపంచంలో ఒకే ప్రమాణం (dimension) ఉందని. అది విని మన చతురస్రం అక్కడి జీవుల అజ్ఞానానికి చాలా బాధ పడిపోయి, వాళ్ళ ఆలోచనా విధానాన్ని మార్చడానికి ప్రయత్నిస్తుంది. కానీ అది ఎంత కష్టమైన విషయమో తనకై తను అనుభవించిందాకా తెలీదు. తన సమాంతర ప్రపంచంలోకి ఒక గోళాకారం వచ్చి మరో మూడో ప్రమాణం ఉంది అని చెప్ప చూసినప్పుడు అర్థమౌతుంది, మన భౌతిక నియమాలను ఉల్లంఘించి ఆలోచించ గలగడం దాదాపూ అసంభవం అని. తన బోధనలో భాగంగా గోళాకారం, చతురస్రాన్ని బిందు ప్రపంచానికి పరిచయం చేస్తుంది. అందులో ఉన్న ఒకే ఒక్క జీవి ఓ బిందువు, దానికి అర్థమైన నియమాల ప్రకారం తను మాత్రమే ఈ విశ్వం మొత్తంలో నివసిస్తుంది, తను తప్ప మరెవరూ, మరే విషయమూ తనకు తెలీదు (ఎందుకంటే తెలుసుకొనే అవకాశమే దానికి లేదు కనుక). చతురస్రం, గోళాకారం దానితో మాట్లాడబోతే, బిందువు ఆ మాటలు తన స్వగతంలో ఉదయించిన ఆలోచనలు కాబోలనుకుంటుంది. ఆ పుస్తకం మొత్తం చాలా తమాషాగా మరియూ విజ్ఞానదాయకంగా ఉంటుంది. ముఖ్యంగా కంప్యూటర్ ఇంజినీరింగ్ లేదా థియరెటికల్ ఫిజిక్స్ చదివే వాళ్ళకి చాలా ఉపయోగకరంగా ఉంటుంది.

అసలీ పుస్తకం గురించి నాకెందుకు గుర్తు వచ్చిందంటే, మొన్నొక రోజున నా స్నేహితుడితో మాట్లాడుతూ ఉంటే అసలు 'సత్యం లేక నిజం' అన్న మాటకు అర్థం ఏమిటి, దానిని ఎలా నిరూపించగలం అన్న విషయం వచ్చింది. దాన్ని గురించి మరింత ఆలోచిస్తుంటే అసలు నిరూపించడానికి మనకో విషయం ప్రామాణికంగా, ఖచ్చితంగా నిజమని తెలిసి ఉండాలి కదా, మరి దాని మాటేమిటి అన్న ప్రశ్న వస్తుంది. అదే ఈ పుస్తకం గురించి ఆలోచించడానికి దారి తీసింది. మనకంటూ తెలిసిన నిజం మన చుట్టూ ఉన్న ప్రపంచాన్ని బట్టి, దాన్ని నియంత్రించే నియమాల్ని బట్టి మారుతుంది. కానీ మనకు తెలిసిన, మనం అర్థం చేసుకోగల విషయాలు మాత్రమే విశ్వం మొత్తాన్ని నియంత్రిస్తాయనుకోవడం పొరపాటా? ఈఅంశాన్ని ఆధారంగా చేసుకొని, కర్ట్ గోడెల్ ప్రతిపాదించిన సూత్రం ఆ విషయాల్ని మరింత క్లిష్టతరం చేస్తుంది. మీ అందరి అవగాహన కోసమై అతని రెండు సూత్రాలని ఇక్కడ రాస్తాను:

1. For any consistent formal, computably enumerable theory that proves basic arithmetical truths, an arithmetical statement that is true, but not provable in the theory, can be constructed. That is, any effectively generated theory capable of expressing elementary arithmetic cannot be both consistent and complete.
2. For any formal recursively enumerable (i.e. effectively generated) theory T including basic arithmetical truths and also certain truths about formal provability, T includes a statement of its own consistency if and only if T is inconsistent.

మనకి తెలిసిన భాషలో చెప్పాలంటే, మనం ఊహించుకోగల ఎలాంటివైన తర్క సంబంధిత నియమాలు కూడిన శాస్త్రం నిజమూ మరియూ సంపూర్ణం కాజాలదు (నా తెలుగు భాషా పరిజ్ఞానానికి అభ్యంతరం చెప్పదలుచుకొన్న వాళ్ళకో చిన్న మనవి. ఈ సారి ఇండియా వెళ్ళినప్పుడు ఇంగ్లీషు-తెలుగు డిక్షనరీ మరియూ ఆంధ్ర

శబ్ద రత్నాకరం తెచ్చుకుంటాను. ఓపిక వహించండి).

**వెరసి నిజం అన్న మాటకు అర్థం లేదూ, చెప్పలేము, నిరూపించనూలేము అంటాడు. Truth in itself is self-refuting.**

సరే ఇలాగ కాదూ, ఈ సమస్యని అసలు మొట్టమొదటి నుండి పరిష్కరించాలని నిర్ణయించుకొన్నా. సైన్స్‌లోని అన్ని విభాగాలు సత్య నిరూపణకు గణిత శాస్త్ర నియమాల్ని ఆశ్రయిస్తాయి. మరి అక్కడనుండి మొదలెడదాం అనుకొంటే, గణిత శాస్త్రం ఈ ప్రశ్నను చాలా తృణప్రాయంగా చూస్తుంది. గణిత శాస్త్రవేత్తలు అసలు నిజం అంటే ఏమిటి అన్న ప్రశ్నతో తమకు సంబంధం లేదంటారు. గణిత శాస్త్రం దాని స్వభావం మూలకంగానే నిజమౌతుంది అని వాదిస్తారు. ఉదాహరణకి: 1+1 = 2 అన్నది నిజం, కానీ ఒకటికి ఒకటి కలిపితే మూడెందుకు కాకూడదు అన్న ప్రశ్నకి గణితంలో స్థానం లేదు.

మరి గణితం కన్నా వెనక్కి వెళితే? అదే తర్క శాస్త్రం (logic), మన ఆలోచనల్ని , మన భాషని, వ్యక్త పరిచే బావాల్ని అర్థం చేసుకోవడానికి ప్రయత్నించే శాస్త్రం. సత్యం గురించి టార్స్కి ఏం చెప్పాడంటే: "ఒక సంయుక్త సంస్థలో మూలకాలన్నింటికీ ఒక ప్రతిపాదన కొన్ని నియమాలని అనుసరించి నిలబడగలగడమే సత్యం" . ఇది ఇంకా కొత్తదైన, పరిమితమైన ప్రతిపాదన మాత్రమే. ఇదీ మనకు ఇదమిద్దంగా నిజమేమిటన్నది తేల్చి చెప్పదు.

మరి తర్కశాస్త్రం దాటి ముందుకి వెళితే వచ్చేది? వేదాంతం. మరి ఈ ప్రశ్న అసలు ఇక్కడ చెందుతుందన్న మాట. మనలో మాట: సైన్స్‌కి అందని, అంతుబట్టని సమస్యలు వేదాంతానికి చెందుతాయి, కొన్నిసార్లు ఈ ప్రశ్నలు అక్కడే ఉదయిస్తాయి, నెమ్మదిగా మిగిలిన విభాగాల్లోకి ప్రయాణిస్తాయి. మరి మనకు తెలిసిన కొంతమంది వేదాంతులేమన్నారో చూద్దామా?

"పరమాత్మ మాత్రమే సత్యం" - ఆది శంకరాచార్య

"కోరికే మనిషి దు:ఖానికి మూల కారణం అన్నది మాత్రమే నిజం" - గౌతమ బుద్ధ

"సత్యమే దైవం" - మహాత్మా గాంధి (ఆయన జీవిత చరిత్రలో రాస్తాడు. మొదట దైవమే సత్యం అన్న విశ్వాసం, క్రమేణా ఈ రూపు దాల్చింది అని)

"సత్యం ఓ మార్గంలేని మైదానం" - జిడ్డు క్రిష్ణమూర్తి
"Truth is Subjectivity" - Søren Kierkegaard
"Truth is optimal" - Fromm
"Truth is something that shifts through various episteme throughout history" - Foucault
"Truth is aletheia meaning 'disclosedness' " - Heidegger

నిజమేంటని నా రోల్ మోడల్ రంగనాయకమ్మగారినడిగితే "నిజం అన్నది పచ్చి అబద్దం" అంటారేమో. మరి ఇంతటి క్లిష్టతరమైన ప్రశ్నను మనం దైనందిక జీవితంలో ఎంత సులభంగా అంగీకరిస్తాం అన్నది నాకు చాలా ఆశ్చర్యకరమైన విషయం.

మనకు తెలిసిన విషయాల్ని చాలా ధీమాగా, మరిక దానికి తిరుగులేదు అన్నట్లుగా చెపుతాం. మనకా నమ్మకానికి పునాదులేంటి?

మరో మనిషి అంతే ధీమాగా చెప్పిన మాటల్నీ అలాగే నమ్ముతాం, అసలా వ్యక్తిపైన మనకెందుకీ గౌరవం?

అసలు నిజమన్నదానికి అర్థమే లేనప్పుడూ, మనందరి నిజాలు వేర్వేరైనప్పుడు, మన సొంత నిజాల కోసం

చావడానికైనా ఎందుకు సిద్ధపడతాం?

ఒక్కోసారి నిజాన్ని దాచేసి నమ్మకంగా అబద్దాలు చెప్పి మరో దేశంపై దాడి చేసే నాయకుల్ని మరోసారి ఓటు వేసి మరీ గెలిపిస్తాం. దాని వెనుక ఉన్న అసంబద్ధతకి కారణం?

మరికొన్ని సార్లు నిజానికి బదులు అబద్ధాన్ని నమ్ముకొని అందంగా, ఆనందంగా బ్రతికేస్తుంటాం, దీనికేం సమాధానం చెపుతాం?

మనకింత వరకూ తెలిసిన నాలుగు ప్రమాణాలు కాక మరో ఆరో, ఏడో ఉన్నాయని ప్రతిపాదించిన విజ్ఞాన శాస్త్రపు సిద్ధాంత ప్రపంచంలో మనం మనగలమంటారా?

ఈ ప్రశ్నలన్నింటికీ సమాధానాల కోసం అందరం కలిసి వెదుకుదాం. ఒక్కోసారి ఇలాంటి ఎందుకూ కొరగాని (నిజమే కదా, ఎవరో అన్నట్లుగా ఇలాంటి ప్రశ్నలు తిండి, గుడ్డా ఇవ్వవు కదా, దీని బదులు సత్యం = 1; అసత్యం = 0; అని ఒక కంప్యూటర్ ప్రోగ్రాం రాసుకొని ఉండాల్సింది :) ) పశ్నలడిగినప్పుడే మనకన్నీ తెలుసని విర్రవీగే మన గర్వం మీద కాసిని నీళ్ళుచల్లి మన బుర్ర సరిగా పనిచేస్తుంది. శీర్షిక మొదటిలో చెప్పిన చతురస్రం స్థానంలో మనల్ని ఊహించుకొందాం. రేపెవరైనా గ్రహాంతర వాసులు తారసబడి మన ఫిజిక్స్ నాలెడ్జిని తారుమారు చేసే విషయాలు చెప్పారనుకోండి, అంగీకరించడానికి సిద్ధంగా ఉండాలి కదా. చివరగా ఒక చిన్న కొసమెరుపు ప్రశ్నతో ముగిస్తా. మన భూమ్మీద ఉన్న ఇసుక రేణువలన్నీ లెక్కిస్తే వచ్చే అంకె కన్నా, మన విశ్వంలో ఉన్న నక్షత్రాల సంఖ్య పెద్దదని తెలుసా మీకు? మన విశ్వం ఎంత పెద్దదీ, దానిలో ఎన్ని నక్షత్రాలు, మరెన్ని గ్రహ మండలాలు ఉన్నాయి అన్నది మన ఊహకందని విషయం. ఈ విషయం అంగీకరించాక, మనకు తెలిసిన, మన చుట్టూ మనం నిర్మించుకున్న బిందు ప్రపంచమెంత హాస్యాస్పదమో మీకర్థమౌతుందా?

***

# స్వయంకృతం

పోయిన వారం ఒక బిజినెస్ మీటింగ్‌లో అభివృద్ధి చెందుతున్న దేశాల్లో టెక్నాలజీ అమ్మకాలకి ఎన్ని అవకాశాలు ఉన్నాయి అన్న అంశం మీద చిన్న చర్చ జరిగింది. ఈ విషయం ప్రతిపాదించగానే ఆ గదిలో ఉన్న నా సహోద్యోగి ఒకడు వెటకారంగా ఇలా అన్నాడు. "మరి వీళ్ళు తమ ధనం నిత్యావసరాలకి కాక టెక్నాలజీ కోసం వినియోగిస్తారనమాట" ఈ మాట మనలో చాలా మందికి మొదటిసారి విన్నప్పుడు సబబుగానే తోచవచ్చు. కానీ ఒకసారి కొంచం లోతుగా ఆలోచిస్తే దీని వెనుక ఉన్న ఉద్దేశ్యం అర్థమౌతుంది. మొదటిగా అతను మరో మనిషి తన డబ్బు ఎలా కర్చు చేయాలన్నది తను నిర్ణయిస్తున్నాడు. రెండోది అభివృద్ధి చెందుతున్న దేశాల్లోని ప్రజలు టెక్నాలజీని ఎంత తెలివిగా వినియోగించుకొంటున్నారన్న విషయం ఇతనికి మచ్చుకైనా అర్థం కాలేదు. బహుశా అతని దృష్టిలో ఈ ప్రతిపాదన పెద్ద కంపెనీలు తమ వినియోగదారీ మనస్తత్వాన్ని ఇతర దేశాలకూ అనువదింపచేసే పథకంలో భాగంగా అనిపించి ఉండవచ్చేమో.

నా స్నేహితుల్లో కొంతమంది ఆలోచనా విధానంతో నాకు వచ్చిన సమస్యే ఇది. ప్రపంచంలో ఉన్న సమస్యలన్నింటికీ వీళ్ళ దృష్టిలో పెద్ద కంపెనీలే కారణం. దానిని నిరూపించడానికి వీళ్ళు దిక్కుమాలిన రిపోర్ట్‌లన్నీ చదివి నా బుర్ర తింటూ ఉంటారు. అలా అని ఈ సమస్యని పరిష్కరించడానికి వీళ్ళేమైనా చేస్తున్నారా అంటే, వీళ్ళే వెళ్ళి హోల్ ఫుడ్స్ లో షాపింగ్ చేసి , పీట్స్ కాఫీ లాంటివి తాగేసి హిపోక్రటిక్ మాటలు మాత్రం చెపుతూ ఉంటారు. ఒక సంస్కృతి గురించి అర్థమైనా చేసుకోవడానికి ప్రయత్నించక తాము పుస్తకాల ద్వారా సంపాదించిన విజ్ఞానంతో గంటలు గంటలు సుత్తి కొడుతుంటారు. ఇలాంటి వాళ్ళ ద్వారానే నేను మన బొట్టు సాంప్రదాయం గురించి రక రకాల నవ్వదగ్గ కథలు విన్నాను. చాలా మందికి అసలు మన బొట్టు వెనకాల ఉన్న సాంస్కృతిక ప్రాధాన్యత గురించే తెలీదు. భ్రూమధ్యంలో కేంద్రీకరించబడ్డ శక్తిని కాపాడ్డానికే బొట్టు అని చెపితే నోరు తెరుచుకొని వింటారు. ఇలాగే ఇతనికీ ఓ చిన్న పాఠం చెపుదామని అనిపించింది.  నాకు సాధ్యమైనంత నెమ్మదిగా ఓపిగ్గా చెప్పాను. ఇండియాలో పట్టణాల్లో ఇంట్లో పనికి వచ్చే మనుషులు, లాండ్రీ వాళ్ళూ సెల్‌ఫోను ద్వారా తమ పని ఎలా ఆర్గనైజ్ చేసుకొని సమయం, డబ్బు ఎలా ఆదా చేసుకో గలుగుతున్నారో చెప్పి, రైతులు వివిధ ప్రాంతాల్లో ధరలు ఎలా ఉన్నాయో నిముషాల మీద ఎలా కనుక్కోగలగుతున్నారో చెప్పి ఓ మాటన్నాను. "కొంచెం కర్చుతో కూడినదైనా జీవితం సులభతరం చేయగల శక్తి టెక్నాలజీకి  ఉంది. ఒక్క విషయం గుర్తు పెట్టుకో. మనిషి నిత్యావసరాలకి ప్రతిస్పందించడానికి అనుకూలంగా మలచబడ్డాడు. నీలాంటి వాళ్ళు చెపితేకానీ వాళ్ళకి అర్థం అవదు అనుకోకు. అంతేకాక నీ డబ్బు నీకిష్టమైనట్లు ఎలా కర్చు పెట్టుకొంటావో అంతే స్వాతంత్రం అభివృద్ది చెందే దేశాల్లో నివశించే వాళ్ళకీ ఉంది."

ఇలాగే మరోసారి ఇంకో అతను మాయన్, ఆజ్‌టెక్  నాగరికతల గురించి మాట్లాడుతూ 1500 ప్రాంతంలో యూరోపు దేశాలన్నీ ప్రగతిమార్గంలో ప్రయాణించే సమయంలో ఈ ప్రజలేం అలా అనాగరికంగా జీవించారు అన్నాడు. ఇదే వాఖ్యం అప్పటికే కొన్ని పుస్తకాల్లో చదివి ఉండడం మూలంగా నాకు వెంటనే అర్తమైంది అతని ఆలోచనా విధానం ఎలాంటిది అని. కానీ ఇలాంటి మాటలు విని నేను ఊరకుండలేను గదా, మరి అదే సమయంలో యూరోపులో జరిగిన ఘోర కృత్యాల గురించి గుర్తు చేశాను. చరిత్రలో అంతదూరం ఎందుకు? 1940ల్లో జరిగిన హోలోకాస్టు గురించీ గుర్తుచేసి మరి ఈ ప్రవర్తన నాగరికతని, ప్రగతికి సూచనగా పరిగణిస్తాడా అని అడిగాను. వెంటనే అతను క్షమాపణలు చెప్పాడు, కానీ మరో ఇలాంటి విషయంలో ఇలాగే ఏవో పుస్తకాలు చదివి అభిప్రాయాలు ఏర్పరుచుకొంటాడని నాకు అనుమానం.

మరో స్నేహితురాలు, ఈ అమ్మాయి బోల్డన్ని పుస్తకాలు చదివేసి తనకు తెలీనిది లేదనుకుంటూ ఉంటుంది. ఆ సంఘటన తర్వాత ఖురాన్ గ్రంథం చదివి నాతో మాటల మధ్యలో అంది. అసలు వీళ్ళ మతమే ఇలాంటిది. ఆ పుస్తకం చదివిన తర్వాత, ఈ ప్రపంచంలో ఉన్న మతాల్లోకల్లా హింసాత్మకమైన మతంగా అనిపిస్తుంది అంది. అసలు ఈ వాఖ్యం ఎక్కడినుంచి సరిచేయాలో అర్థం కాలేదు నాకు. పశ్చిమ దేశీయులు దృష్టిలో మతం అంటే మూడే మొదటగా తలపుకు వస్తాయి వీళ్ళకు. యూదు, క్రయిస్తవ, మహమ్మదీయం. కొసరుగా బౌద్ద, హిందూ మతాల్ని ఆ మూడు మతాలకి తోడుగా జత చేస్తారు. మరి వీళ్ళకి తెలీని కొన్ని వందల మతాలున్నాయి ప్రపంచంలో. ఒకవేళ ఈ మూడు మతాలనే ప్రమాణికంగా తీసుకున్నా , తర్వాతి రెండు మతాలు యూదు మతం నుండే కదా ఉదయించాయి? తనకి అర్థమయ్యేట్లుగా చిన్న ప్రశ్న అడిగాను. బైబిల్‌లో పాత నిబంధన గుర్తుందా అని. ఆ అమ్మాయికి అప్పుడే లైట్ వెలిగింది. అవును నిజమే పాత నిబంధనా చాలా హింసాత్మకంగా ఉంటుంది, దానిలో నిర్వచించ బడ్డ దేవుడు చాలా

కోపదారి అని ఒప్పుకొంది.

మరో స్నేహితురాలు మన దేశంలో, చైనా దేశంలో బాల కార్మికుల గురించి, వాళ్ళ పేదరికం గురించి వాపోతూ ఉంటుంది. వాల్ మార్ట్, గాప్ లాంటి కంపెనీలు మూత పడాలని వాదిస్తూ ఉంటుంది. దానికి ప్రతివాదనగా నేనామెకు ఓసారి కొన్ని నిజాలు చెప్ప చూసాను. చైనాలో నేనెప్పుడూ నివసించలేదు కనుక ఇండియా గురించి చెప్పాను. ఒకవేళ ఈ కంపెనీలు ఇచ్చే జీతం కన్నా మెరుగైన జీతాలిచ్చి, సులభతరమైన పనులు కల్పించగల అవకాశాలే ఉంటే అసలు ప్రజలీ కంపెనీలకి ఎందుకు పని చేస్తారు? ఒకవేళ ఈ అమాయక ప్రజలని (వీళ్ళ దృష్టిలో మనం దురదృష్టవంతులం, అలా అనుకోవడం సగం వీళ్ళకు తృప్తినిస్తుందనుకొంటా) రక్షించదలుచుకొంటే ఆదేశ ప్రామాణిక విలువల్ని అనుసరించి తదనుగుణంగా జీతాలివ్వమని కంపెనీలతో పోరాడాలి కానీ ఉన్న ఒక్క ఆధారం పోయేట్లుగా కంపెనీలు మూతబడాలని కోరుకోవడం ఏం తెలివి? అలాగే ఇక్కడ ఏ.సి రూముల చల్లదనంనుంచి అందరు బాల, బాలికలు చదువుకోగల అవకాశాలు కల్పించాలన్న నినాదాలతో పాటు, ఆ కుటుంబానికి పిల్లల ద్వారా వచ్చే ఆదాయం వాళ్ళని బడికి పంపినందుకు గాను ఇవ్వగల పథకాలు తయారు చేసి అమలు చేయడానికి కృషి చేయమని అడిగాను. దీనికి బదులుగా ఆమె నోట్లోంచి సమాధానం రాకపోవడమే కాక నావైపు కొంచెం అనుమానంగా కూడా చూసింది.

సరే ఈ సమస్యకీ రెండు కోణాలున్నాయి. మనలోనూ తమకై తాము ఆలోచించలేక గుంపులో గోవిందగా కలిసిపోయే ప్రబుద్ధులూ చాలామంది ఉన్నారు. మనకి సుపరిచితమైన కొన్ని వాదనలు: పశ్చిమ దేశాల విలువలు ఎంత తృణప్రాయమైనవో, మన సంస్కృతి అందరికన్నా ముందుగా అన్ని విషయాలు ఎలా కనిపెట్టేసిందో (తమాషా ఏమిటంటే అన్ని రకాల ప్రజలు ఈ విషయాన్ని గురించి డబ్బా కొట్టుకొంటూ ఉంటారు. నిజమే కొన్ని విషయాలు ప్రపంచంలో చాలాచోట్ల ఒకే సమయంలో కనిపెట్టబడి ఉంటాయి. కానీ దీని మూలంగా ఎందుకంత గర్వ పడాలి? మా తాతలు నేతులు తాగారు కనుక మా మూతులు వాసన చూడండన్నట్లుగా ఉంటుందీ వ్యవహారం. మన సొంత జీవితాల్లో ఏదైనా సాధించగలిగినప్పుడు కొట్టుకొందాంమీ డప్పాలు, సరేనా?). మనమేమైనా చేయబోయేముందు మొదట ఆలోచన ఎప్పుడూ ఎందుకు ఎవరేమనుకొంటారో అన్నదౌతుంది? మర్యాదకి ఎందుకటా అంత ప్రాముఖ్యం? అడ్డమైన వెధవల కాళ్ళకందరికీ నేనెందుకటా నమస్కారం చేయాలి? చేయవలసిన వెధవ పనులన్నీ చేసేసి తిరుపతి హుండీలో రెండు కాసులు వేసి చేతులెలా దులుపుకోవచ్చు? పక్క వాళ్ళలో తప్పులెందుకటా చాలా సులభంగా కనపడతాయి?
మనుషుల్లో ఈ గుణం ఎలా వచ్చింది? తనకై తను ఆలోచించి నిర్ణయాలు తీసుకోలేక పోవటం?

అసలీ స్వభావం ఎందుకింత ప్రాబల్యం సంపాదించుకొంది? దీని వెనుక సామాజిక, సాంస్కృతిక కారాణాలేవైనా ఉన్నాయా? సైన్స్‌లో ఒక సిద్ధాతం ఉంది. వ్యక్తిగత ఎన్నికతో పాటుగా, సామూహిక ఎన్నిక కూడా మన మనుగడలో పాత్ర వహిస్తుందని. దీనికి మూలస్థంభమే ఈ ప్రవర్తనా?

ఇంటర్నెట్ మూలంగా ఇంత సమాచారం అందుబాటులోకి వచ్చాక కూడా ఎందుకు అజ్ఞానంగా మాట్లాడుతున్నాం?
ఎవరైనా ఏదైనా మనకు చెప్పినప్పుడో, లేక ఏ పుస్తకమో చదివినప్పుడో ఆ విషయాన్ని ఒకటికి రెండు సార్లు ఆలోచించి తర్వాత ఆమోదించడం చాలా కష్టమా?

మన గురించి ఎవరైనా తక్కువ చేసి మాట్లాడితే అంత కోపం వస్తుందే, మరి మనం మరోకళ్ళ గురించి మాట్లాడేటప్పుడు ముందూ వెనుకా ఆలోచించక మాట్లాడేస్తాం? వాళ్ళ వ్యక్తిగత చరిత్రల్నీ, సంస్కృతినీ అర్థం

చేసుకోడానికి వీసమెత్తూ ప్రయత్నం చేయమెందుకని?

ఈసారి మీ చుట్టుపక్కలెవరైనా ఇలా తెలిసీ తెలియక మాట్లాడుతుంటే మీలోమీరు ఒక్కసారి ఇలా అనుకోండి "స్వయంకృతం", మీరు అశ్రద్ధగా అజ్ఞానంగా ప్రవర్తిండం మూలంగానే సామూహికంగా మనందరం ఇలా ఉన్నాం. జిడ్డు క్రిష్ణమూర్తి అన్నట్లుగా మార్పు అన్నది మనలోంచే మొదలవ్వాలి.

****

# భూత - భవిష్యత్ - వర్తమానం

అర్థరాత్రి మసక వెన్నెల వెలుతురులో
గత జీవితపు పుటలు తిరగేస్తుంటాను
ఉన్నట్టుండి నువ్వు ప్రత్యక్షమౌతావు
ఏ అంతరంగ తరంగపు మూలల్నుండో
నాకూ నా కలలకీ మద్య పోరాటం ప్రారంభం
ఎలాగో చివరకు సాధించి నిద్దరోతాను.
మరో ప్రపంచమవతల నీ ఉనికి కూడా తెలీని
మనుషుల మధ్య నిశ్శబ్దంగా నివశిస్తుంటాను
పరిచయం లేని మొహాల మధ్య హఠాత్తుగా
నీ నవ్వు మెరిసి మాయమౌతుంది
ఏమీ పట్టనట్టుగా వెళ్ళిపోవాలని ప్రయత్నిస్తాను
కానీ మరోసారి తిరిగి చూడక మాత్రం కాదు.
మరోరోజు మాయమౌతూ నీ ఆనవాళ్ళకి
జాగ్రత్తగా మరికొంచం మసి పూసి వెళుతుంది.
కానీ అప్పుడప్పుడూ కురిసే నీ ఆలోచనల జడివాన
అన్నాళ్ళూ కష్టపడి కట్టుకొన్న నా జ్ఞాపకాల వారధిని నాశనం చేస్తే,
ఇదిగో నేనిలా రాత్రంతా మేలుకొని మంచు తెరల నీరాజనాలర్పిస్తుంటాను
వేకువ వెలుతురు తెరల్లో కరిగిపోతున్న చీకటి తరంగాల సాక్షిగా
గతం తరుపున వర్తమానంతో పోరాడుతుంటాను
ఆ నువ్వే ఈ నేనని అంగీకరించడానికి ఆరాటపడుతుంటాను!!

కిటికీలోంచి చల్లని పిల్లగాలి పరామర్శిస్తోంది. చెట్టుకొమ్మల్లోంచి సన్నగా పడుతున్న వీధి దీపపు వెలుతురు తప్ప అంతా అంధకారం. దూరంగా ఎక్కడో అప్పుడప్పుడూ వెళుతున్న కార్ల చప్పుడు తప్ప అంతా నిశ్శబ్దం.

ఇలాంటప్పుడే ఒంటరితనం తట్టి మరీ తన ఉనికిని తెలియజేస్తుంది. నాగరికత నిర్మించిన కాంక్రీటు కీకారణ్యంలో చిక్కుకుపోయి దారి తెలీక తప్పిపోయిన మానవుల్లో సురేష్ ఒకడు. ఈ మధ్య తరచుగా నిద్రలేమి అతన్ని బాధిస్తోంది. ఇన్ని సంవత్సరాలుగా తన శక్తినంతా ధారపోసి నిర్మించుకొన్న అతని ప్రపంచం కక్ష్య తప్పి విశ్వాంతరాల్లోకి విసిరేయబడపోయే సూచనలు దీనికి కారణం. ఒకటి రెండుసార్లు ఆత్మహత్య గురించి కూడా ఆలోచనలు అతని మనసులో తొంగిచూసాయి. సహజంగానే పోరాడే మనస్తత్వం తనదనకొన్న సురేష్‌కి ఇది చాలా అవమానంగా అనిపించింది. గతంలో ఆత్మహత్యల గురించి విన్నప్పుడు వాళ్ళని సమస్యల నుంచి పారిపోతున్న పిరికిపందల కింద జమకట్టిన అతనికి మొదటిసారిగా ఆ నిర్ణయం ఎంత వేదనతో కూడినదో అర్థమైంది. ఈరాత్రి తెల్లవారక ఇలాగే ఉండాలన్న తన కోరిక ఎంత హాస్యాస్పదమో అన్న విషయం అంగీకరించడానికి అతని మనసంగీకరించడంలేదు. తన కళ్ళ ముందే తన జీవితం వేలంపాట వేయబడడం భరించడమెలా? తన భార్య పిల్లలు తనని క్షమించగలుగుతారా?

"మనిషి పుట్టాడు, అనేక కష్టాలనుభవించాడు, చివరకు మరణించాడు. అతని జీవితానికి అర్థం లేదు, అతని జీవితం వల్ల వచ్చిన ప్రయోజనం లేదు. అసలతను పుట్టాడా లేదా అన్న ప్రశ్న అనవసరం" - చదువుతున్న పుస్తకం పక్కకు విసిరేసి నిస్పృహాయంగా సోఫాలో వెనక్కు వాలింది ప్రమీల. అసలిలా మాట్లాడ్డానికి ఈ రచయితకేం అధికారం ఉంది? మనిషి ఉనికికే అర్థం లేదంటాడే? ఈ రెండు నెలలనుంచి తనలో భాగంగా మారిన దు:ఖాన్ని తిరస్కరించడానికి ఇతనికి ఎంత ధైర్యం? ఊహ తెలిసిన దగ్గరనుండీ తన ప్రాణంలో ప్రాణంగా భావించిన తండ్రిని కోల్పోయిన ఓ కూతురి కన్నీళ్ళకి అర్థం ఎంతమందికి తెలుస్తుంది? తను తిన్నా తినకపోయినా తన కూతురి భవిష్యత్ కోసం ఉన్నదంతా ధార పోసిన అతని జీవితానికి, జ్ఞాపకాలకి విలువ కట్టడం ఎవరికి సాధ్యం? తనకు తెలిసిన వాళ్ళల్లో తల్లిదండ్రుల్ని కోల్పోయిన స్నేహితులున్నారు కానీ వాళ్ళు కూడా తన దు:ఖాన్ని అర్థం చేసుకోలేక పోతున్నారేం? ఎవరితో మాట్లాడినా తనకు నీతులు చెప్పేవాళ్ళు తప్ప నాన్న లేని లోటుతో అన్నీ మరిచిపోయి, అసలేం జరగనట్లుగా బ్రతకడం అసాధ్యం అని అంగీకరించే వాళ్ళు లేరే? అసలు బ్రతుకు తీరే అంతైతే సోమర్ సెట్ మాం అన్న మాటలు నిజమేనా?

ఇలాంటి క్లిష్టమైన భావాల్ని ఎలా అవగాహన చేసుకోవాలో, మరో నిద్రలేని రాత్రి ఎలా గడపాలో నిర్ణయించుకోలేక గదిలో పచార్లు చేస్తూంది, ప్రమీల.

వెన్నెల్లో మెరిసే పారిజాతాల్ని చూసిన ప్రతిసారీ అతనికి ఆమె నవ్వే గుర్తుకు వస్తుంది. చిగురాకుల మధ్య పుట్టిన స్వాతి చినుకుల్లాంటి ఆమె కళ్ళెప్పుడూ అతన్ని వెంటాడుతూనే ఉంటాయి. దశమి వెన్నెల, పాకుడు పట్టిన కోనేటి మెట్లు, డాబామీదకి ఒదిగిన నిద్ర గన్నేరు చెట్టు, ఒకప్పుడు ఇవన్నీ అతని నేస్తాలు. ఆమె గురించిన రహస్యాలు అతనితో పంచుకొన్న కవితా రాగాలు. కానీ ఇప్పుడేం అలా మూగబోయాయి, పలకరించబోతే మొహంతిప్పుకు పోతున్నాయి? మరి అతని హృదయం, పిచ్చి హృదయం? ఒకప్పుడది అల్లరి మహానగరం. ఏమైపోయిందో ఆ

అనుభూతుల సంచలనం? ఆమెని మొదటిసారి కలసిన రోజు అతనికింకా జ్ఞాపకం. వేణుగోపాల స్వామి ఆలయంలో బొట్టుపెట్టుకొంటూ మెట్లుదిగుతూ జారి ఎదురుగా వస్తున్న అతని చేతుల్లో గువ్వలా ఒదిగిన ఆమె పరిమళం అతన్నీ రోజుకీ ఉక్కిరిబిక్కిరి చేస్తుంటుంది. వాళ్ళిద్దరూ కలిసి అల్లుకొన్న కలల సామ్రాజ్యం ఓ వేసవికాలపు సాయంత్రం, ఆమె



నిర్ణయానికి ఫలితంగా పునాదులతో సహా పతనమైంది. మరి అతనిప్పుడు ఆమె జ్ఞాపకాల లోతులో మునిగిపోయి జీవితాన్నే మర్చిపోయి ఒంటరితనంతో స్నేహం చేస్తుంటాడు. కొండల చాటునుండి బరువుగా చంద్రుడు ఆమె గురించిన ఆలోచనలు భుజాన వేసుకొని వస్తుంటాడు. అతన్నింతకు మునుపెరిగిన వాళ్ళెవరూ గుర్తించలేక పోతున్నారు. ఆమెతో పాటు అతనిలో సగభాగాన్ని తీసుకెళ్ళిందని వాళ్ళ అనుమానం.

"అమ్మా, అమ్మా, ఇదిగో ఈ ఉత్తరం చూడు. నేను అప్లయ్ చేసిన స్కూల్లో అడ్మిషన్ ఇచ్చారు. ఈ స్కూల్లో సీట్ రావడం ఎంత కష్టమో తెలుసా?" వగరుస్తూ ఇంట్లోకి వచ్చిన సునందని వాళ్ళమ్మ దగ్గరకి తీసుకొని నుదుటిమీద ముద్దు పెట్టుకొంది. నిజానికి ఆవిడ ఆ ఉత్తరం మధ్యాహ్నమే చూసింది. చూడగానే తన కూతురి తెలివి తేటలకి పొంగిపోయింది. కానీ కొద్ది క్షణాల తర్వాత నిజం అంగీకరించక తప్పలేదు. ఆ స్కూల్ కి సునందని పంపే స్థాయి తమకు లేదు. వద్దన్నా వినక సునంద మాష్టారు అసలు తన తెలివిని పరీక్షించినట్లుగా ఉంటుందని ప్రవేశ పరీక్షలకి పంపించాడు. ఇప్పుడేమో తన చిన్న మనసుకెలా అర్థమయేట్టు చెప్పడం? మెల్లగా సునందని తన వళ్ళోనుంచి దింపి రెండు భుజాల మీద చేతులు వేసి అనునయంగా చెప్పవలసిన విషయం చెప్పింది. ఒక్కసారిగా సునందకు కోపం, ఉక్రోషం ముంచుకు వచ్చాయి. బదులేమీ చెప్పక స్కూల్ బ్యాగ్ ఓ మూలకు విసిరేసి వీధిలోకి పరుగెత్తుకొని వెళ్ళింది. ఉబుకుతున్న కన్నీళ్ళని బలవంతంగా అణిచేసి, ఆడుకుంటానికి రమ్మన్ని పిలుస్తూన్న పక్కింటి అన్వేష్ని చూసీ చూడనట్లుగా నటించి వెళ్ళిపోయింది. ఓ రెండు గంటలు పోయాక దుమ్ముతో కలిసిన కన్నీటి చారికలతో , ఆకలితో తిరిగి వచ్చిన తనని పరిగెత్తుకు వచ్చి కౌగలించుకొని ఇంట్లోకి తీసుకు వెళ్ళి స్నానం చేయించి, ఆప్యాయంగా గోరు

ముద్దలు తినిపిస్తూ మరోసారి తమ ఆర్థిక పరిస్థితుల్ని వివరించిన అమ్మని చూస్తుంటే తనకోపం ఇట్టే కరిగి పోయింది. కానీ ఆ రాత్రి మంచంలో పడుకొని ఇంకా ఆ స్కూల్ గురించి, అక్కడకి వెళ్ళడం గురించి తను కన్న కలల గురించి ఆలోచిస్తున సునందకి తనకర్థం కాని కోపం తనకి తెలియని ఎవరిమీదో మిగిలి పోయింది. తనలాంటి తెలివిగల వాళ్ళకి అవకాశాలు కల్పించలేని సమాజం మీదేమో!

అంత తీవ్రమైన ఆలోచనల్లోనూ కళ్ళుమూసుకొని కిటికీ అంచుకి ఆనుకొని నుంచొన్న సురేష్ పెదవులమీద చిన్న నవ్వు కదిలింది. సాధ్యమైతే ప్రమీల లివింగ్ రూంలోకి, ఆ అమర ప్రేమికుడి కలల్లోకి ప్రయాణం చేసి, వాళ్ళిద్దరూ అంతగా సతమత మౌతున్న సమస్య ఓ రెండు, మూడు సంవత్సరాల్లో ఎలా పొగమంచులాంటి జ్ఞాపకాల తెరల్లో మాయమైపోతాయో వివరించి చెప్పాలని ఉంది. వాళ్ళ భుజాలపైన సున్నితంగా తట్టి ఓదార్చాలని ఉంది. మానవ జీవితం విచిత్రమైంది. కాలంతో పాటూ సమస్యలు, వాటి తాలూకూ గాయాలు ఎలా మానతాయో వివరించడం క్లిష్టతరం. ఇంతలో కిటికీ బయట చిన్న చప్పుడు కావడంతో కళ్ళువిప్పి చూసాడు సురేష్. కిటికీ బయట ఓ చిన్న పిల్ల , బహుశా ఎనిమిది తొమ్మిదేళ్ళుంటాయో, నవ్వుతూ చేయి ఊపుతోంది. అతనికేం అర్థం కాలేదు. ఇదెలా సాధ్యం? గేట్ తాళం వేయబడి ఉందే, దానికి తోడు బయట వాచ్‌మాన్ని తప్పించుకొని ఎలా లోపలికి వచ్చింది? ఇలా ఆలోచనలతోనే కలలోలా తనూ తిరిగి చేయి ఊపాడు. ఆ చిన్నపిల్ల క్రమంగా కిటికీ దగ్గరగా వచ్చి నవ్వుతూ ఇలా అంది "గుర్తుందా? నువ్వా స్కూల్ కి వెళ్ళలేవని తెలిసిన రాత్రంతా ఎలా కోపంతో ఏడుస్తూ కూచున్నావో? ఆ స్కూల్ కి వెళ్ళలేనంత మాత్రాన నీ అభివృద్ధికి ఆటంకం కలగలేదు కదా? సమాజంలో నీకంటూ ఒక స్థానం కల్పించుకొన్నావు కదా? మరి ఆ రాత్రికీ, ఈ రాత్రికీ ఏం తేడా?"

ఇంతకీ సునందా, సురేష్ ఒక్కళ్ళేనా? గత జ్ఞాపకాల్ని, గత జీవితాన్ని మరోకళ్ళకి ఆపాదించడంలో అర్థం ఏమిటి? ఈ సారి మరిన్ని ప్రశ్నలడిగే వంతు పాఠకులకి వదిలేస్తున్నా!

# తాతయ్యకి , ప్రేమతో...

ఒకప్పుడు, నేను చిన్నప్పుడు, నన్ను నేను తెలుసుకోవాలని ప్రయత్నిస్తున్నప్పుడు, ప్రపంచమంతా తెలీని అంధకారంలోనుండి భయపెడుతున్నప్పుడు, అర్థం కాని అపాయాలు వరదల్లా ముంచెత్తినప్పుడు, తన భుజాలమీద ఎక్కించుకొని భద్రంగా దాటించి గమ్యం చేర్చిన తాతయ్య. పొలం గట్టున నాతో పాటూ పరిగెత్తిన తాతయ్య, గంట సేపు నేను కనపడలేదని హడలిపోయిన తాతయ్య, సంతకు వెళ్ళిన ప్రతిసారీ నాకిష్టమని జిలేబి తెచ్చిన తాతయ్య,

నిర్మలమైన ప్రేమకు నిర్వచనమిచ్చిన తాతయ్య. నాతో కలిసి పుస్తకాలు చదివిన తాతయ్య. జనవరిలో వస్తున్నానంటే 'చాలా సంతోషం అమ్మా' అన్న తాతయ్య. ఏమైపోయావు, మమ్మల్నందర్నీ వదిలేసి ఎక్కడకు వెళ్ళిపోయావు? మరీ ముఖ్యంగా నాతో మాటమాత్రమైనా చెప్పకుండా వెళ్ళడానికి మనసెలా ఒప్పింది నీకు? ఇన్ని సంవత్సరాల స్నేహానికిదేనా అర్థం? అదిగో చూడు, నేనూ మామూలు మనిషినే. నీకోసం కాక నువ్వు నాకు చెప్పకుండా వెళ్ళిపోయావన్న ప్రశ్నకే ప్రాధాన్యతనిస్తున్నా. మేమంతేలే, ఇక్కడ ఉన్న వాళ్ళమింకా అలాగే ఆలోచిస్తాం, నీకు తెలీనిదేముంది? ఉనికిని నియంత్రించే ధర్మాలని కాలదన్నే జ్ఞానం లేదు కదా మాకు? కానీ నీ విషయం వేరు. ఉన్నన్నాళ్ళూ నీకోసం ఆలోచించుకోక మా అందరికోసం బ్రతికిన నువ్వు, మరణాన్నీ అంతే నిశ్శబ్దంగా, నిరాడంబరంగా అంగీకరించావు.
నీకోసం ప్రజలు నివాళులర్పించలేదు, నీ జ్ఞాపకార్థం ప్రభుత్వం ఎలాంటి స్తూపమూ నిర్మించలేదు, నిన్ను గౌరవిస్తూ పాఠశాలలు మౌనం పాటించలేదు. అలాగని నువ్వు నెహ్రూ కన్నా గొప్పవాడివి కావని కాదు, గాంధీ కన్నా మంచివాడివి కాదనీ కాదు. వీటన్నింటికన్నా ముఖ్యమైన విషయం నువ్విక లేవని తెలిసినప్పుడు బరువెక్కిన గుండెలే కానీ, విరుపు మాటలు లేవన్నది. బంగారం లాంటి హృదయమున్న నీలాంటి వాళ్ళుండబట్టే మన సమాజమిలా మనగల్గింది, వాళ్ళ లాంటి నేతలు మీ భుజాల మీద నిలబడ గలిగారు. మీ తరం ఆదర్శాల పాళ్ళలో పదోవంతు మాకు సంక్రమించినా మన సమాజం భవిష్యత్‌కి లోటు లేదు. అలాంటి విలువల్ని మాకు నేర్ప ప్రయత్నించిన మీ అందరికీ ఈ వందకోట్ల జనాభా తరుపున, ఆప్యాయతకి అర్థం చెప్పిన నీ జ్ఞాపకాలకి నా తరుపున, మౌనభాష్పాల కుసుమాంజలి.

నాకు తెలుసు. నియమాల ప్రకారం, రచయిత్రిగా నా జీవితంలో సంఘటనలతో మీకు ఎలాంటి సంబంధం లేదు. కానీ ఈ ఒక్క ముఖ్యమైన సంఘటన మాత్రం మీ అందరితో పంచుకోవాలనిపించింది. ఒకప్పుడు ఇలాంటి నివాళులు చదివినప్పుడు నాకు చాలా వింతగా అనిపిస్తుండేది. ఎందుకిలా ప్రపంచానికి తెలిసేంతగా పత్రికల్లో ప్రకటించడం, ఎవరేం ఖాతరు చేస్తారని? అని అనుకొనేదాన్ని. కానీ ఇప్పుడర్థమౌతుంది ఆ ప్రయత్నాల వెనుక తాపత్రయమేమిటో. ఎప్పుడైనా ఒంటరిగా ఉన్నప్పుడు అందమైన సూర్యాస్తమయమో లేక చంద్రోదయమో చూసినప్పుడో, లేక ఓ అద్భుతమైన కవిత చదివినప్పుడో, ఆ ఆలోచన, అనుభూతి వెంటనే ఎవరితోనో పంచుకోవాలనిపిస్తుందే, అలాంటిదే ఈ ప్రయత్నమూనూ. మీలో చాలామంది ఇలాంటి సంఘటన ఎదుర్కొని ఉంటారు. ముఖ్యంగా మరణం కలిగించే అవ్యక్త అవేదనల్ని అర్థం చేసుకోడానికి చాలా సమయం పడుతుంది. అందుకే ఆ భావాన్ని అంతకు ముందు చవిచూసిన వాళ్ళతో పంచుకోవాలన్న తపన. మనిషి సంఘజీవి అన్నదానికి ఇది చాలా సరైన ఉదాహరణేమో?

# పల్లెటూళ్ళో వెన్నెల రాత్రి

కొబ్బరాకు మీదనుంచి మెరుస్తూ జారిన ఓ వెన్నెల కిరణం ప్రక్కనే నవ్వుతున్న మల్లెపూవు మీద పడి మరింత తెల్లగా పరావర్తనం చెందుతోంది. కొండమీద నుండి కబుర్లు మోసుకొచ్చే పైరగాలితో విరజాజి పూల సుగంధం మిళితమై సున్నితంగా సేదదీరుస్తోంది. వెన్నెట్లో గమ్మత్తుగా మెరిసే ఏటినీళ్ళు, ఏటినీళ్ళలో తడిసిన రెల్లుగడ్డి పరిమళం, పాకుడు పట్టిన కోనేరు మెట్లు, బద్దకంగా ఆవులించే నిద్రగన్నేరు చెట్లు, మంచులో విరిసిన పారిజాతాలు, మసక చీకట్లలో మసిలే పొన్నాయి పూలు. ఉలిక్కి పడిన తువ్వాయి మెడలో చిరుగంటలు, జామచెట్టు మీద కువకువలాడే

రామచిలుక, చల్లగాలి పాడే హిందోళానికి తాళం వేసే ముద్దబంతులు, ఇసుక తెన్నెలపై తేలివచ్చే కీచురాళ్ళ పాట, డాబాపైన అమ్మ ఆరబెట్టిన వడియాలు, తెడ్డువేస్తూ నావవాడు పాడే పదం, దూరంగా సత్రంలో బైరాగి పాడుతున్న తత్వం, నిశ్శబ్దాన్ని చీల్చుకుంటూ వినవచ్చే రైలుబండి కూత, ఉన్నట్టుండి రెక్కలు టపటపలాడిస్తూ, గుండెల్లో గుబులు పుట్టిస్తూ ఎగిరిపోయే పిట్ట. గాలి వీచినప్పుడల్లా పిట్టగోడకి రాసుకొనే కొబ్బరిమట్ట లోగొంతుకలో చెప్పే జీవిత రహస్యాలు!

మీలో చాలా మంది ఇలాంటి అద్భుతమైన రాత్రి అనుభవించి ఉంటారు. నాతోపాటూ నిద్దుర పొద్దులు మేలుకొని నక్షత్రాల కాంతులతో కలల మైదానాల వెంబడి భావుకత్వపు లోగిళ్ళలో కవిత్వపు ముగ్గులు గీసి ఉంటారు. ఇప్పటికీ నాగరిక ప్రపంచంలో చిక్కుకుపోయి, కళ్ళు మిరుమిట్లుగొలిపే విద్యుద్దీపాల కాంతుల మధ్య వెలవెలబోతున చంద్రుణ్ణి చూసిన ప్రతిసారీ, మీ మనసూ మరో అర్థవంతమైన ప్రపంచంవైపు లాగుతూనే ఉండి ఉంటుంది. మనలాంటి ఎంత మందికో ఆలంబనగా, కేవలం భావ స్వాతంత్రానికే కాక, ఆర్థిక, సామాజిక విప్లవాలకి తావైన అద్భుతమైన, అందమైన, ఎప్పటికీ మనకోసం చేతులు చాచి వేచిచూసే అమ్మల్లాంటి పల్లెటూళ్ళు.

పల్లెటూళ్ళు మన దేశ భవిష్యత్తుకి పట్టుకొమ్మలని గాంధి అన్నారు. కానీ ఇవ్వాళ్ళ వాటి పరిస్థితి తరచి చూస్తే దీన గాథలే కానీ, విజయ శంఖారావాలు వినిపించడం లేదేం? దీనికి వెనుక ఉన్న కారణాలేవిటి? మన దేశ జనాభాలో 75 శాతం ఇంకా పల్లెటూళ్ళలోనే నివశిస్తున్నారు కదా, మరేం మనకు వీళ్ళంటే అంత అశ్రద్ధ? ఆర్థికంగా భారతదేశం చాలా త్వరగా ఎదుగుతోంది. సంవత్సరంలో జాతీయాదాయం పదిశాతం పెరుగుతోంది. దీన్ని గురించి మనం గర్వంగా కనపడ్డ వాళ్ళందరి దగ్గరా మాట్లాడుతాం. బెంగుళూరు, హైదరాబాదు వంటి పట్టణాల అభివృద్ధి, పాశ్చాత్యదేశపు ప్రముఖ నగరాలకి ఎంత సామీప్యంగా, సమానంగా ఇవీ ఎలా వెలుగుతున్నాయో చెప్పి మరీ ఆనందిస్తుంటాం. కానీ మనందరికీ తెలుసు, ఈ అభివృద్ధి ముఖ్యంగా పట్టణాలనుంచి, పారిశ్రామిక ప్రాంతాలనుండి వస్తుంది. మరి ఇక మన పల్లెటూళ్ళ మాటో? ఇంటికి వచ్చిన అతిథులకు సొంత కూతురిని బ్రహ్మాండంగా తయారు చేసి చూపించి, సవతి కూతురిని సావిట్లో దాచిన వైనంగా ఉంది మన ప్రవర్తన. దానికి పైగా వచ్చిన చిక్కేవిటంటే సొంత ఎవరో, పరాయి ఎవరో పూర్తిగా మర్చిపోయాం.

మనలో చాలా మందికి ఇప్పటికీ అన్నం పెడుతున్న వ్యవసాయాన్ని పూర్తిగా మరిచిపోతున్నాం. నాకు ఒక్కోసారి ఎంతో ఆశ్చర్యంగా అనిపిస్తుంది, అంతమంది జనాభాని భారతదేశం ఎలా భరించగలుగుతుందా అని. దానికి సరైన జవాబు, సారవంతమైన బంగారం లాంటి మన భూమి. సంవత్సరంలో కొన్నిచోట్ల రైతులు మూడు పంటలు పండిస్తారు. ఇక్కడ ఇంటిముందు కాసిని కూరగాయలు పెంచడానికి నానా తంటాలు పడ్డ తర్వాత గానీ అర్థం కాలేదు, రోజూ మనం సునాయాసంగా సుష్టుగా లాగించే అన్ని పదార్థాలని పండించాలంటే ఎంత శ్రమ, కృషి అవసరమౌతుందో అని. ఒక్కరోజు ఉల్లిపాయల ధర పెరిగితే మాత్రం, అవి వాడుకోకుండా కూరైనా వండుకుంటాంగాని, అసలిలా ఎందుకు జరిగిందా అని ఒక్కక్షణం ఆగి అలోచించం. కానీ అదే రోజు సాయంత్రం షోరూంకి వెళ్ళి కొత్తగా రిలీజ్ అయిన టెలివిజన్ సెట్ వేలకి వేలు పోసి కొనుక్కుంటాం. నాగరికతతో పాటుగా మనజీవిత ప్రమాణాలు మారడం సహజమే. కానీ మనిషికుండాల్సిన అతి ముఖ్యమైన విలువల్ని గౌరవించకపోగా, పూర్తిగా ధిక్కరిస్తే ఎదురయ్యే ప్రమాణాల గురించి ఆలోచించడానికే భయంగా ఉంటుంది. కొన్ని నెలల క్రితం అనుకుంటా రాశాను, నాగరిక సమాజ నిర్మాణానికి వ్యవసాయం దోహదం చేసింది అని. కానీ ఇవ్వాళ వ్యవసాయం అంటే పట్టణాల్లో నివసించే చాలామందికి

దుకాణాల్లో క్రమంగా అమర్చబడిన కూరగాయలు, పళ్ళుగా మాత్రమే తెలుసు అన్న సత్యం ఎంత విచారకరం? ఇంటికి వచ్చి పాకెట్లు నాజూగ్గా విప్పి మైక్రోవేవ్‌లో వేడి చేసుకు మనం తిండానికి వీలు చేసేందుకు సంవత్సరం పాటూ ఎండనకా, వాననకా, పగలనకా, రాత్రనకా కాయ కష్టంచేసిన రైతు సంపాదన, ఏ.సి. రూముల్లో కూచుని పనిచేసే మనం సంపాదనతో పోలిస్తే ఎంత తక్కువో ఆలోచించడానికే సిగ్గుచేటు. మాన్సాంటో లాంటి విదేశీ కంపెనీలు అధిక దిగుబళ్ళ పేరుతో మనజాతి మొత్తాన్ని ఆత్మహత్యల వైపుకి మళ్ళిస్తే మనకి చీమ కుట్టినట్లుగా అనిపించకపోవడం హాస్యాస్పదం. ఇలాంటి కార్యక్రమాల్ని దగ్గరుండి నడిపించిన రాజకీయ నాయకుల్ని మళ్ళీ, మళ్ళీ నెత్తికెక్కించుకోవడం మనతెలివికే చిన్నతనం.

ఇవ్వాళ వినియోగదారుల మనసుల్లో పెరిగిపోతున్న ఇంధనాల ధరల గురించి ఒకటే ఆందోళన. సహజ సిద్దమైన కార్బన్‌తో కూడిన ఇంధనాలు కాకపోతే, నీళ్ళతో నడిచే మరోకటి. దీనిగురించి వీళ్ళకేం ఇంత ఖంగారు? రేపు మనం రోజూ తినే వరి, గోధుమ కిలో వెయ్యి రూపాయల చొప్పున అమ్మితే, అపుడేం తింటాం? నాకు తెలిసి, గాలి, నీరు, ఆహారం లేకుండా బ్రతగ గలిగిన మనిషి ఇంకా కనుగొనబడలేదే? లేక అదే వైపుకు మానవ సమాజం పయనిస్తోందా? ఇంతకూ నేను చెప్పొచ్చేదేమిటంటే, రెండో ప్రపంచ యుద్దం తర్వాత ఫెర్టిలైజర్ వాడకం వల్ల వ్యవసాయంలో చారిత్రాత్మకమైన దిగుబళ్ళు సాధ్యమయ్యాయి. ఆహార పదార్థాల ధరలు విరివిగా పడిపోయాయి. దానిమూలంగా ప్రపంచ జనాభా విస్తృతమయ్యింది. ఒకప్పుడు సమాజానికి మూలాధారమైన రైతు పాత్ర పూర్తిగా దిగజారిపోయింది. యంత్రాల వెనుక మరుగున బడిపోయింది. కానీ, ఈ బలం మందులు, పురుగు మందుల వల్ల నాగరిక మానవుడు ఎలాంటి చావు చస్తున్నాడన్న విషయం ఇప్పుడిప్పుడే వెలుగులోకి వస్తుంది. ఇలాంటి మందులు వాడక సహజంగా పెంచిన ఆహార పదార్థాల వినియోగం పెరుగుతోంది, కానీ దీని విలువ, ఇలాంటి సురక్షితమైన ఆహారాన్ని మనకందించగల రైతు విలువ తెలుసుకోవడానికి మనకి ఇంకా చాలా సమయం పడుతుంది. మనలాంటి వాళ్ళు ముందుగా మేలుకొని వ్యవసాయాన్ని, రైతుల్ని రక్షించకపోతే మన తర్వాత తరాల పరిస్థితి ఏమిటి అన్నది ఎవరం చెప్పలేం.

ఒక్కసారి కూచుని ఆలోచిస్తే, ప్రపంచ జనాభా లెక్క ప్రస్తుతం ఆరున్నర బిలియన్. వీళ్ళందరికీ కావలసిన ఆహారాన్ని ఎలా అందించగలం అన్న ప్రశ్న మన బుర్రని తొలిచేయక మానదు. దీనికి తోడు అభివృద్ధి చెందిన/చెందుతున్న దేశాల్లోని ప్రజలు వనరులనే కాక, ప్రపంచమంతా పండించిన పంటల్ని ఎంత వృధా చేస్తున్నారు? వీటిని ప్రపంచం నలుమూలలా అందించడానికి ఎంత ఇంధనం ఖర్చు చేస్తున్నాం?

పెరట్లో పండించిన కూరగాయలు, పక్కింట్లో పోయించుకొన్న పాలు, సొంత చేలో పండిన బియ్యం, ఇలాంటి రోజులు మళ్ళీ వస్తాయని కొందరు, అలాంటి జీవన విధానానికి కాలం చెల్లిపోయిందని మరికొందరూ వాదిస్తుంటారు. ఏదైంతేనేం? పల్లెటూళ్ళలో నివసించే మనవాళ్ళకి మంచి జీవితాన్ని మనమివ్వలేకపోతే వ్యవసాయానికి, దాని మీద ఆధారపడే సర్వ మానవాళికీ మంచిరోజులు అయిపోయినట్లే. మనం పుట్టాం, చాలా సౌకర్యవంతమైన జీవితాన్ని అనుభవిస్తున్నాం, మనకీ, మన పిల్లల భవిష్యత్తుకీ అన్నీ ఎంతో శ్రద్దగా సమకూరుస్తున్నాం. ఇంతేనా, మన బాధ్యత? సామాజిక, ప్రాపంచిక బాధ్యతల సంగతో? ఇవ్వాళ మన జీవన విధానం మార్చుకోకపోతే, మన మనుమలు, మనుమరాళ్ళు బ్రతకడానికి అనుకూలంగా భూమి ఉండదేమో అన్న ఆలోచన మనకి ఖంగారు కలిగించాలి. మనందరం కలిసి మానవత్వం పురోగతి మాట పక్కన ఉంచి, అధోగతి పట్టకుండా కాపాడుకోవాలి. మన అస్తిత్వానికి అత్యంత

ముఖ్యమైన వనరుల్ని రక్షించుకోవాలి. రైతు కూతురిగా ఇలా మాట్లాడ్డం నాకు సహజమే, కానీ ఎంతో కొంత ఆలోచన శక్తి ఉన్న మీలో ఒక్కళ్ళయినా నేను చెప్పిందాంట్లో నిజం లేకపోలేదని అనగలరా?

## కన్నీళ్ళతో నా కలల పారాణి

(ఆచార్య ఇనాక్ గారి అంతరంగ తరంగాలు సృష్టించిన ఆలోచనల సుడిగుండం)

నీ ప్రేమకు శబ్దం లేదు ఎందుకంటే
నువ్వు అక్కున చేర్చుకోవాలని, నీదాన్ని చేసుకోవాలని ప్రయత్నిస్తున్న
ఈ ప్రపంచం జ్ఞానశూన్యతలో నివశిస్తుంది గనుక!
నీ వేదనకు నిశ్శబ్దం లేదు ఎందుకంటే
అది భువన భోళాంతరాలను తల్లకిందులు చేసే ప్రభంజనం గనుక,
అసభ్యమైన రీతుల్ని పునాదులతో సహా పెకిలించి
విశ్వపు అంచుల్లోకి విసిరేయగల శక్తి దానికుంది గనుక!

నీ ప్రేమకు అర్థం ఉంది.
అది నీ వేదనల కొలిమిలోంచి పవిత్రంగా పుట్టుకొచ్చింది.
నీ ప్రేమ, ప్రేమకు అర్థాన్నిస్తుంది.
తిరిగి నిన్ను ప్రేమించాలన్న కోరిక నన్ను ముంచెత్తుతుంది.
నీ కనుకొలుకుల మెరిసే వెచ్చటి నీ కలల్ని
నా సొంతం చేసుకోవాలన్న తపన రగిలిస్తోంది!

నీ వేదనకో పరమార్థం ఉంది.
అది నీ గుండె లోతుల్లోనుండి నిరంతరంగా ప్రవహిస్తుంది.
నీ వేదన, నా కన్నీటి బొట్ల సాక్షిగా
మరో ప్రపంచానికి పునాదులు వేస్తుంది.
అద్భుతమైన ఆశల్ని, అర్థవంతమైన ఆశయాల్ని నిర్మిస్తుంది!

నీ కన్నీటికి నువ్వెరగని శక్తి ఉంది.
అది నాలో చరిత్రను తిరిగి రాయాలన్న ఆవేశం కలిగిస్తుంది.
కులంలేని కర్ణున్ని సృష్టించాలని

డబ్బన్న మాటకు అర్థంలేని భాషని కనిపెట్టాలని
జయాలు, అపజయాలు లేని సమాజాన్ని నిర్మించాలని
ఇంకా ఏదేదో, మరేదో చేసేయాలన్న అస్పష్టపు ఆలోచనలు కల్పిస్తుంది!

# సంఘం - సంస్కారం

" మంచో, చెడో ఏదో చెయ్యటంలో వోటమి లేదు. ఏమీ చెయ్యక పోవడంలో ఉంది వోటమి. సంఘం ఏమీ చెయ్యదు. ఆఫీసు కెడుతుంది, భోజనం చేస్తుంది, పేకాటుడుతుంది, పిల్లల్ని కంటుంది. ఎవడో ఏదో చేస్తుంటే వింతగా చూసి, అది చెడేనని నిర్ణయించి, ఆ చెడుగులో ఆనందం పొంది తృప్తి పడుతుంది. కానీ చెడు అంటే ఏమిటో? ఎట్లాంటిదో తెలుసుకోవాలి, ఎట్లా? సంఘం చెప్పదు. సంఘం ధ్వనులు చేస్తుంది కాని, అర్థమయ్యే భాష మాట్లాడదు, సంఘం తీర్పు చెప్పదు. వూరికే వాదిస్తూ కూచుంటుంది. ఆ వ్యక్తిని మధ్య నిలబెట్టి అతని చుట్టూ అలుముకొని సంఘం చూస్తూ కూర్చుంటుంది."

\- బుచ్చిబాబు.

(చివరకు మిగిలేది)

కుటుంబరావు గారింట్లో ఆ రోజున అంతా నిశ్శబ్దంగా ఉంది. ఈజీ చైర్‌లో కూర్చొని కాఫీ తాగుతూ ప్రతిరోజు ఉదయం పేపర్ చదువుకొంటూ ఉండే రావు గారు బెడ్‌రూంలో నుండి ఇంకా బయటకే రాలేదు. ఉదయాన్నే ఫలహారాలు, మధ్యాహ్న భోజన ఏర్పాట్లు చేస్తూ గాజుల గలగలలతో సందడి చేసే శాంతమ్మ గారి ఆచూకీ ఎక్కడా కనబడ్డంలేదు. ఇల్లంతా మూగబోయినట్లుగా , ఎవరో పూనుకొని ఆ ఇంట్లో జీవకళని తుడిచేసినట్లుగా తోస్తోంది. ఈ నిశ్శబ్దానికి కారణం, వారి ఒక్కగానొక్క కూతురు స్పందన. ఉప్పొంగే నదిలా, జలపాతపు హోరులా ఎప్పుడూ హుషారుగా ఆనందానికి అర్థం చెప్పేలా తిరిగే ఆమె లేకపోవటమొక్కటే కాదు ఆ నిశ్శబ్దానికి సమాధానం. అంతకుముందు రాత్రి ఆమె వెళుతూ, తనతో సంతోషాన్నే కాక తల్లితండ్రుల ఆత్మాభిమానాన్ని తీసికెళ్ళిపోయింది. అభిమానమే ఆభరణంగా వెలిగిన ఆ ఇంట్లో ఇవ్వాళ స్మశాన నిశ్శబ్దం అలుముకొందనడంలో అతిశయోక్తి లేదు. ఇరవై నాలుగేళ్ళుగా ప్రాణానికి ప్రాణంగా ప్రేమించిన కూతురు తమనింత సులువుగా కాదనుకొని వెళ్ళిపోవడం వాళ్ళిద్దరికీ అమితమైన బాధతో పాటుగా ఆశ్చర్యాన్ని కలిగించింది. ప్రేమ గుడ్డిదంటారు, ఈ నిజం తల్లిదండ్రుల ప్రేమకీ వర్తిస్తుంది. తమ సంతానం బాల్యంలో ఎలా తమమీద ఆధారపడి, తమ ప్రేమలో లోకాన్ని మరచి జీవిస్తారో, అదేవిధంగా జీవితాంతం ఉంటారని వీళ్ళకో దృఢమైన విశ్వాసం. వయసుతో పాటూ వాళ్ళ అభిమానాలు, అభిప్రాయాలు తమ పరిధిని దాటి విస్తృతంగా వేళ్ళూనుకుంటాయని వీళ్ళకి చాలా ఆలస్యంగా అర్థమౌతుంది.

స్పందనని రావుగారు, శాంతమ్మ గారు చాలా అపురూపంగా పెంచారు. చిన్నప్పటినుండీ తాను చేయగలిగింది లేదని నమ్మడం, ఎటువంటి పరిస్థితుల్లో ఓటమి నంగీకరించకపోవడం, అన్ని విషయాల్నీ విశదీకరించి ఆలోచించగలగడం, ఇలాంటి ఆదర్శాలని ఆమెకు బోధించారిరువురూ. స్పందన వాళ్ళ నమ్మకానికి తగినట్లుగానే

చదువులో, కళల్లో, తాను ఏది చేస్తే అందులో రాణించింది. ఇరవయ్యేళ్ళ వయసులోనే తనకై, తాను ఒక కంపెనీని స్థాపించి సమర్థ వంతంగా నిర్వహిస్తోంది. చింతలేకుండా సాగిపోతున్న వీళ్ళ జీవితాల్లోకి ఓ రోజున వేణుమాధవ్ అన్న వ్యక్తి తుఫానులా ప్రవేశించాడు. స్పందన కంపెనీకి ముడిసరుకు అతని కంపెనీ సరఫరా చేస్తుంది. స్నేహంగా మొదలైన వారి పరిచయం మరో మలుపు తిరగడానికి ఎక్కువ రోజులు పట్టలేదు. అన్ని విషయాల్ని నిదానంగా, సమగ్రంగా ఆలోచించి, పరిశీలించి నిర్ణయాలు తీసుకొనే రావుగారు వేణుమాధవ్ విషయంలో కొన్ని నిముషాల్లోనే  ఓ నిర్ణయానికి వచ్చేశారు. తల్లిదండ్రుల ప్రేమలో మరో లోపమిదే పిల్లలు సంతోషకరమైన, సాఫల్యమైన జీవితాన్ని గడపడానికి అన్నీ సమకూర్చి, సంతోషంగా ఉండడానికి అత్యంత ముఖ్యమైన విషయానికి వచ్చేసరికి కఠినాత్ములైపోతారు. దానికి ఫలితమే స్పందనిలా ఇల్లు వదిలి వెళ్ళిపోవడం.

పొద్దున్నే లేచి స్పందన ఎంతకీ కిందకు రాకపోవడంతో తన గదిలోకి వెళ్ళిన శాంతమ్మగారికి నైట్ టేబుల్ పైన స్పందన రాసిపెట్టిన ఉత్తరం కనపడింది. అది చదివినప్పటినుండీ ఆ ఇద్దరూ, తమలో తాము తమ పెంపకంలో, ప్రేమలో ఎక్కడ లోపం వచ్చిందో ఆలోచిస్తూ కూర్చున్నారు. ఇంతలో కాలింగ్ బెల్ చప్పుడవడంతో వెళ్ళి తలుపుతీసింది శాంతమ్మ. పక్కింటి సులోచన గారు వస్తూనే ఉపోద్ఘాతంతో పనిలేకుండా సూటిగా అడిగేసింది.

''స్పందన ఇంట్లోంచి వెళ్ళిపోయిందటగా, రంగి చెప్పిందిలే''

నవీన సమాజంలో ఇలాంటి వార్తలు రెక్కలు లేని పక్షులు. ఇది జరిగిందని ఇంట్లో వాళ్ళకు తెలిసేలోపున పక్కింటి పదిళ్ళలో తెలిసిపోతుంది. జవాబు చెప్పక చిన్నగా తలూపి ఊరుకుంది శాంతమ్మ.

''అవును మరీ, వెళ్ళదూ, తాను చెప్పిందే వేదం అన్న ధోరణి గదా తనది''

''అలా అని కాదులే వదినగారు. తన మనసుకేదో బాధగా అనిపించి వుంటుంది'' ఏదో సర్ది చెప్పపోయింది.

''ఇంకా ఎందుకమ్మా, అలా వెనకేసుకొస్తావు. పరువు, ప్రతిష్టా మంటగలిపలా వెళ్ళిపోయిందానిని.''. వీళ్ళ కూతుర్లనీ, కొడుకలనీ కూడా ఇంత సులువుగా వీళ్ళు వదిలేసుకొంటారా?

''మా వసంత చెప్పిందిలే, పోయిన వారం మీరు చూసినతను తనతో మాట్లాడినికి వెళితే, వంటచేయడం వచ్చా అనడిగిందట, అదేం చోద్యమే తల్లా. ఆడపిల్లన్నాక అంత మిడిసిపాటు పనికి రాదులే. విపరీతమైన గారాబం చేయకూడదని పెద్దలు ఊరికినే అన్నారా. ఇప్పుడుచూడు ఏంచేసి వెళ్ళిందో'' ''

''ఎక్కడకు వెళుతుంది? పెళ్ళిచేసుకొని తన ఇంటికి వెళుతుంది. తన పుట్టింటికి ఎప్పుడు కావాలంటే అప్పుడు వస్తుంది.''

''ఇంత ప్రేమతో పిల్లల్ని అదుపులో ఎలా ఉంచుకోగలం, మీరు మరీను. తనేం చేసిందో తెలిసొచ్చేలా కొన్ని రోజులు ఇంటిగడప తొక్కనివ్వకుండా చేస్తే సరి. ఇదే మా వసంతే అయితే తన్ని, తగలేసి, గదిలో పెట్టి తాళం వేద్దును. ''

ఈవిడ మాటలు విన్న కుటుంబ రావుగారు బెడ్‌రూంలోంచి బయటకు వచ్చి ఇలా అన్నారు.

''స్పందన ఎవరి పరువైనా మంట గలిపిందీ అంటే, అది మా పరువు. మరి మాకు లేని దురద మీకెందుకో'?'

''అదేంటన్నయ్యా, అలా అంటారు. ఏదో శాంతమ్మ వదిన బాధ పడుతుందేమో నాలుగు మాటలు చెప్పి పోదామని వస్తేనూ?''

''ఆ నాలుగు మాటలూ, మంచివి చెప్పి వెళ్ళండి అంతేకాని పుండు మీద కారం రాసినట్లుగా ఉండే ఈ

మాటలు దేనికీ కొరగానివి"

"బావుందండీ మీ వరస. ఇలాంటి పెడసరం మాటలు చెప్పి పెంచబట్టే మీ స్పందనిలా తయారయింది. మేమూ కన్నాము, మేమూ పెంచాము పిల్లల్ని, కానీ చిన్న మాటంటే ఇంత రోషమెందుకో, అదీ ఇలా చేసిన దాన్ని గురించి"

(సంఘం సృష్టించే వింతలు ఎన్నెన్నో, మరెన్నో...)

"చూసావా? ఎలా కూచుందో దెయ్యంలాగా. కళ్ళమ్మట ఒక్క చుక్క రాదేం? ముప్పయ్యేళ్ళుగా కాపురం చేసిన మనిషి పోతే."

"ఆ మనిషి ఉన్నన్నాళ్ళు రాజభోగం అనుభవించిందిలే. ఇప్పుడు చూడమా, ఎలా బతుకుతుందో? ఆస్థి వ్యవహారాలు కోర్ట్‌లో వేసారట అతగాడి అన్నదమ్ములు"

"అవాలి. అలాగే శాస్తి జరగాలి. ఎంత ఫోజులు కొట్టేది, తనేదో స్వర్గంనుంచి దిగొచ్చిన దానిలాగా."

"ఆ పోయిన మనిషీ ఇలాగే. ఎడ్డెం అంటే తెడ్డెం అనే రకం. చివరకు దేవుడిని కూడా దూషించేవాడు. అవన్నీ ఊరికినే పోతాయా, ఏ నరకానికో పోతాడు."

"ఇద్దరూ కలిసి సమాజాన్నేదో ఉద్దరించాలని ఆశయమట"

"ఆ ఉద్దరిస్తారు, ఎవరిని ఉద్దరిస్తారుట? కడుపునిండా తిని అరగని వాళ్ళకే ఈ నీతులు. నాకు చెప్పొంచ్చిందో రోజున. నా పనిమనిషికి జీతం తక్కువ ఇచ్చి గొడ్డు చాకిరీ చేయించుకుంటున్నానట. అంతగా బాధగా ఉంటే ఆ ఇవ్వవలిసినదేదో తననే ఇవ్వమన్నా. నాకేమన్నా ఇంటివెనుక డబ్బులుకాసే చెట్లున్నాయా?"

"నిజమే మరి"

"విన్నావా? నూకల రాజు గారు సొంత డబ్బుతో ఆసుపత్రి కట్టిస్తున్నారట. నిన్ననే ఇంజనీర్లనీ అదీ తీసుకొచ్చి స్థలం చూపించారట నమూనాలు గీయడం కోసం."

"ఆ విన్నాలే. ఇంట్లో నల్లధనం బోల్డంత మూలుగుతూ ఉంటే ఆసుపత్రి ఒకటేమిటి, వంద కట్టించగలను నేనూను."

"అదేమిటోయ్, అలా అంటావు! ఆయన నేనెరిగున్న దగ్గర్నుంచీ అడిగిన వాళ్ళ అందరికి లేదనక తనకు తగినట్లుగా సాయం చేస్తుండేవాళ్ళు. మన ఊళ్ళో ఆసుపత్రి అన్నది లేక ఎంతమంది బాధపడుతున్నారు. డబ్బున్న మారాజు లెంతమంది లేరు, వాళ్ళందరూ చేస్తున్నారా ఇలాంటి పనులు?"

"అవును మరి. పాపం చేసిన వాడికే గదా పుణ్యం కావలసి వొస్తే"

"ఎంత ధైర్యముండబట్టి ఈ పని చేయగలిగాడు? ఏమైనా మన నారాయణ గుండెలుదీసిన బంటే. సరాసరి

ఆఫీసరు గారి అమ్మాయికే వల వేశాడనమాట"

"అయినా, ఆయనకైనా బుద్దుండక్కరలేదా? కులం తక్కువ వాడిని అల్లుడుగా అంగీకరించడానికి"

"పాపం, ఆయన మాత్రమేం చేస్తాడు. అయిదుగురు కూతుర్లయిపోతిరి. అయిదు కుంపట్లు మరి. చచ్చేలోగా పెళ్ళంటూ చేయాలి గదా. నారాయణేమో కట్నం తీసుకోకుండా చేసుకొంటాన్నాడట"

"నిజమా, పెద్దగా ఆస్థి అదీ ఏమీలేదు, వీడికెందుకో ఈ ఆదర్శాలు? వాళ్ళ కులంలో అయితే బాగానే ముట్టి ఉండేది ఇతనికి"

"కోమలి ఎంత అందంగా ఉంటుంది. చూసావుగా మొన్న వనభోజనాలప్పుడు. అంత అందంకోసం కొంత డబ్బు వొదులుకొంటేనేం?"

"అందమేం చేసుకొంటాం? కొరుక్కు తింటామా? అయినా ఇదంతా అందం కోసమేనా లేక నారాయణకి నిజంగా పెళ్ళయే సూచనలేమీ లేక ఇలాంటి ఆలోచన చేశాడా? ఇతగాడి లాంటి పర్సనాలిటి, ఉద్యోగం ఉన్న వాళ్ళని వాళ్ళ కులస్థుల్లో అంత తొందరగా ఎవరొదులుకుంటారు, ఏవైనా సమస్యలు గట్రా లేకపోతే? ఈ పాటికి కోమలిని తలదన్నే అందమైన పిల్లే వచ్చుండేది వీడు కావాలనుకునుంటే."

ఇదేనా సంఘమంటే? ఒక ఆలోచనా, అర్థమూ లేని సంభాషణల పరంపర, అంతేనా? మరేం మనకింత భయం ఇలాంటి సంఘమంటే? మనమేం చేసినా సంఘం దృష్టిలో అది తప్పే. అసలు దాని కళ్ళలో ఒప్పు అన్నది ఏమిటి? తప్పొప్పులకు నిర్వచనమివ్వలేని ఆ అసంబద్ధ ధోరణి గురించి మనకెందుకింత ఆలోచన? నిరంతరం నీడల్లోంచి వినపడే గొంతుకలకు ప్రాధాన్యమిచ్చే బ్రతుకూ ఒక బ్రతుకేనా? ప్రక్కవాడు ఏమనుకొంటాడో అన్నదానికన్నా, నేనీ పనిచేస్తే ఎంతమందికి ఎలాంటి కష్టం, నష్టం వస్తుంది అన్న ఆలోచన మరింత సమంజసంగా లేదూ? అప్పుడైనా మనతో మనం నిజాయితీగా ఉండగలం, లేకపోతే ఆలోచనలని సైతం నియంత్రించే శక్తి మనమీ సంఘానికి ఆపాదిస్తాం. సొంతంగా ఆలోచించలేని మనుషుల మనుగడ ఎంతవరకూ సాధ్యం?

"చిన్నమ్మా
వీళ్ళందరూ భయపడిపోయిన మనుష్యులు
రేపటిని గురించి భయం సంఘ భయం
అజ్ఞాతంగా తమలో దాగిన తమను చూసి భయం
గతంలో కూరుకుపోయిన మనుష్యులు
గతించిన కాలపు నీడలు.

వీళ్ళందరూ సగం సగం మనుష్యులు

మరోసగం మరుగునపడిన భయస్తులు, బాధాగ్రస్తులు
చప్పబడిన నిన్నటి మాటలనే మాట్లాడుతుంటారు
కప్పబడిన నిన్నటి కలలనే తలుచుకుంటారు
హఠాత్తుగా జడుసుకుంటారు
నిటారుగా నిలబడలేరు
వీళ్ళందరూ ముక్కలైన గాజు పెంకులు"
- తిలక్ (నీడలు - అమృతం కురిసిన రాత్రి)

## ఆమె ఎవరు?

"వెన్నెల్లో తెల్ల గులాబీలు ఎలా మెరుస్తాయో ఎప్పుడైనా చూశావా,
ఇలకోళ్ళ పాటల్లో మల్లెపూలెలా నవ్వుతాయో ఎప్పుడైనా విన్నావా?
ఎక్కడినుండో నీ గొంతు నన్నెందుకిలా వెదుక్కుంటూ వస్తుంది?
అవునూ, నువ్వా పాట పాడి ఎన్నేళ్ళయింది?
వెన్నెలతో పాటూ ఎందుకిలా నా కళ్ళల్లోకి  కలల్లోకీ
నా అనుమతి లేకుండా వస్తావు? ఎవరిచ్చారీ అధికారం నీకు?
చల్లగాలితో పాటూ పాత జ్ఞాపకాల తెరలు తీసి మరీ
పలకరిస్తావు, నువ్వేమవుతావని నాకు?
నువ్వు తప్ప నా జీవితంలో అన్నీ సమాధానాలే. "

కిసుక్కుమని ఎవరో నవ్వినట్టనిపిస్తే వెనక్కి తిరిగి చూసాడతను. భుజమ్మీదుగా అతను రాసిన వాఖ్యలు చదువుతూ నవ్వు ఆపుకోడానికి అవస్థ పడుతున్న ఆమె కనిపించింది. చిలకాకుపచ్చకి నల్లంచున్న చీర కట్టుకొని, లూజుగా అల్లుకొన్న జడ వాలుగా ముందుకు వేసుకొని వయ్యారంగా నుంచుని ఉంది. నెమ్మదిగా వీస్తున్న గాలి ఆమె ముంగురులను ముద్దుగా రేపి, ఆమె తాలూకు పరిమళాన్ని మోసుకొస్తోంది. ఆ సువాసన అతనిలో ఏ మూలనో కప్పబడిపోయిన జ్ఞాపకాల్ని గజిబిజిగా వెదికి తీస్తోంది. వెన్నెల్లో నవ్వుతో మెరుస్తున్న ఆ కళ్ళలో అతనికి ప్రశాంతత నిండిన కోనేళ్ళు కనిపిస్తున్నాయి. కాటుక దిద్దిన కనుకొలుకల్లో నుండి అతనికి తెలీని ఎన్నెన్నో రహస్యాలు భయపెడుతూ తొంగి చూస్తున్నాయి.

"ఎందుకలా నవ్వుతావ్? ఇక్కడేమైనా కోతులాడుతున్నాయా?"

"అవును, నీ వెర్రి మొర్రి ఆలోచనలు కోతుల్లానే పరిగెడుతున్నాయి"

"జాగ్రత్త! మాటలు సరిగా రానీ, అసలు మరొకళ్ళు రాసుకున్న విషయాలు వాళ్ళ అనుమతి లేకుండా చదవటం తప్పు కదూ?"

"ఇంకా తప్పొప్పుల పట్టికను ఫాలో అవుతున్నావన్నమాట. బుద్ది పోనిచ్చుకున్నావు గాదు."

"ఏం ఇక్కడ నీతి, నియమాలు వర్తించవా?"

"అవన్నీ అజ్ఞానంలో బ్రతుకుతున్న వాళ్ళకు గాని, అన్నింటినీ దాటుకొని వచ్చాక వాటితో పనేముంది?"

...

"మొత్తానికి భావకుడివే. అవునూ, ఇంతకూ ఎవరేమిటి ఆ ముగ్ధమోహన? అంతగా కదిలించిందంటే ఏదో పెద్ద కథే ఉండి ఉండాలి"

"ఉండేదిలే ఒకప్పుడు, నా ప్రపంచమంతా తనై"

"అయ్యో పాపం! మరో ఫెయిలయిన స్టోరీ అనమాట"

"అవడానికి చాలా కారణాలు"

"కారణాలకి కొరవేం లేదులే గానీ, అసలు సంగతి చెప్పు. నీ కథా, కమామిషూ. కుతూహలంగా ఉందివ్వాళ"

"చాలా రోజుల తర్వాత అడగాలనిపించిందే"

"ఇక్కడకు వచ్చే వాళ్ళు కొత్తలో ఇంకా పాత జ్ఞాపకాలు పట్టుకు వేళ్ళాడ్డం సహజమే, తీరా చూస్తే జ్ఞాపకాలు పెద్ద గొప్పవిగా ఉండవు. త్వరలోనే కొత్త జీవితానికి అలవాటు పడిపోతుంటారు. కానీ నీ ధోరణి చూస్తుంటే, నీకో ప్రత్యేకమైన కథుందేమోనని అనుమానంగా ఉంది. తీగ కదిలించి చూడాలి అసలు డొంక ఎలా ఉంటుందోనని. ఎంతైనా నా బాధ్యత గదా"

"ఏం చెప్పమంటావు? నా కథా అందరి లాంటిదే. గొప్పంటూ ఉంటే అది నువ్వు దానికి ఆపాదిస్తున్నదే"

"తెలివిగానే మాట్లాడుతావ్, అందుకే కొంచం ఎక్కువ సమయం, శ్రద్ధ తీసుకొని నీకు సహాయం చెయ్యాలనుంది. సరే, నిన్నో మూడు ప్రశ్నలడుగుతా వాటికి జవాబులు చెప్పుకో చూద్దాం."

"బావుంది వరస. నేనేమైనా నీళ్ళకోసం సరోవరానికి వచ్చిన ధర్మరాజునా? నువ్విలా యక్షపశ్నలు వెయ్యడానికి"

"అలాంటిదే మరి. నువ్విక్కడనుండి బయట పడాలంటే నా సహాయం తీసుకోక తప్పదు. నేనడిగిందానికి జవాబు చెప్పకా తప్పదు"

"సరే అడుగు మరి, ఏం చేస్తాం?"

ఆమె మనోహరంగా నవ్వి, గొంతు సవరించుకొంది. ఉన్నట్టుండి పిల్లనగ్రోవి ఊదినట్లుగా అంతా సంగీతం అలుముకొంది.

ఎవరో శాసించినట్టుగా అంతవరకూ లేని మబ్బులు రెండు చంద్రుడి చుట్టూ అలుముకొని వెన్నెల కాంతిని తగ్గించాయి. ఊపిరి సలపకుండా అరుస్తున్న ఇలకోళ్ళు ఒక్కసారి కట్టకట్టుగా పాడడం పేసాయి. అతనికి కొంచంగా భయం వేసింది.

"మొదటి ప్రశ్న. అసలు ఎవరు నువ్వు?"

"చాలా క్లిష్టమైన ప్రశ్న. చాలా కాలంగా ఇదే ప్రశ్నకు సమాధానం కోసం నేనూ వెతుక్కుంటున్నా. ఇదమిద్దంగా ఇదీ అని తేల్చి చెప్పలేను ఎందుకంటే నాకు ఇంకా ఏ సమాధానమూ లభించలేదు"

"సమాధానం కంటే ముఖ్యమైనది మరొటి ఉంది. దానికోసం అన్వేషిస్తున్నప్పుడు సంపాదించుకొన్న జ్ఞానం. మరి నీ పరిశోధనలో ఇప్పటి వరకూ తేలిన విషయాల మీద ఓ నివేదిక సమర్పించుకో"

"నేనెవర్ని? అంటే.. చాలా మందిని, చాలా రకాల్ని, చాలా రూపాల్ని. మొదటనుంటీ మొదలు పెడితే, ప్రేమరాహిత్యం

అర్థంలేని వేశానికి కట్టుబడ్డవేళ, చీకటి గుహల్లోనుండి వెలుతురు నిండిన ప్రమాదపు లోయల్లోకి విసిరేయబడ్డ అణువును. గుర్తున్నప్పటినుండీ అందరికీ బరువైన అనామకుణ్ణి లేదా వద్దనుకున్నా పొంగే ఆప్యాయతలకు బలైన పసితనాన్ని. ఆలోచించే విధానాన్ని బట్టి ఇది మారుతుంది. వయసొచ్చాక కోరికలకు బానిసను, నిజం అంగీకరించలేని అసమర్థుణ్ణి, పోరాటంలో ఓడిపోయిన బలహీనుణ్ణి. వయసు మీరాక నిరాశా, నిస్పృహలతో మరీ చిన్నదై, ఇరుకైన ప్రపంచంలో నివశించే స్వార్థ పరుణ్ణి. ఇంతా చేసీ ఇసుకరేణువంత మార్పుకూడా కలిగించలేని వంధ్యుణ్ణి."

"సినికల్ అనాలో, లేక Illusion of self-grandeur అనాలో కొంచం ఆలోచించుకోనీ"

"సైకో ఎనాలసిస్ చేయబోతున్నట్టు నాతో చెప్పలేదే అయినా నా చివరి వాక్యం విన్నాక కూడా  రెండో మాటెలా అనగలవ్?"

"అక్కడే ఉంది వచ్చిన చిక్కు నీలాంటి వాళ్ళతో. అసలు మార్పు అంటే ఏమిటి, దాని వల్ల వచ్చిన ప్రయోజనం ఏమిటి?"

"ఇది నీ రెండో ప్రశ్నా?"

"పర్వాలేదు, ఖాతాలుంచుకునే అలవాటు బాగానే ఉన్నట్లుంది. సరే కానీ, ఇది నా రెండో ప్రశ్న అనే అనుకుందాం"

"మార్పుని వాంఛించడం ఎప్పుడైతే మానేస్తామో అప్పుడు ప్రగతి అన్న మాటకు అర్థంలేదు. మారుతున్న కాలంతో పాటూ మారకపోతే వచ్చేది నష్టమే"

"అలాగని వచ్చిన ప్రతి మార్పూ గొప్పదేననడం సమంజసమేనా. ఎన్ని ఉదాహరణల్లేవు?"

"నిజమే కానీ మార్పుకి భయపడితే మరిక అర్థమేముంది? పూనుకోపోతే ఇది ఎలా సాధ్యమౌతుంది? ఇంకా .."

"ఆగాగు.. కరెక్టుగా ఇదే విషయం నేను నిన్నడగాలనుకొన్నది. అసలు మొదట మార్పుకి అర్థం చెప్పలేదు నువ్వు"

"మార్పు అంటే... !, తెలిసింది. చెపుతాను. .. మార్పు అన్నది ఇప్పుడున్న దానికన్నా మరో స్థితి మాత్రమే"

"సరిగ్గా చెప్పావు. మరి నేనిప్పుడీ మాటలు మాట్లాడుతున్నప్పుడు కదిలిన గాలి అణువులు, పరమాణువులు.. ఇవన్నీ తమున్న ఇంతకు ముందు స్థితిలో లేనట్లే గదా?"

"ఏం చెప్పదల్చుకున్నావో సరిగ్గా చెప్పు"

"అలా అడిగావు బావుంది. ఈ మార్పుంది చూశావూ? అది నిరంతరం సంభవిస్తూనే ఉంటుంది. దానికై మనమేదో చేయాలని, చేశామని అనుకోవటం లో ఎంతో కొంత సొంత డబ్బా ఉందని ఇప్పుడొప్పుకుంటావా? ఈ చిన్న సమస్య గురించెప్పుడైనా ఆలోచించేవా?"

అతనేం మాట్లాడలేదు. తలొంచుకొని నిశ్శబ్దంగా ఆలోచనలో పడ్డాడు. అంగీకరించడానికి మానవ సహజమైన అహం అడ్డు వచ్చినా ఆమె చెప్పిందాంట్లో కొంచం నిజం లేకపోలేదనిపిస్తుంది. కొంచం సేపు పోయాక ఆమె ముందుకు వంగి, లాలనగా అతని భుజాలపైన తన చేతులానించి, పెదవులపైన సున్నితంగా వెచ్చగా ముద్దు పెట్టుకుంది. అతని కళ్ళముందు మిరుమిట్లుగొలిపే మెరుపు మెరిసి మాయమైనట్లుగా అనిపించింది, ఉపశాంతిగా అనిపించింది. ఇన్నాళ్ళూ అర్థం కాని దేనికోసమో పోరాడుతున్న అతనికి ఒక్కసారిగా ప్రపంచమంతా అర్థమైపోయినట్లనిపించింది.

తనకి తెలిసిన భావాలేవీ ఆ క్షణంలో అనుభవించిన దానికి వర్తించవు. అతనిలో వచ్చిన మార్పు చూసి ఆమె చిన్నగా తనలో తనే నవ్వుకుంది. అతనికిప్పుడు తను వేయబోయే ఆఖరి ప్రశ్న తట్టుకోగల శక్తి ఉందనిపించింది. ఆమెకిది మామూలే. జరిగింది అంగీకరించ గలిగే స్థితికి వచ్చే వరకూ ఎదురుచూడ్డం.

"వెళదామా?" చిత్రంగా ఆమె మాటలు వినిపించలేదుగానీ, ప్రశ్న అడిగిందని అతనికి అర్థమైంది. భాషకు అవసరం అంతటితో ఆగిపోయిందనమాట, అనుకున్నాడతను. చిన్నగా తల మాత్రం ఊపాడు అంగీకార సూచనంగా.

"అడగాల్సిన ప్రశ్నలు నీకేమైనా ఉన్నాయా?" అడిగింది అనునయంగా.

"ఏమీ గుర్తుకు రావడంలేదు. వచ్చినా ఇక వాటితో పనిలేదని అర్థం అయింది"

అతను చెబుతున్నది అర్థమైనట్టుగా కళ్ళు ఓ సారి ఆర్పి, తెరిచి, అతన్ని దగ్గరగా తీసుకొని గట్టిగా కౌగలించుకొంది. అతనికి ఒక్కసారిగా గాఢమైన నిద్ర ముంచుకొని వచ్చింది. తిరిగి తెలివి వచ్చేసరికి ఎక్కడ ఉన్నాడన్నది అతనికి అర్థం కాలేదు. ఆమె తనని ఇంకా గట్టిగా పట్టుకొనే ఉంది, అతనికి తెలుస్తోంది. చూట్టూ గాఢాంధకారం. తలమీద ఎవరో కడవళ్ళతో కుమ్మరిస్తున్నట్టుగా నీళ్ళు పడుతున్నాయి. ఎంతో ఎత్తునుండి పడుతున్న జలపాతపు హోరు తప్ప మరే శబ్దమూ అతనికి వినిపించటంలేదు. జ్ఞాననాడులన్నీ సందేశాలతో మితిమీరి ప్రవహిస్తున్నాయి. మరెప్పుడొ, మరెక్కడో ఇలాంటిదే ఒకసారి జరిగినట్టుగా అస్పష్టంగా గుర్తు. నయాగరా, విక్టోరియా, బ్రవునర్, యూంబిల్లా, ఏంజెల్.... ఏమిటా పేర్లు?

అంత శబ్దంలోనూ ఆమె గొంతతనికి స్పష్టంగా వినిపించింది.

"ఇక్కడ నుండి నువ్వు ఒక్కడివే ముందుకు వెళ్ళాలి". చిత్రంగా అతనికి భయంగా అనిపించలేదు. అక్కడనుండి ఎక్కడకు వెళ్ళాలో, ఎలా వెళ్ళాలో ఎవరూ చెప్పనవసరం లేదని అతనికి అర్థమైంది. ఆమె చేతులు మెల్లగా అతన్ని విడిచిపెట్టాయి.

"నాకో సందేహం"

"ఇందాకడిగితే ప్రశ్నలేం లేవన్నావు"

"సందేహమూ, ప్రశ్నా ఒక్కటేనా? ఏదైతేనేం పోనీలే, నాకో సమాధానం చెప్పు""

"సరే అడుగు"

"ఇంతకూ నువ్వెవరివి? ఇన్నాళ్ళూ నువ్వూ నాలానే అనుకొన్నా" జవాబు చెప్పకుండా, ఆమె నవ్విన నవ్వు హోరులో సన్నగా ప్రతిధ్వనించింది.

"ఆ ప్రశ్న నిన్ను నువ్వడిగి చూసుకో. దానికి సమాధానం నీకు తెలుసు"

అతను ఏదో చెప్పబోయాడు కానీ ఆమె అప్పటికే వెళ్ళిపోయిందని అర్థమైంది అతనికి. ఓ క్షణం ఆగి ఆలోచించి తర్వాత తనలో తను చిన్నగా నవ్వుకున్నాడు. అయితే మహిషపు లోహపు ఘంటలు, నల్లటి ముసుగు లోపలి అస్థిపంజరం ఇవన్నీ పచ్చి అబద్ధాలన్నమాట. అయినా నిజానికి, అబద్ధానికి తేడా ఏమిటో? తను వెళ్ళే చోటేమైనా జవాబు దొరుకుతుందేమో చూడాలనుకొంటూ వెళ్ళాల్సిన దారిన బయలుదేరాడతను.

# ప్రేమ లోకపు సరిహద్దులవతల?

*(చలం గారి 'ప్రేమలేఖలు' గత నెలరోజుల్నించీ నాకాపాదించిన భావావేశం, మీ అందరిలో ఉన్న ప్రేమకు అర్పించే చిరుకానుక, నా ఈ ప్రేమలేఖ. )*

ఎన్నాళ్ళయిందిరా నీకిలా ఉత్తరం రాసి? ఎన్నేళ్ళు అనాలేమో? మళ్ళీ వసంతం వచ్చింది, వస్తూ ఎప్పటిలాగే నీ జ్ఞాపకాలు వెంట తెచ్చింది. రాలే చినుకుల మధ్యలోంచి పలకరించే పువ్వుల సవ్వడుల్లో నీ నవ్వు వినపడుతుంది. కిటికీ బయట మసక వెన్నెట్లో మెరిసే నక్షత్రాల సంకలనంలో నీతో నేను చెప్పని ఊసులెన్నో రూపుదిద్దుకొంటున్నాయి. బహుశా నువ్వు మరో ప్రపంచమవతల ఇలాగే నా గురించి ఆలోచిస్తూ ఉండి ఉంటావేమో అన్న ఆశ తళుక్కున మెరిసి మాయమైపోతుంది. ఇక చేసేదేవుంది? మరో రాత్రంతా మేలుకొని దిగంతాల అవతల సందె పొద్దుల మేఘాలపై పొగమంచు దీపాలు వెలిగించి, నీకు నా ఊపిరి నీరాజనాలర్పిస్తుంటాను.

నీకోసం నేను రాసుకొన్న 'పోస్టు చేయని' ఉత్తరాల కట్ట తీస్తే ఎప్పుడో రాసుకొన్న ఈ పేరా కనపడింది.

'నువ్వు దగ్గరుంటే నాకు ప్రపంచమంతా నాతోనే ఉన్నట్లనిపిస్తుంది. ఇంకేమీ అక్కరలేదనిపిస్తుంది. నువ్వు లేనప్పుడు, మదిలో నీ జ్ఞాపకం మెదిలినప్పుడు నాకో కొత్త ఉత్సాహం వస్తుంది. నువ్వు లేవన్న దిగులు ఉండదు. మరోసారి, మరోచోట, మరెక్కడో మళ్ళీ నిన్ను కలుసుకుంటాననే నమ్మకం మాత్రమే ఉంటుంది. ఆ నమ్మకం నాకు ఆనందాన్నిస్తుంది. నువ్వు నాలో ఒక భాగంగా.. ఊహూ..కాదు.. నువ్వు నాలో భాగానివి కాదు. నువ్వు నేనే. నువ్వంటూ లేనప్పుడు నాకు అర్థం లేదు. కానీ నువ్వు నాకే సొంతం కావాలన్న స్వార్థం లేదు'.

నిజమే, నువ్వు లేవన్న దిగుల్ని మించి మరేదో ఉంటుంది. కానీ నీకు తెలుసా నీ గురించి నేను పడ్డ బాధ? మనసేమో వెళ్ళనీదు. ఇంగితమేమో ఉండనీదు. నీ జ్ఞాపకాల వీధుల్లో దిక్కులు సైతం మరచి తిరుగాడిన ఒంటరి క్షణాలెన్నో. నీ చుట్టూ నేనల్లుకొన్న వలపుల ఇంద్రధనసులు, నా కలల మైదానాల నీతో కలసి నడచిన నదీ సైకత తీరాలు, నిద్రలేని శరద్రాత్రులూ.. నేను వద్దని అంగీకరించని నీ ఉనికివైపు ఏదో శక్తి నన్ను ఎప్పుడూ తరుముతూనే ఉంటుంది. నీ ప్రత్యేకతని ఎందుకూ కావాలని గుర్తించక పోవడం? నువ్వంటూ లేకపోతే అందరూ అర్థమయ్యే వాళ్ళు నాకు. కానీ నువ్వు వస్తావ్. నాకు తెలిసిన విశ్వం అస్తిత్వం కోల్పోతుంది. ఎందుకిలా కావాలి? నువ్వు నిజమెందుకవాలి? నిన్ను పోగొట్టుకొని నేనెందుకు ఓడిపోవాలి? లేక ఇదీ ఒకరకమైన గెలుపా?

ఇంతా చేసి నీమీద కేవలం మోజో లేక ప్రేమో మాత్రమే అనుకునేవ్.. అంతకు మించిన భావమేదో ఉంటుంది. దాని శక్తి సృష్టికి మూల కారణం. అనాచ్ఛాదితమైన, ఏ నటనలూ లేని హృదయాల్లోంచి పుట్టుకొచ్చే కోరిక, ఏదో తెలీని జిజ్ఞాస, మన ఉనికిని అర్థం చేసుకొని, మనం వచ్చిన చోటులోకి తిరిగి కలిసిపోవాలన్న గాఢమైన వాంఛ ఎలా చెప్పాలో అసలు తెలీదు.. ఇంతటికీ మూల కారణం నువ్వే ఎందుకో? దానికి సమాధానం గొప్ప గొప్ప కవులకే తెలీదే చలమంతటి వాడే దాన్ని సింపుల్‌గా చార్మని వదిలేస్తాడు.. Carl Jung calls the concept Anima/Animus. మరి సుబ్బారావంటాడు చూడు ఎంకి గురించి 'కళ్ళెత్తితే సాలు కనకాబిసేకాలు', అలాగన్నమాట. ఏమరపాటుగా ఏదో ఆలోచిస్తున్న క్షణం ఆ చూపు చప్పుడు చేయక గుండె లోతుల్లో దూరి అల్లరి పెడుతుంది. వెన్నెల కోనల్లో చల్లని వానలు కురిపిస్తుంది. మిణుగురు కాంతుల తూణీరాల్ని సంధిస్తుంది. కౌగిట్లో కైవల్యాన్ని ప్రసాదిస్తుంది.. అదే ఆ

లక్షణమే ప్రాణాలు తీసేది...

చలంలాగా అనుకొంటాను అప్పుడప్పుడూ, ఈ లోకంలో నాకు తప్ప ఎవరకీ గొప్పగా ప్రేమించడం తెలీదేమోనని. ఇదీ మానవ సహజమైన అహంభావం మాత్రమే నంటావా? ఏమో? పక్కన కంప్యూటర్‌లో మధురంగా 'ప్రియే చారుశీలే' పాట వస్తుంది. ఎంత అద్భుతంగా రాశాడంటావ్? జయదేవుడి అష్టపదులంతటి రమణీయమైన శృంగారం మరెక్కడా లేదే? అవునూ, నిజంగా రాధకూ, కృష్ణుడికీ మధ్య అంత అందమైన ప్రేమ సాధ్యమేనంటావా? లేక మనిషి తను ఎప్పటికీ పొందలేని ఆ అనుభవాన్ని అలా ఐడియలైజ్ చేశాడంటావా? మరి రుక్మిణి , సత్యభామల మాటేమిటో? అవు్నా, జీవితంలో ఒక్కే ప్రేమ అసాధ్యం కదా? ఒకసారి మండువేసవిలో మల్లెపూల లాంటి ప్రేమని అనుభవిస్తే, మరోసారి వర్షాకాలపు సాయంత్రం జాజితీవె మీద పడే చిరుజల్లులాంటి ప్రేమ.. మరోటి వెన్నెల మరకల్లో వన్నెల గోదావరి లాంటిది. జీవితంలో ఒకటికంటే ఎక్కువసార్లే పడతాం ప్రేమలో.. కానీ రాధాకృష్ణుల ప్రేమలాంటి ఘట్టం ప్రతి హృదయంలో ఉంటుంది. అదిగో అదే నన్ను మళ్ళీ, మళ్ళీ ఇలా వెనక్కు లాక్కు వచ్చేది. నిజమే ఆ అర్థం కాని, అసంభవమైన ప్రేమే రాధామాధవం. అవునూ, రాధామాధవం పూలు తెలుసా నీకు? చిన్నప్పుడు అమ్మమ్మ వాళ్ళింటి పక్కన ఉండేవి. సునీత, నేను వాటితో దండలల్లే వాళ్ళం పచ్చ గన్నేరు పూలతో కలిపి.. అయినా ఇప్పుడా విషయం ఎందుకు గుర్తు వచ్చిందో? నీతో వచ్చిన సమస్య ఇదే, నీతో మాట్లాడుతుంటే ఎక్కడ మొదలయ్యి, ఎక్కడ అంతమౌతాయో తెలియవు ఆలోచనలు. ఇంతకూ రాధామాధవం పూలు చూడ్డానికి భలే నాజూగ్గా, అందంగా, సన్నని పరిమళంతో ఉంటాయి. అంతటి అద్భుతమైన పూలకు ఆ పేరు పెట్టడం ఎంత తగినట్లుగా ఉంది.

ఎప్పుడైనా చెప్పానా నీకు? మురళీ క్రిష్ణ, వేణుమాధవ్ అన్న పేర్లంటే నాకు చాలా ఇష్టమని? ఒక మురళీ క్రిష్ణ ఓ సారి పరిచయమయ్యాడు . అందంగా పెదిమ క్రిందుగా గడ్డం మీద పుట్టుమచ్చతో సహా బాగుండేవాడు. ఏమైపోయాడో, కాలగర్భంలో కలిసి? అసలెక్కడ పరిచయమో కూడా గుర్తులేనంత అనామకుడన్నమాట. మరింక వేణుమాధవ్ లెక్కడా దొరకలేదు. బోల్డంతమంది మంది వేణులూ, కొందరు మాధవ్‌లే.. ఎందుకో మరి ఆ పేరుకీ, అమరమైన ప్రేమకీ లంకెగా తోస్తుంది.. ఎవరో అన్నారు మొన్నెప్పుడో. ప్రేమలో విరహం అనుభవించే వాళ్ళ బాధ, దేవునికై తపించే భక్తుని వేదనతో పోలిందని.. అందుకే 'గీతాంజలి' అంత మధురమైంది. అంతటి ఉన్నతమైన ప్రేమని అర్థం చేసుకోగల శక్తి ఉంటే ఆ దేవుడికే ఉంటుందేమో. (దేవుడంటే ఇక్కడ మన ఆశలన్నీ కలగలుపుకొని సృష్టించుకొన్న ఒక ఎంటిటీ అనే. అదిగో, నవ్వుకుంటున్నావా, నా నాస్తికత్వం రుజువు చేసుకోవాలన్న తపన గురించి?). అందుకే గోదాదేవి, మీరాల ప్రేమలు అద్భుతాలయ్యాయి మనకు. అంతటి ప్రేమను మరే వ్యక్తిమీదో కేంద్రీకరిస్తే లోకం నవ్విపోయేదేమో? తిరిగి మళ్ళీ అర్థం కాని ఆ ఆవేదనల కొలిమి క్రిందకే వచ్చినట్టున్నాం?

కానీ ఇంతా తెలిసి ఇంకా ఈ విచిత్ర భావనల్లో కొట్టుకు పోయేవాళ్ళుంటావు చూశావూ? వాళ్ళంటే నాకెంత ఇష్టమో తెలుసా? 'తెలిసీ వలచీ, విలపించుటలో..' అంటాడు చూడు ఆత్రేయ.. అలాగన్నమాట. మొన్న 'కి-' తో మాట్లాడుతుంటే ఇలా అన్నాడు. 'అన్నింటికీ లాజిక్ తో ఆలోచించి, స్పందన కోల్పోతే జీవితానికి అర్థమేముంది?'. ఇలా ఆలోచనలు, కారణాలు అన్నీ మానేసి, నేనిలా నీ గురించి ఊహల్లో పడిపోవటం, నీ జ్ఞాపకాలు నా కలానికి మళ్ళీ ఊపిరి పొయ్యటం.. ఇదంతా.. నన్ను మళ్ళీ నేను కనుక్కున్నట్టయింది.. థాంక్స్!

✷✷✷

# చరిత్రలో ప్రపంచ నాయకుల స్థానం

గత కొద్ది మాసాలుగా టెలివిజన్‌లో ఏ చానెల్ పెట్టినా, లేక ఏ వార్తా పత్రిక తిరగేసినా హిల్లరీ, ఒబామా గురించి తప్ప మరే విషయం కనపడడం లేదు. కానీ అప్పుడప్పుడూ నాకనిపిస్తుంది, మరో నాయకుణ్ణి లేదా నాయకురాల్ని ఎన్నుకోబోయే ముందు, గత ఎనిమిదేళ్ళుగా ప్రపంచంలో ఏకైక అగ్రరాజ్యాన్ని పరిపాలించిన నాయకుణ్ణి, అతని అనుచరుల్నీ, వాళ్ళ రాజకీయాల్ని నిశితంగా పరిశీలించ వలసిన అవసరం మనకు లేదా అని? మానవ సమాజం పరిపూర్ణంగా విజయవంతమైన పరిపాలనా విధానాన్ని ఇంకా కనిపెట్టలేకపోయింది. ప్రజాస్వామ్యం మాత్రమే కొంత ఆటుపోట్లను తట్టుకొని నిలబడ గలుగుతోంది. మరి అలాంటప్పుడు మన అనుభవాల్నుంచి నేర్చుకోవాల్సిన అవసరం మనకు చాలా ఉంది. ఇలాంటి సమాజ పరమైన బాధ్యత జర్నలిస్టులకీ, పత్రికలకీ లేదంటారా?

ఈ దేశంలో మీడియా గురించి మనకు తెలీదేముంది? ప్రజలకి ఆ నిముషంలో దేని గురించి ఆలోచించాలో, ఎలా, ఏమని  ఆలోచించాలో కూడా చెప్పే హక్కు తమకుందని భావించే వీళ్ళ గురించి పెద్ద చెప్పుకోవలసినదేం లేదు. కాని ఒక్క విషయం మాత్రం నాకు చాలా ఆశ్చర్యంగా ఉంటుంది, అది మన జ్ఞాపకాలు ఎంత తొందరగా మందగిస్తాయో అన్నది. ఉదాహరణకు ఇరాక్ విషయమే తీసుకుందాం. ఈ ఎన్నికల ప్రచారం ముందు కొంతలో కొంత నిజమైన వార్తలు ఇరాక్ నుంచి రాసాగాయి, వాటి గురించి చాలామంది అమెరికన్ ప్రజలు స్పందించి కొన్ని మార్పులు తేవాలన్న పట్టు పట్టారు. కొద్ది నెలల్లోనే ఆ విషయం ఎంతగా మరుగున పడిపోయిందంటే, ఇప్పుడు ఇరాక్ అన్న దేశమొకటుందని, అక్కడ యుద్ధమింకా కొనసాగుతూనే ఉందని పనిగట్టుకొని గుర్తు చేసుకోవాలసి వస్తుంది. మరి అలాంటప్పుడు ఈ పత్రికల వాళ్ళమీదా, టీ.వీ స్టేషన్ల మీద ఆధారపడక బాధ్యత గలిగిన పౌరులుగా దిగిపోతున్న నాయకులను వారిని పరీక్షించటం మనమీదే ఉంది.

సహజంగానే చరిత్ర దయగలిగింది అనడంలో పెద్ద అతిశయోక్తి లేదని మీరూ ఒప్పుకొంటారు. ఉదాహరణకి బిల్ క్లింటన్ విషయమే తీసుకొందాం. అమెరికా గతకొద్ది దశాబ్దాల తర్వాత ఎన్నుకొన్న సమర్థవంతమైన నాయకుడిగా అతన్ని పరిగణిస్తారు. కానీ అతని రాజకీయ వైఫల్యాలు ఎంతమందికి గుర్తు ఉన్నాయి? దేశ ఆర్థిక పరిస్తితి , దాని అభివృద్ధి మాత్రమే మనందరికీ గుర్తుంది. కానీ పది లక్షల రువాండా ప్రాణాలు అతని చేతుల మీదుగా పోయాయే? ఒక నేరం చేయడం ఎంత దారుణమో, ఆ నేరాన్ని ఆపగలిగే పరిస్థితిలో ఉండికూడా చూస్తూ ఊరుకోవడమూ అంతే దారుణం కాదా? మొగదీషులో జరిగిన సంఘటనలో అమెరికన్ సైనికులు ప్రాణాలు కోల్పోవటం ఈ నిర్ణయానికి కారణం అని అతను తనని సమర్థించుకొంటాడు తన పుస్తకంలో. కానీ హ్యూమన్ రైట్స్ రిపోర్ట్‌లో రాసి ఉంది. అతను ఈ విషయం గురించి ఆలోచిస్తున్నప్పుడు అడిగిన ప్రశ్న ఇదట : "ఈ విషయం గురించి మన బ్లాక్ సెనేటర్స్ ఏం అంటున్నారు?". అంటే ఈ విషయం కేవలం పాపులారిటీ క్యాంపైన్ గానే భావించాడన్నది నిజం. ఈ విషయం మనలో ఎంతమందికి తెలుసు? తెలిసీ అతన్ని ఇంకా ఆరాధిస్తున్నామా? మరి అలాగే బుష్, అతని అనుచరులు ఇరాక్, ఆఫ్ఘనిస్తాన్‌లో మరణాలకే కాక దర్ఫూర్ మరణాలకూ కారకులే. అసలు ప్రశ్న ఏంటంటే మరో పది సంవత్సరాల తర్వాత కూడా ఇలాగే అనుకుంటామా లేక బుష్ గురించీ ఇలాగే పోల్చుకొని మంచివాడని తృప్తి పడతామా? నాకు మాత్రం బుష్ చరిత్రలో ప్రపంచంలో చాలా దేశాల్లో దరిద్రాన్ని, ఆకలి చావుల్నీ పెంచిన నాయకుడిగా మిగిలిపోవాలన్న

వాదన న్యాయంగా అనిపిస్తుంది. మరి మీ అందరు కూడా వీళ్ళని దగ్గరగా పరిశీలించి వాళ్ళ చేతలకి వాళ్ళని బాధ్యులుగా గుర్తుంచుకుంటారని నా నమ్మకం.

# ఆలోచనా విప్లవం

"ఏం ఈ మధ్య బొత్తిగా నల్లపూసై పోయావు. ఎక్కడికైనా వెళ్ళావా?" అన్న ప్రశ్నతో హఠాత్తుగా ఈలోకం లోకి వచ్చి పడ్డాను. తలతిప్పి చూస్తే చిరకాల మిత్రుడు సురేష్ పలకరింపుగా చిరునవ్వుతో నిలుచుని ఉన్నాడు. ఇద్దరం ఆఫీసుల్లో ఎవరి ఉద్యోగం వాళ్ళు వెలగబెట్టాక ఇలా  పార్కులో కలుసుకొని అనేక విషయాల మీద పిచ్చాపాటీ మాట్లాడుకోవడం మామూలే. చిన్నప్పటినుండీ పరిచయం కనుక మా ఇద్దరి మధ్యా మొహమాటాలకు తావు లేకపోవడంతో ఈ చర్చలు చాలా ఆసక్తి కరంగా సాగుతాయి. అందులోనూ ఒకే విషయాన్ని మేమిద్దరం వేర్వేరు కోణాల్లోంచి చూడ్డం, కారణాలు విశ్లేషించడం వలన కొన్నిసార్లు మా సంభాషణలు చాలా సరదాగా ఉంటాయి. అందుకే మేమిద్దరం తరచుగా కలుస్తూ ఉంటాం. అలాంటిది గత నాలుగు వారాలుగా నా ఆఫీసుకు సంబంధించిన ప్రయాణంతో వాడిని చూట్టానికి పడలేదు.

"ఆఫీసు పనిమీద శ్రీశైలం వెళ్ళాను. అక్కడ జరుగుతున్న పనికి కావలసిన ఇంజనీరింగ్ డిజైన్స్ కొన్ని దగ్గరుండి చేయవలసి వచ్చింది. నిన్ననే తిరిగి రావటం"

"అబ్బో, నల్లమల అడువుల్లో సంచరించి వచ్చావన్న మాట. పరవాలేదే, నీ ధైర్యానికి మెచ్చుకోవచ్చు. ఇంతకీ ఎవరైనా అన్నల్ని కలిసి వచ్చావా?"

"అలాంటిదే, కాబోయే అన్ననొకతన్ని కలిసాను"

"ఏమంటాడేమిటి? నన్నడిగితే ఇదో పెద్ద బూటకం అంటాను. పనీ పాటా వొళ్ళు దగ్గర పెట్టుకొని చేయడానికి బద్ధకమైన వాళ్ళందరూ ఇలాంటి వ్యాపకాలు పెట్టుకొంటారు, అమాయక ప్రాణాల్ని బలిగొంటారు"

"ఈ సమస్య నువ్వనేంత తేలికైనది కాదని, విప్లవాన్నాశించే ప్రతి ఒక్కరూ తీవ్రవాది కాదనీ నేనంటాను. ఉద్యమ పోరాటం చాలా రకాలుగా జరుగుతూ ఉండొచ్చు, అన్నింటి గురించీ మనం వినం కదా, కేవలం చెడు గురించి మాత్రమే వింటాం"

"సరే అలాగే అనుకొందాం. వీళ్ళేదో సాధించాలనే ఈ ఉద్యమం సాగిస్తున్నారనుకొందాం. గత కొన్ని దశాబ్దాలుగా పోరాడుతున్నారు.. ఏం సాధించారేం వీళ్ళు? ఎవరో ఒకరిద్దరు ప్రముఖ నాయకుల్ని చంపటం కాక?"

"అంతకన్నా మొదటికి వద్దాం. ఏదైనా ఉద్యమాన్నే తీసుకుందాం. అసలు ఉద్యమం అన్నది ఎలా మొదలౌతుంది. సమాజంలో మార్పు తేవాలన్న గాఢమైన కోరిక ఉన్న ప్రజలంతా కలసికట్టుగా ఆలోచన చేసినప్పుడు రూపుదిద్దుకొనే ఆశయాలు, ఉద్దేశ్యాలు , వాటిని సాధించడానికి చేయవలసిన పనులు ఓ ఉద్యమంగా పరిగణిస్తాయి. మరి ఈ ఉద్యమం వెనుక ఉన్న ప్రజల్ని మాట్లాడించి వారి ఆలోచనా విధానాన్ని అర్థం చేసుకోవలసిన బాధ్యత సమాజం మీద

ఉంది."

"కరెక్టుగా చెప్పావు. అక్కడికే వస్తున్నా. సరే మూలకారణం తీసుకొందాం. అసలు వీళ్ళకు కావలసిందేమిటి? ఇంకా సమ సమాజ మంత్రాన్నే వల్లెవేస్తున్నారా? ఉద్యమం అన్నది సమాజం యొక్క కలసికట్టు ఆలోచనే అయితే, కాలక్రమేణా ఆ ఉద్యమ సిద్ధాంతాలూ రూపాంతరం చెందాలి కదా? కానీ వీళ్ళ వ్యవహారం చూస్తుంటే పాత చింతకాయ పచ్చడిలా ఉంది. ఓ పక్క దేశమంతా ప్రపంచీకరణతో ప్రగతి సాధిస్తోంటే, ఇంకా కార్ల్ మార్క్ , మావో చెప్పిన వేదాల్ని వల్లె వేస్తామంటే ఎలా? చరిత్రలో ఉదాహరణల్లేవా? ఇలాంటి సిద్ధాంతాలు ఆచరణలో పెట్టాలంటే నియంతృత్వ పరిపాలన ద్వారానే సాధ్యం. డార్విన్ పరిణామ సిద్ధాంతం ప్రకారం మనిషి, లేక సృష్టిలో ఏ జంతువైనా స్వతహాగా స్వార్థపరుడు, అలాంటిది సమ సమాజం అన్నది ప్రకృతి ధర్మాన్ని పోరాడ్డం కాదా? "

"ఓ విషయం మర్చిపోతున్నావు. మనిషి సొంతగా, స్వార్థపూరితంగా తన మనుగడని ఎలా కాపాడుకొంటాడో, అంతగా సమాజాన్ని రక్షించుకోడమూ అవసరం. There is survival and then there is group survival. So you can't really dismiss any influential ideas . అయినా వీళ్ళలో ఎవరినైనా ఎప్పుడైనా కలసి మాట్లాడావా? లేక పత్రికలు, ప్రభుత్వం చెప్పిన విషయాలు విని ఈ నిర్ణయానికి వచ్చావా? "

"సరే నువ్వు మాట్లాడానానంటున్నావుగా, చెప్పు వీళ్ళకి ఏం కావాలో, కష్టపడకుండా వచ్చిన ఆస్తులు తప్ప"

"నాకర్థమైనంత వరకూ సమాజం తన సభ్యులందరికీ సమాన అవకాశాలు కల్పించే బాధ్యతను స్వీకరించాలన్నది అన్నది వీళ్ళ ఆశయం"

"అంటే, ఎవరెంత కష్టపడుతున్నారన్నది లెక్కచేయక అందర్నీ ఒకేలాగే చూడాలనా?"

"అదిగో మళ్ళీ మొదటి వాదనలోకే దిగుతున్నావు, నేనేం చెప్పానన్నది గమనించక"

"సరే మరి, అర్థమయ్యేట్టుగా నువ్వే చెప్పు"

"ఉదాహరణకి, ఒక రోజూ వారీ కార్మికుణ్ణి, ఒక ఇంజనీరునీ తీసుకొందాం. వాళ్ళ ఇరువురి సంతానానికి అర్థవంతమైన జీవితం ఏర్పరుచుకోనే హక్కులు సమానంగా ఉండాలి, న్యాయమేనంటావా? "

"వినడానికి బానే ఉంది. దానికోసమే కదా ఉచిత విద్యా, భోజన సౌకర్యాలు కల్పిస్తున్నాం, అంతకు మించి మరే అవకాశాలు కల్పించాలంటావ్?"

"నిజమే, ఉచిత విద్యా, వసతి సౌకర్యాలు కల్పిస్తున్న మాట నిజమే. అంతటితో సరి పోయిందా? అవి ఎవరికైనా ఉపయోగపడుతున్నాయా అని పరిశీలించవలసిన బాధ్యత ఓ పరిణతి చెందిన సమాజానికి లేదా? "

"అంటే మరి ప్రభుత్వం రోజూ కార్మికుల ఇళ్ళకు వెళ్ళి వాళ్ళ సంతానాన్ని బడికి పంపించాలంటావా? ప్రజల జీవితాల్లో అంత ప్రమేయం ఉన్న ప్రభుత్వం ప్రజాస్వామ్యం ఎలా అవుతుంది? "

"అంతకు మించి ఆలోచించటంలో ఉంది అసలు సమాధానం. ఒక తల్లి కానీ తండ్రి కానీ తమ సంతానాన్ని బడికి పంపించటం లేదంటే దాని వెనుక ఏదో బలమైన కారణం ఉండి ఉండొచ్చు. ఆ పిల్లో, పిల్లవాడో తనవంతు కష్టం చేస్తేనే పూట గడవ వచ్చు. అలాంటి కుటుంబాలకు ఎలాగైనా సహాయం అందిస్తే వారి సంతానం చదువుకో గల్గుతుంది. ఇలాంటి సమాన అవకాశాల్నుంచి ఎదిగిన మనసుల్లో అసమానతలు కాలక్రమేణా రూపుమాసిపోతాయని , వృత్తులని బట్టి మనమేర్పరుచుకున్న కుల వ్యవస్థ కూలిపోడానికిది దోహదం చేస్తుందనీ ఆశపడ్డంలో నాకేం తప్పు కనిపించడం లేదు. "

"అంటే నువ్వు చెప్పే ప్రకారం భావి భారత పౌరుల బవిష్యత్తు తమ తల్లిదండ్రుల ఆర్థిక పరిస్తితి వలన కాక తమకై తాము తీసుకొన్న నిర్ణయాల వల్ల నిర్దేశించుకొనే హక్కు కల్పించడమన్నమాట. ఇదేదో బానే ఉందే అలాంటప్పుడు, రిక్షావాలా కొడుకు రిక్షానే తొక్కనవసరం లేకుండా అన్నమాట. మరి ఇది ఇక్కడితో ఆగుతుందా లేక సమాజం వ్యక్తి తరఫున మరిన్ని బాధ్యతలు స్వీకరించాలా? ఉచిత వైద్యం, శిశుపాలనా, ఇలాంటివన్నీ?"

"ఇది చాలా ముఖ్యమైన ప్రశ్న వ్యక్తిగత బాధ్యతకూ, సమాజ బాధ్యతకు ఎక్కడ విభజన సాధ్యమౌతుందన్నది ఆయా సమాజాల్ని బట్టి, వాటి ప్రజానీకాన్ని బట్టి ఉంటుంది. ఉదాహరణకి, స్కాండినేవియా దేశాల్ని తీసుకొందాం. సోషలిస్టు రిఫార్మ్డ్ సమాజాలుగా ఇవి చాలా పరిణతి చెందాయి. సమాజం చాలా వరకు వ్యక్తిగత సంరక్షణా బాధ్యతల్ని నిర్వర్తిస్తుంది. కానీ ఇవి చిన్న సంవృద్ధికరమైన దేశాలవడంతో ఇది సాధ్యమౌతుంది. అలాగే అమెరికా దేశాన్ని తీసుకుందాం. వారి సమాజపు ఆలోచనా విధానం ప్రకారం, వ్యక్తి గత స్వాతంత్రం, బాధ్యత చాలా ముఖ్యమైన విషయాలుగా పరిగణించ బడతాయి. అందువల్లనే అంత అభివృద్ధి చెందిన దేశమైనా ఇంకా అక్కడ ఉచిత వైద్య సదుపాయం లేదు. కానీ భారతదేశం లాంటి సమాజంలో ఈ రెండు పద్ధతులూ అసాధ్యం. మన సమాజానికి, మన సంస్కృతికి తగినట్టుగా మనందరం కలసి ఆలోచించి ఓ నిర్ణయం తీసుకోవడం ఎంతైనా అవసరం. కాదంటావా?"

"అంటే మనకు నిజంగా కావలసింది మన ఆలోచనల్లో రావలసిన విప్లవం కానీ, ప్రభుత్వాన్ని కూలదోసి సమాజాన్ని తిరిగి నిర్మించాలని నినాదించే హింసాత్మక విప్లవం కాదంటావా?" లేచి టీ కొట్టుకేసి నడుస్తూ అడుగుతున్నాడు సురేష్.

# ఆడతనం





తొలి ఉషస్సు జ్వలించే సుదూర తీరాలు ఆ కళ్ళల్లో ఘనీభవించాయి
కాలాన్ని శాశించే శక్తులేవో ఆమె మౌనపు నీడల్లో దాగున్నాయి
సృష్టికి ముందటి జ్ఞానం ఆ పెదవి వంపుల్లో మత్తుగా మెరుస్తుంది
కనుకొలకుల్లో చెదిరే క్షణాలు కరిగి ఇసుక రేణువులౌతున్నాయి
ఆమె కలలు మోనె చిత్రంలో తామరపూలై వింతగా కవ్విస్తున్నాయి
ఆశలు మేఘాల దొంతరల మధ్య పలకరించే పర్వత శ్రేణులౌతున్నాయి
లోర్క కవితలు శీతాకోక చిలుకల చీరలు కప్పుకొని నవ్వుతున్నాయి
మాగ్నోలియా రేకుల్లా విచ్చుకున్న హృదయం చీకట్లో జారిపోయింది
అంతర్గత సంఘర్షణలు నిర్లిప్తంగా మొదటి పాట పాడుతున్నాయి
నెరూడ, నింగి అంచుల్లో నిలబడి సముద్రపు లోతును కొలిచే ప్రయత్నం
గాలిమరల ప్రార్థనలను పెడచెవిన పెట్టలేక పోకచెక్కయిన సాంచో
ద్వీపాల దిగువన అందాలన్నీ అద్భుతంగా పొదుపుకుంటున్న గోగాన్
తళుకు బెళుకుల సోయగాల్నుంచి పారిపోయి ప్రకృతిలో దాక్కున్న హూగో
అందర్నీ, వీళ్ళందరినీ
శుక్ల పక్షపు నీడలాంటి ఆమె పరిపూర్ణ స్త్రీత్వం మానవత్వాన్ని
భయపెడుతోంది
ఆమె అంగీకారం అగ్నిపర్వతం, తిరస్కారమో తమోవనం, మరి ఆమె?!
ఎవరామె? ఎక్కడిది, ఎప్పటిది, ఎలాంటిది? చెలియా, చెలియలా?
విశ్వాంతరపు పొరల్లోంచి చలించే దారాల మధ్య ఇరుక్కుపోయిన
సమీకరణం లాంటి ఆమెను అర్థంచేసుకోటానికి ప్రయత్నించకు.
అంత సులభంగా అర్థం కాలేదు!

***

## ఇల్లు

"ఇండియా ప్రయాణం ఎప్పుడు?" స్నేహితురాలి పలకరింపుతో ఊహా ప్రపంచంలోంచి బయటపడ్డాను.

"ఇంకో వారంలో. అంతలో ఇదిగో పనులన్నీ ఓ కొలిక్కి తీసుకురావడం పెద్ద సమస్య"

"వారంలో ఇండియాలో ఉంటావన్న మాట. ఇలా ఏదైనా ప్రయాణానికి ముందు ఎంతో ఉత్సాహంగా ఉంటుందేం? అందులోనూ మనం పుట్టి పెరిగిన దేశం వెళుతున్నప్పుడు, కదా?"

" ఆనందంతో పాటూ ఏదో సంశయమూ, సంకోచమూ వెంటాడుతుంటుది నన్నెప్పుడూ."

"అదేంటే అలా అంటావు? నాకైతే తెలుసా, ఒక నెల ముందరి నుండీ జ్ఞాపకాలు, కలల మధ్య మా ఊరు నాతో మాట్లాడ్డం మొదలు పెడుతుంది. వసంతం, వేపపూలు, కమ్ముకొచ్చే మేఘాలు, వర్షం వెలిసిన తర్వాత తాకే మెత్తని సూర్యకాంతి, సాయంకాలం వాకిట్లో చల్లిన నీళ్ళకి భూమి పొరల్లోంచి ఉబికి వచ్చే కమ్మని మట్టి వాసన, అద్భుతమైన రంగులతో క్షితిజ రేఖని దాచేసే సూర్యాస్తమయం. అన్నింటినీ మించి.... అన్నింటినీ మించి నాకు గుర్తుకు వచ్చేదేంటో తెలుసా? అమావాస్య నాటి ఆకాశం. దాన్నిండా పరుచుకొన్న లెక్కలేనన్ని నక్షత్రాలు. నవారు మంచం మీద నడుం వాలిస్తే మారుమూల పల్లెటూళ్ళోని నీకు విశ్వం అంతా స్నేహితులే. "

"కవయిత్రి ననిపించుకున్నావ్. ఎంత అందంగా చెప్పావు. కొంచెంగా ఈర్ష్యగా కూడా ఉందే, నీ జ్ఞాపకాలు అంత మధురమైనవని"

"ఏం, అలా అంటావు? నీకేమనిపిస్తుందేం? అవును సరే, నువ్వు చెప్పు. తిరిగి మన దేశం వెళ్ళిపోవాలని నీకనిపిస్తుండదా? గతం నిన్నెప్పుడూ వెనక్కి రమ్మని పిలవదా? "

"ఈ ప్రశ్నకు సమాధానం చెప్పడం నా వల్లయే పని కాదు కానీ, వేరే ఏదైనా మాట్లాడుదాం."

"అలా అని దాటేయడం గొప్ప తెలివి అనుకుంటున్నావు. ఇవ్వాళ నిన్ను వదిలేది లేదు. చెప్పు అసలు భారత దేశం అంటే అర్థం ఏమిటి నీ జీవితంలో దాని ప్రాముఖ్యత ఎంత మాత్రం"

"భారత దేశం, దాని అర్థం. ఏమిటమ్మాయి, నన్ను నా మానాన వదిలేయక ఇలాంటి చిక్కు ప్రశ్నలెందుకు?"

"ఇన్నాళ్ళు వదిలాను కదా, ఇవ్వాళ చెప్పు. ఇండియా అనగానే నీకు ముందు ఏం గుర్తుకు వస్తుంది?"

"మేఘాలు. మిట్ట మధ్యాహ్న కాలం నాటి మేఘాలు. ఎవరో పరిగెడుతున్నారు. ఆయాసంతో వగరుస్తూ , తన ప్రాణంకోసం అన్నట్లుగా . నీడ పొడలుగా ఎండ. నీడ, ఎండ, ఆయాసం, దాహం, తిరిగి అంతా కలిపి ఓ క్లిష్టమైన సమీకరణం. కాలం వృధా చేసే మెట్ట వేదాంతం."

"నిజంగా? నిన్నర్థం చేసుకోవాలంటే మరో యుగం పడుతుంది కానీ, ఇంకా చిన్న ప్రశ్న వేస్తాను. జవాబు చెప్పు. అసలు నీకు ఇల్లు అనగానే ఏ ప్రదేశం ముందు గుర్తుకు వస్తుంది?"

"సరే, నన్నీ ప్రశ్న అడగనీ ముందు. ఇంత అందమైన జ్ఞాపకులతో అల్లుకుపోయిన ప్రదేశాన్ని వదిలి నువ్వెలా ఉండగలుగుతున్నావు? "

"దూరం ప్రేమని పెంచుతుందంటారు చూడు. అలాగన్న మాట. అసలైనా వలస పోయే పక్షుల్లాగే, విదేశాలకు వలస వచ్చే మనుషుల్లోనూ ఆ కుతూహలం, కొత్త, మేలైన జీవితం కోసమని ప్రపంచానికి అవతల వేపు ఎగిరి పోవడం సహజమే. కానీ దూరం, ఆటంకాలు, ఇబ్బందులూ, ఇవన్నీ తిరుగు ప్రయాణం కోసమే. ఎన్నో దేశాల్నుండి ఇక్కడకు వచ్చే వాళ్ళనడుగు, తిరిగి ఇంటికి వెళ్ళటమనేది, వాళ్ళ కళ్ళల్లో అనునిత్యం వెలిగే కోరిక. పుట్టిన దేశం గురించి మాట్లాడమను, ఆ కళ్ళు మూసేసి, కలలు బంధించి, ఆశలు మధించి చెబుతారు నీకు కబుర్లు. జీవితానికి ఓ అర్థాన్నిచ్చే కాంక్ష. అదే, ఆ తియ్యని భావమే నన్నిక్కడ ఉంచుతుంది. వలస పక్షి కోరిక."

"బావుంది. ఇదంతా తిరిగి వచ్చిన చోటుకే వెళ్ళాలన్న తపన అంటావు. అవును ఆలోచిస్తే మానవ సహజమే అనిపిస్తుంది."

"సరే నువ్వు చెప్పు. ఇల్లంటే నీకు ఏం గుర్తుకు వస్తుంది? "

. I have an idea that some men are born out of their due place. Accident has cast them amid certain surroundings, but they have always a nostalgia for a home they know not. They are strangers in their birthplace, and the leafy lanes they have known from childhood or the populous streets in which they have played, remain but a place of passage. They may spend their whole lives aliens among their kindred and remain aloof among the only scenes they have ever known. Perhaps it is this sense of strangeness that sends men far and wide in the search for something permanent, to which they may attach themselves. Perhaps some deep-rooted atavism urges the wanderer back to lands which his ancestors left in the dim beginnings of history. Sometimes a man hits upon a place to which he mysteriously feels that he belongs. Here is the home he sought, and he will settle amid scenes that he has never seen before, among men he has never known, as though they were familiar to him from his birth. Here at last he finds rest.

అదుగో సరిగ్గా నేనలా ఆలోచిస్తాను. ఎక్కడో పుట్టాను, ఎక్కడో పెరిగాను, మరెక్కడో బతుకుతున్నాను. ఇంతవరకూ నా అన్న ప్రదేశం నాకు తగల్లేదు. ఇంకా వెతుకుతూనే ఉన్నాను. అందుకే ఒక ప్రదేశంతో అనుబంధం ఉన్న నీలాంటి వాళ్ళని చూస్తే నాకసూయ. అంతగా, మనసంతగా నిండిపోయే, కాలం నిలిచిపోయే, నాకో అర్థాన్నిచ్చే కానీ నాకు తెలియని ఈ ప్రదేశం గురించి నా మనసు నిండా దిగులే. "

"సరిగ్గా అర్థం కాలేదు. ఒకవేళ అలాంటి ప్రదేశం తటస్థించిందే అనుకో. నీకెలా తెలుసు అదే నువ్వు వెదుకుతున్నదని? అందమా, లేక ప్రజలా మరి లేక సమాజ రీతులా? వీటిలో నీకేది ముఖ్యం? ఆలోచించావా ఎప్పుడైనా? "

"చాలా. ఇప్పటికి చాలా అందమైన ప్రదేశాలు చూశాను. అందం మనసుని కదిలిస్తుంది కానీ నాకెందుకో ఈ కదలిక పైపైన పొరల్లోంచి వస్తున్నట్లనిపిస్తుంది. మెదడులో నాడీ తంత్రుల సంచలనం తెలుస్తోంది. నా కుటుంబంలో ప్రేమలు, మానవ సహజమైన అన్ని భావాలు అనుభవించాను. వాటికై వెతుక్కోవటం లేదు. ఇక సమాజం సంగతంటావా? మనకు తగ్గ సమాజం ఇంకా ఏర్పడలేదని నాకో సంశయం. ఈ విశాల ప్రపంచంలో ఎక్కడో ఉంది నాలో సగం. దాన్ని వెతుక్కుంటున్నానుకుంటా"

"ఆగాగు. నువ్వు చెప్పేదాన్ని బట్టి చూస్తుంటే, ఇదంతా నిన్ను నువ్వు వెదుక్కొనే ప్రయత్నం లాగా ఉంది. అంటే, నువ్వు ప్రస్తుతం చేస్తున్న పని, జీవిస్తున్న జీవితం నీవి కావన్న మాట. అమ్మాయ్, నువ్వేం మాట్లాడుతున్నావో తెలుసా?"

"నీతో వచ్చిన చిక్కల్లా ఇదే. ఇలాంటి సమస్యలు అర్థమై ఛస్తాయి నీకు" నవ్వుతూ నెత్తి మీద ఓ మొట్టికాయ వేశాను దాన్ని.

"సరే, ఊహలు గుర్రాలనుకొందాం కాసేపు. అలా షికారు వెళ్ళొద్దాం పద. ఒకవేళ చెయ్యగలిగే ధైర్యమే ఉంటే ఇవన్నీ వదిలేసి ఎక్కడకు పోతావు?"

"అమేజాన్ నదీ తీరాన అడవులో, సహారా ఎడారుల మద్య గుడారాలో, హక్కిడో పర్వత శ్రేణులో ఎవరికి తెలుసు? తెలిసీ నేనింకా ఇక్కడే ఉంటానా "

✡✡✡

# అతను.

ఎవరు, అసలు ఎక్కడివాడితను? మాటల మంత్రాలు వేసి మనసున జొరబడతాడేం? చీకటిపొరల గొళ్ళాలు తీసి, ఉద్రేకాల మంటల చివర్లు రగిలించి చిరునవ్వుతో చలికాచుకొంటాడేం? గతం తాలూకూ ఆవేశాలన్నీ మూటగట్టుకు వచ్చి,
విచ్చుకొంటున్న వెలుగురేకుల వెలుతురుల మధ్య ఒక్కొక్కటే బయటకు లాగి ఊపిరి పోస్తాడేం? నరనరాన విద్యుల్లతలా పాకి, వయసు పొంగుల హుషారులో కరిగి, అవయవాల మలుపుల్లో చైతన్యార్ణవాలు చిట్లి, కనుకొలుకుల చివర్న చినుకులై రాలుతున్నాడు. ఆలోచనలు, కారణాలు చుట్టచుట్టి విశ్వానికవతల విసిరేసి, ప్రాకృతికంగా, పైశాచికంగా, నిలువెల్లా మోహమై నన్నల్లుకుపోతున్నాడు. ఎవరితను? పారదర్శక వెన్నెల పొరల్లో అనుభూతుల కుంచెలు ముంచి, నన్ను నగ్నంగా చిత్రీకరిస్తాడా? గుర్తుతెలియని సంకేతాలు రంగరించి, వెదురు పొదల్లో సరిగమల సోయగం పలికించి, నా
పాట నాకే వినిపిస్తాడా? ఎంత ధైర్యం?

అక్షరాలు....ఓహ్..అతని అక్షరాలు....అవి..
ఓ వెన్నెల రాత్రి, వర్షపుధారల్లో కరిగి  కురిసిన పున్నాగ పూలు. సన్నజాజుల మాలల్లో దాగున్న మిన్నాగులు.
గాజు ద్వీపాల ఆదమరచి నిద్దరోతున్న అత్తరు మరకలు. హృదయపు వాకిళ్ళలో ఉబికిన నెత్తుటి ఉరకలు..
యేకాంత ప్రబంధాలు, ప్రణయ రసబంధాలు, వెలుతురు లోయల్లో చిక్కని చీకటి చుక్కలు.
సెలయేటి జలపాతాలు, ఎగసిపడే అలలు, ఎర్రగా మండే లావాప్రవాహాలు, యేటిఒడ్డున తెల్లటి గవ్వలు
మేలిముసుగుల తొలి వలపు తెరలు, సిగ్గెరగని శృంగారపు ఝరులు, కారుణ్యా లాలస సంగ్రామాలు.
అవి, విషపు వీచికలు విరిసే చిలిపి కలలు... అవి, విశ్వంభర దుంధుభి నాదాలు. !

అతను..
యుగాల తరబడి పేరుకుపోయిన నిశ్శబ్ద ఏకాంత తరంగాల్ని సున్నితంగా శోధించి, నేనున్నానంటూ చెయ్యి చాస్తున్నాడు.
ఇందరి మధ్య ఇన్నాళ్ళూ, ఇసుక గూళ్ళు కట్టుకొని బద్రంగా దాచుకొన్న కలల ప్రాకారాలు ఛేధించి, అన్నీ తెలిసినట్టూ కొంటెగా నవ్వుతున్నాడు. అలల పాటల్లో, ఇసుక రేణువుల మెరుపుల్లో, మరో ప్రపంచపు అంచుల్లో...
నాకోసం , కేవలం నాకోసం ఎదురు చూస్తున్నాడు...
బంగారం.. ఐ లవ్ యూ!
అజ్ఞానపు కుదుళ్ళు కదిలించి కళ్ళు మిరిమిట్లు గొలుపుతున్నాడు. నా ప్రత్యేకతను ప్రశ్నిస్తున్నాడు..
తేలిపోయిన మేఘాల్లాంటి నా పదాల ప్రక్రియను, చీకటి మెరుపులతో భయపెడుతున్నాడు..
కధలూ, కవితలూ, భావాలు, భాష్యాలూ, పదాలు, పాదాలూ , ప్రయోగాలూ
నాకేం మిగల్చక సమస్తం తనలో కలిపేసుకుంటున్నాడు..
బాస్టర్డ్...ఐ హేట్ యూ!

****************

"గుండెలోని నెత్తురు వెన్నెలగా మారి, స్వేత ప్రోతస్వినిలా పొర్లి, పొర్లి–నీలపు నిశ్చల సుడిగుండంలా నిలిచింది. గాలి తాకిడికి వొళ్ళు, వొంపులలోంచి శతసహస్ర కంపనలై స్వీయానుబంధం లేని యిసుకరేణువుల కంబళిమీద కాంతిముద్దలా ప్రజ్వరిల్లి, ప్రజ్వరిల్లి వెన్నెల దుప్పటిని మీదికి లాక్కున్న నీలపు నీతి దూది పరుపులా నిలిచింది. సప్తసాగరాలూ కుదించుకుని, కుదించుకుని, ఘనీభవించి, నీటిపెళ్ళలా–ఐ–కోటి పొరల రస భావాలన్నీ అద్వైత తాదాత్మ సిద్ధిపొంది, కాటుక తీరాన కనుచూపులలో అమరమైపోయి కను కొసలలోని చెమ్మగా మారిపోతున్నాయి. అనుభూతి వొత్తిడికి తట్టుకోలేక యెర్రని పెదవులమీద చిరునవ్వులా చింది–సాంద్రతకి వుక్కిరిబిక్కిరై అలల పెదవులమీద పాలదొంతర నవ్వులై పోతోంది."

వడ్డెర చండీదాస్, "హిమజ్వాల"

****************

## రాంబాబూ..నీకొక లేఖ

మై డియర్ రాంబాబు,

ఎలా ఉన్నావు? అసలు బొత్తిగా కనిపించడం మానేసావు. కనీసం పరామర్శగా ఓ ఉత్తరం ముక్కయినా రాయలేక పోయావా? ఎంత కాదన్నా చిరకాల మిత్రులం, అవునా? ఉత్తరం రాయటం మొదలు పెట్టేముందు గట్టిగా అనుకున్నా, ఇలా నిరసనగా మాట్లాడకూడదని. ఏం చేయను? నువ్వు ఇలా నన్ను మర్చిపోతావనుకోలేదు. తలచుకున్నప్పుడల్లా మనసు చివుక్కుమంటుంది. అదోలా నవ్వుకుంటున్నావా? 'మనసు' అన్నమాట చదువుకొని? నువ్వు తప్ప నాకు ఇంకెవరున్నారు చెప్పు? మంచో, చెడో నా గోడు వెళ్ళబోసుకోవడానికి సహాయం చేసేవాడివి. ఇలా అకస్మాత్తుగా కనిపించండం మానేసావు.. ఆలోచనలన్నీ బూజు పట్టి ఇదిగో ఇలా మెదడు గోడలకి వేళ్ళాడుతున్నాయి. అక్షరాలు గజిబిజి గందరగోళంగా అలుముకొని గాజు గదుల కిటికీలు పగలగొట్టి మరీ ప్రమాద హెచ్చరికలు జారీ చేస్తున్నాయి.

సరేలే, నా గొడవకేముందిలే, ఎప్పుడూ ఉండేదే కానీ నీ గురించి చెప్పు. ఎలా ఉంది జీవితం.. చివరిసారి కలిసినప్పుడు చాలా హడవుడిలో ఉన్నావు.. ఉద్యోగం, సంసారం, బాధ్యతలు.. ఎంతలా మారిపోయావో? అప్పుడప్పుడూ

అనుకొంటాను, కాలం మనుషుల్ని ఎంతగా మారుస్తుందా అని. ఆసియా ఖండం మొత్తం తిరిగి రావాలని, కెన్యా దేశపు పిల్లలకి పాఠాలు చెప్పాలని, చిలీ దేశపు చల్లటి ఎడారుల్లో నెరూడా కవితలు చదువుకోవాలని అంటుండే వాడివి. పోయిన సారి మాట్లాడినప్పుడు కంపెనీ కారు, జీతం తప్ప పెద్దగా మాటల్లేవు మన మధ్య.. కాలేజీలో తరగతులు ఎగ్గొట్టి మరీ చర్చించేవాళ్ళం. ఛస్తే ఇలాంటి ఉద్యోగాల్లో ఇరుక్కోకూడదని, డబ్బు సంపాదనలో మనల్ని మనం మర్చిపోకూడదని.. ఊపిరి పోయినప్పటికీ మైథిలి నాన్నలాగా ప్రవర్తించకూడదనీ. గుర్తుందా? మరెలా ఇక్కడకి వచ్చామంటావు? సంఘం.. ఈ సంఘం ఉంది చూసావూ? ఇదంతా దాని మహిమే. ఒక్కొక్క మనిషినీ గురిచేసి, గాలంవేసి, ఆశయాలని ఒక్కొక్కటిగా బయటకి లాగి, అపనమ్మకాల్ని రాచివేసి, వ్యక్తిత్వాన్ని రూపుమాపి, కొనఊపిరితో మళ్ళీ లోపలకి తోస్తుంది. ఇదంతా కనీసం పెదవి కూడా మెదప ధైర్యం లేని వెన్నెముక లేని వెధవాలందరూ ఆత్రంగా వేచి చూస్తుంటారు.. "నేను చెపుతూనే ఉన్నానా, వీడెందుకూ కొరగాడని.. చూడు ఇప్పుడేమైంది.. మిడిసిపాటు పడినన్నాళ్ళూ బానే ఉంది, ముందు ఉంది పండగ". ఎంతో కొంత, ఏదో మూల మిగిలి ఉన్న ఆత్మాభిమానం ఈ దెబ్బతో ఆఖరు. యధావిధిగా చిన్న చిరునవ్వు నవ్వి చేతులు దులుపుకొని, జూలు విదిలిస్తుంది సంఘం. బొత్తిగా దయలేని క్రూరమృగం.

కానీ పెరుగుతున్నప్పుడు ఇవన్నీ ఆలోచించే వాళ్ళం కాదు. జీవితం ఇప్పటిలా బూడిద రంగులో ఉండేది కాదు.. ఎన్ని రంగులు, ఎన్ని కలలు? గుర్తుందా మొదటిసారి మనిద్దరం ఒకరికొకరం తెలిసినప్పుడు.. అప్పటిదాకా నాకు తెలియలేదు, ఆ గోడ వెనకాతల ఉంది నువ్వని. ఎంత తొందరగా స్నేహం కుదిరిపోయిందో మనిద్దరికీ. జోరున వర్షం కురుస్తుంది ఓ రోజున.. అప్పుడే కలిపిన సున్ని ఉండలు నములుతూ , గోడ మీద పాకే చీమల్ని చూస్తూ రెండు గంటలు గడిపాం.. ఒక్కొక్క చీమ గురించి , దాని కష్టాలు, సుఖాలు, కలలు, కలహాలు, వీటి గురించి నేను కథలు చెప్పాను.. ఎంతగా సంతోషించావో గుర్తుందా? మనిద్దరం ఇలా గంటలు గంటలు పుస్తకాలు చదువుతూనో, మాట్లాడుకొంటూనో గడిపేసేవాళ్ళం, పెద్దవాళ్ళు వచ్చి తిట్టేవరకు.. అదిరా జీవితం అంటే.. ప్రధానమంత్రికి రాసిన ఉత్తరం? తొమ్మిదేళ్ళ వయసులో ఏం ఉద్ధరించాలనుకున్నామో కదా? మొదటిసారి లతను చూసినప్పుడు రాత్రంతా నన్ను నిద్రపోనీక తన గురించి మాట్లాడుతూ కూచోపెట్టి తికమక పెట్టావు. మరో పదిమంది అమ్మాయిలు, ఇరవై నిద్రలేని రాత్రుల తర్వాత అర్థమైంది, నాకు నీ వాలకం.. అందం నీ మతి చెడగొట్టేస్తుంది. రావి శ్రీను కోనేట్లో మునిగి చచ్చిపోయాడని తెలిసినప్పుడు, ఇద్దరం కన్నీరు మున్నీరుగా కలిసి రోదించాం.. మరి మైథిలి పరిచయం నిన్ను, నన్నూ ఇద్దర్నీ తుఫానులాగా చుట్టేసింది.. కాఫీలు తాగుతూ, కవితలు రాస్తూ ఆమె గురించి కలలు కంటూ సంవత్సరాలు గడిపాం. నువ్విచ్చిన ఉత్తరానికి బదులుగా తను పంపిన పెయింటింగ్ చూసి, ఆనందం తట్టుకోలేక ఊరిబయటి కొండ మూడు సార్లు ఎక్కిదిగాం... మొదటిసారి ముద్దుల్లో ఆకాశాన్నీ, ఆవేశాన్ని చుట్టి ఎర్రని కోరికల నెగళ్ళలో వయసు చలి కాచుకున్నావు.

తిరస్కారాన్ని ఎంత మర్యాదతో అంగీకరించావ్? నీకోసం నేను లక్ష ముక్కలయ్యాను. రెండు సంవత్సరాలు పాటు మనుషుల మీద నమ్మకం నశించి మైదానాల్లో తిరిగాను, తిరిగి నువ్వు నన్ను బతిమాలి తీసుకు వచ్చిందాకా.. మళ్ళీ మైథిలే.. ఎందుకింత పిచ్చి నీకా అమ్మాయంటే? ఇన్నాళ్ళ తర్వాత కూడా అప్పుడప్పుడూ నీ గుండె చప్పుళ్ళలో అప్పుడప్పుడూ ఆమె పేరు వినబడుతూనే ఉంది నాకు.. చివరకు ఆమె వెళ్ళిపోయింది.. వెళుతూ, నీకా రెండు రాత్రులు

మిగిల్చి వెళ్ళిపోయింది..

అదిగో, ఆ రాంబాబు నాకు గుర్తున్న రాంబాబు. అలాంటి వాడివి.. నన్ను భద్రంగా, ప్రాణప్రాయంగా చూసుకొన్న వాడివి.. కనీసం పలకరింపు కూడాలేక నిరాకరిస్తున్నావంటే అర్థంలేకుండా ఉంది.. ఏమిటో ఇవ్వాళ్ళ బాగా గుర్తు వచ్చావు. సన్నగా తుపర్ల మధ్య, వయ్యారపు గాలి తెరలు, పండుటాకుల్ని సుతారంగా వయ్యారంగా మోసుకొచ్చి నా కాళ్ళ దగ్గర పడేస్తున్నాయి.. నువ్వేమో మోడుబారిన చెట్ల మధ్య , మంచుపొరల దుప్పట్లు కప్పుకొని, కాలం కళ్ళు మూసేసి, ఈ లోకాన్ని కాదంటున్నావు.. ఎందుకిలా మన మధ్య దూరం పెరిగిపోయింది? నాకర్థం కావటం లేదు.. కనీసం ఒక్క ఉత్తరం ముక్కయినా రాయి.. మళ్ళీ మాట్లాడ్డం మొదలు పెట్టామంటే, మనిద్దరిమధ్యా పేరుకొన్న ఈ నిశ్శబ్దం కరగటం ప్రారంభిస్తుంది.. ఎదురు చూస్తూ ఉంటాను, నేస్తం.

ప్రేమతో, నీలోని కళాకారుడు
రాంబాబు.

## *Follow Your Heart!*

వెన్నెల లేని ఓ రాత్రి చిక్కటి రహస్యాలు దాచుకొన్న మైదానపు ఒడ్డున
క్షితిజ రేఖల్లో మేలిముసుగులు తొలిగించి క్షణికంలో మెరిసి మాయమై
నీడల మాటున వెలుగుల తీరాన స్వప్నలోకాలకు వెచ్చని ఊపిరి ఊది
ఉరుముల మధ్యన వెండి విద్యుత్తు కెరటాలతో ఆకాశాన్ని చీల్చుకొని
నదీ తీరాల్లో వికసించిన వసంతపు అలలు సృష్టించిన శూన్యాన్ని ఛేదించి
ఈదురు గాలికి వంకలు తిరిగిన వడ్లకంకుల బంగారపు మెరుపులో కరిగి
జోరున కురిసే మేఘాల కలసి వర్షపు ధారల్లో అద్భుతమైన వంకలు తిరిగి
అనంతంగా మారే .... కవిత్వం, అది లయానందం!
శీతాకోక చిలుకల రంగులద్ది, అర్థంకాని చిన్నెలు దిద్ది
అంతులేని హర్షం అంతటా వ్యాపించి, ఆహ్లాదం విస్తరించి
ఏకాంతంలో ఆకాశం వలపుల వగరుస్తే .. అది సౌందర్యపు స్వాంతన!
స్వాతి చినుకు, చకోర పక్షి, ముత్యపు చిప్ప, నక్షత్రపు వాన
విశ్వ కాంతి పుంజాలు శరీరపు నాడీ తంత్రుల్ని మీటి హృదయంలో ప్రతిధ్వనిస్తే

బ్రహ్మలో పరబ్రహ్మ లీనమైతే, హద్దులు, సరిహద్దులూ మాయమైతే ..

అది.. అది.... మనిషి జన్మకి అర్థం!

గత రెండు సంవత్సరాలుగా నాకు తోచిన ఆలోచనల్ని పంచుకోగలిగే అవకాశానికి కృతజ్ఞతలు.. చివరిగా నాకు అతి ముఖ్యమైన ఆలోచన్ని మీతో వదిలి వెళ్ళ దలుచుకొన్నాను. ఫియొడోర్ డోస్తయెవెస్కి అంటాడు, మనిషికి కావలసిన వస్తువులన్నీ సమకూర్చి, సంతోషంగా ఉండడానికి అన్ని ఏర్పాట్లు చేసి, తప్పనేది జరగకుండా జాగ్రత్తలు తీసుకొన్నప్పటికీ ఒక్క విషయం మాత్రం మార్చలేము అంటాడు. అది ఏంటంటే, చుట్టూ ఉన్న పరిస్థితుల్ని కాదని, సాహసించి తనకంటూ ఓ మార్గం వెతుక్కొనే మనిషి నైజం. దీని మూలంగా తన జీవితంలో అన్నీ కోల్పోయినా, సౌకర్యాలు నశించినా తన ఆత్మను సజీవం చేసే ఈ గుణాన్ని మాత్రం ఒదులుకోలేడు అంటాడు. దేన్ని ఛేదిస్తున్నామన్నది అంత ముఖ్యమైన విషయం కాదు. ఎవరో అన్నారు చూడు "దేనికోసం నువ్వు చావడానికైనా సిద్ద పడతావో, దాన్ని కనుక్కునేంత వరకూ నువ్వు జీవించడం ఆరంభించలేదు". అది మనందరి జీవితాల్లో ఆదో ఒక క్షణంలో ఎదురవుతుందని ఆశిస్తూ.. శెలవ్!

"Tell your heart that the fear of suffering is worse than the suffering itself. And that no heart has ever suffered when it goes in search of its dreams, because every second of the search is a second's encounter with God and with eternity. "

- Paulo Coelho in **The Alchemist**

